THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204319
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. [illegible] Accession No. [illegible]

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

THE

# Prameelarjuneeyam

( A Telugu Drama in Five Acts )

COMPOSED BY

The late Mr. D Krishnama Charlu,

"ANDHRA NATAKA PITPAMAHA"

BELLARY

Third Edition.

PUBLISHED BY

D. K Krishnama Charlu & Brothers,

BELLARY

Printed at the Bhuvanesvary Press,

BELLARY

1934.

All Rights Reserved.

Price] [Re. 1-0-0.

శ్రీ

# ప్రమీలార్జునీయము.

ఇది

"ఆంధ్రనాటక పితామహ" యను బిరుదము వహించిన

## ధర్మవరము రామకృష్ణమాచార్యులచేత

రచింపఁబడి

డా. కె. కృష్ణమాచార్లు, వారి సహోదరులవలనఁ బ్రకటింపఁబడెను.

మూఁడవ కూర్పు.

బళ్ళారి.

భువనేశ్వరి ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడెను.

1934

All Righte Reserved.

[ క్రయము రూ 1—0—0. ]

# All Rights Reserved.

Copyright 1914-by D. K. Krishnama Charlu & his brothers. This Book is fully protected by an Indian and foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language or stage it without permission or offer it for sale. A substantial copy of words, ideas contained herein constitutes an infringement of a copyright and notice is hereby given that a suit will be filed in every case or infringement.

Checked 1969

కాపీరైటు 1914 సం॥ బళ్ళారి ధ. కృష్ణమాచార్యుల కుమార్లు కాపీరైటుదార్లు ఈ పుస్తకము ఇండియా కాపీరైటుచేతను పరకీయమైన కాపీరైటుచేతను సురక్షితమైయున్నది. ఎవరుగాని యీపుస్తకము సంపూర్ణముగాగాని యింకొక భాగముగా గాని తాము వేఱు ప్రకటించుటకును మఱియు నొకభాషయందు భాషాంతరీకరించి క్రయమునకిచ్చుటకును, తాము పుస్తకర్తప్ర లేకయే ప్రదర్శించుటకును, హక్కు యివ్వబడదు. ఇందుగల పదములుగాని, భావములుగాని, ఏమాత్రమైన కాపీ చేసిన యెడల అది కాపీరైటు నుల్లంఘించినట్లగుటచే అట్టివారు దావాను పాత్రులగుదురు.

శ్రీ.

---

# పీఠిక.

ఈప్రమీలార్జునీయనాటకములోని యితివృత్తము జైమినిభారతములోనిది. ఇందు వీరహాస్యశృంగారరసములు ప్రాముఖ్యము నందియున్నవి ఇతరరసములును నచ్చటచ్చటఁ దావుగలదు. కథాసంవిధానవిధానమును, పాత్రౌచిత్యవైచిత్రియు, మనోహరసంభాషణాచమత్కారమును నేతన్నాటకకర్తకు వెన్నతోఁబెట్టినవగుట యాతని నాటకములఁ జదివినవారి కెల్లను దెల్లము. కావున నీనాటకమునందును నాగుణము లేకొంతయు లేక పాటింపఁబడియున్నవని సహృదయులు తెలియఁగఁగలరు.

హిందూసంఘమున స్త్రీల కిట్టిస్థానము నెట్టియ్య లోసంగియుండి నయెడ చర్చకెక్కి పూర్వాచారపరాయణులు లోకమునకు కీడు, సంఘసంస్కర్తలభిలషించుకొనువా రొకవంకకేడ్చునిమిత్తమని నిర్ణయింపఁ జూచుచుండి నిల్చియున్నది ఇట్టితరుణమున నేదో యొక నిర్ధారణమునకు దారి చేర్చునట్లు చూపుట నుద్దేశించియే యీనాటకము వ్రాయఁబడియుండునట్లు తోఁచుచున్నది. కాని యుభయపక్షులవారి వాదములను నీనాటకములో నందందు సమాధానములు దొరకనున్నవి. కావున నిది యొకవిధమగు సంఘసంస్కరణనాటకమని నుడివినను సత్యమును మీరినది కాఁబోదు.

సాధ్వియగు స్త్రీకి సహజముగ నుండు పవిత్రప్రేమయు, వీరశ్రేష్ఠుఁడగు పురుషునియందు గనఁబడు రౌద్రమును, ప్రమీలయందుఁ గాంచఁబడుచున్నవి. స్వాతంత్ర్యనిగ్రహణము నున్న గుపురుషధర్మముల నైనను అనుసరించినచో - స్త్రీ లతిదక్షతతో నిర్వహింపఁగల రని నుడువుటకుఁ బ్రమీలాపాత్రపోషణ మొకనిచ్చుచున్నది. అంతియ

కాని యిచ్చట గమనింపవలసినవిషయ మింకొకటి కలదు. తొలినుండి నిశ్చింతగ నవక్రపరాక్రమముచే నేజంకుగొంకులు లేక తన రాజ్యము నేలుకొనుచుండిన ప్రమీల, పురుషవర్యుఁడగు నర్జునుసంసర్గము చేఁదన స్త్రీత్వమును మాని, సఖికైన నోర్చి ప్రాణమైనఁ ద్యజింప సిద్ధపడుటఁ జూడఁ, దమస్వభావమునకు విరుద్ధములగు పురుషధర్మములను స్త్రీ లెంత చక్కఁగ ననుష్ఠించుచున్నను, నిప్పుడు కాకున్న మున్ముందైన, విరుద్ధధర్మావలంబన మనర్థదాయకమని స్పష్టముగ ధ్వనించుచున్నది. తుదకుఁ బ్రమీల యింతవఱకుఁ దానవలంబించిన పురుషధర్మముం ద్యజించి, పురుషజనోచితకర్కశత మాని, స్త్రీజనసహజముగ శిరీషకుసుమపేశలయు, ప్రేమమయస్వరూపిణియునై యర్జునునివరించి తనసర్వస్వమాతని కర్పించి తన జన్మమును సార్థకము గావించి కొనినది.

తరుణీజనసాహచర్యము చేనర్జునుని యోధవీరులగు సాత్యకిప్రముఖులు తమక్షాత్త్రముల మఱచుటయుగాక తాముగైకొన్న కార్యదీక్షకు భంగ మాపాదింపనైనఁ బాల్పడుటఁ జూడఁ బురుషులెట్టిధీరులైనను నాఁడువారిచూపు టంపలకుఁ జిక్కిరేని వారిధైర్యసాహసములు నీఱగుట తథ్యమని నిరూపితమగుచున్నది. స్త్రీలకుసర్వస్వాతంత్ర్యముల నిచ్చి, యెల్లప్పుడును వారితోఁ గలసి మెలసి తిరుగుచుండిన, నెట్టిచేటును నేలవాటిల్లునని భ్రమపడు పురుషుల కీనాటక మొకమంచి నీతిని గఱపుచున్న దనవచ్చును. అంతమాత్రమే కాక యెట్టిధీరమానసముగలతరుణీమణియైనను తనహృదయమునకు నచ్చుపురుషుని సహవాసమించుక లభించినంతనే తనధీరమానసమంతయుఁ గరఁగి స్నిగ్ధ పలుచనై పోవ హృదయము సోలిపోవ, నాపురుషుని జెట్టపట్టి ధన్యతనొంద నభిలషించుననుసూక్తి ప్రమీల యందు స్వానుభవమునఁ జేయెత్తి చాటుచున్నది. పురుషులతో సమానస్వాతంత్ర్యము బడసి స్వేచ్ఛగ వారితోఁ గలసి తిరుచుండిన నెట్టికీడును నేలవాటిల్లునని భ్రమపడు యువతులకును నీనాటకము మంచినీతిని గఱపుచున్న దనవచ్చును.

ఈనాటకమునను నుండును తత్తరంగము పూర్వాచారపరాయణుల కుచితరీతి సుబోధము గావించునని యొత్తి నుడువవచ్చును. మొట్టమొదట త్రికాలజ్ఞులగు ఋషిసత్తములచే నిర్ధరింపఁబడిన కొన్ని కట్టుబాటులు కాలక్రమమున శిథిలములై తమతొంటిరూపము మాసిపోవ, వికారాకారముల నిప్పుడు తాల్చియుండుట నూహింపవచ్చును. అట్టివికారరూపములే వానికిఁ దొలినుండియుఁ గలవని భ్రమించువారును నీనాటకమున మంచిహితమును గనవచ్చును. కావున నాంధ్రనాటక పితామహులని యితరనాటకములవలె నెన్నియో యిట్టినీతుల కాలవాలమగు నీనాటకమును గుణగ్రహణపారీణచణ మగు నాంధ్రలోక మాదరించుఁ గాత.

బళ్ళారి.
9—10—25.

ఇట్లు విన్నవించునొక,
బుధవిధేయుఁడు.

# కృతజ్ఞత

ఆంధ్రలోకమున కాంధ్రనాటక పితామహుని నాటకములపై నెంతాదరమో! కావుననే యాతని యొక్కొక్క నాటకమును పెక్కుసారులు ముద్రింపఁబడు భాగ్యము గాంచుచున్నది. వానిలో నీ ప్రమీలార్జునీయ మొకటి.

స్త్రీలకును బురుషులకును బ్రకృతిచే నొసంగఁబడిన భిన్నభిన్న దేహతత్త్వనిర్మాణమును, దాని ననుసరించి నైజముగ నలవడిన కర్తవ్య విభాగమును, గమనించి యాయాకర్తవ్యములకు దోహదముగ నేర్పడిన వేఱువేఱు ధర్మములను దారుమారు గావించుటవలన సంఘమున నెట్టికల్లోలము లుదయించుటయు, మరల వానిని యథావిధిగ ననుసరించుటవలన నెట్టిశాంతి చేకూఱుటయు నిరూపించుచు, ఘోరారణ్యమునఁ జిక్కి సరియగుత్రెన్ను గానక నలుదిక్కుల వెదుక నుంకించుచుండు నేఁటిహిందూ సంఘమున కీప్రమీలార్జునీయనాటక మొక రాచబాటను గనఁబఱచుచున్నది. «అసలు త్రొక్కనేల- కాలు గడుగనేల?» యని యడుగుచున్నది.

ఇంక స్త్రీపురుషుల కనుమతింపవలసిన సంబంధము విషయమై పూర్వకాలమునందుండిన విధానమునందలి బాగోగులును, నీకాలమువారు దానిని మార్చివేయఁదలంచు క్రొత్తరూపమునందలి మంచిచెడ్డలును, భావికాలమున కాదర్శప్రాయముగ నిలువఁబోవు విధానంపు సూచనలును నిరూపించుచు నీనాటక మొక ముఖ్య సాంఘిక సమస్యను బరిష్కరింపఁబూని చాలవఱకుఁ దన ప్రయత్నమునందు జయమందిన దనవచ్చును. సహృదయులు సూక్ష్మదృష్టితోఁ బరిశీలింతురుగాక.

ఈ నాటకము వ్రాయఁబడి పెక్కేండ్లయ్యు దీనియందలి నవీనత కొంచవడకపోవుటచేఁగాఁబోలు నిది నేఁటికిని బహుజనాదరమునకుఁ బాత్రమై తనరారుచున్నది. సర్వకాలములయందును సమానాదరణము నొసంగఁగలయొక విధమగు పరిపక్వదశ భావములకును, వాని నిమిడ్చికొన్న భాషకును లభించియుండవలయుఁగాక-అట్టి వానికిఁ గ్రొత్తయేమి ప్రాఁతయేమి? అట్టిదశ యలవడకపోవుటచే నెన్నిక్రొత్తలు ప్రాఁతలు కాలేదు? ఆంధ్రనాటక పితామహుని నాటకములు దినదినమునకును నవీనాదరము వడయుట కాతని భావములును, దదనుగత భాషయుఁ గారణములై యుండఁబోలు నని యూహించుట తప్పగునా?

ఆ కారణములకు మనసిచ్చి యెప్పటివలె మానాటకముల నాదరించుచుండు నాంధ్ర మహాశయుల యెడ మేమెంతయుఁ గృతజ్ఞులము.

బళ్ళారి,
29—1—34.

ఇట్లు విన్నవించు
ప్రకాశకులు.

## ప్రమీలార్జునీయము నాటకము—కథాసంగ్రహము.

### ప్రథమాఙ్కము.

రంగము 1. వనవిహార మొనర్చుచున్న ప్రమీలారాణియొక్క సేనానాయికలు ధర్మరాజుచే నశ్వమేధయాగమునకై విడువబడి మేఘవర్ణాదిరథికులు వెంబడింప వచ్చుచున్న హయమును బట్టుదురు.

రంగము 2. అర్జునునిచే రాయబారిగా బంపబడిన సుయోధనుని యాశ్చర్యవిచారము.

రంగము 3. ప్రమీలాదేవిసభ. యుద్ధవిషయికమైన యాలోచన. సుయోధనుని ఆగమనము యుద్ధారంభము.

### ద్వితీయాఙ్కము.

రంగము 1. యుద్ధభూమి అర్జునుని సేనానాయకులెల్ల ప్రమీలాసేనానాయికల కటాక్షములకులోబడుట. (మనోహరరంగము.)

### తృతీయాఙ్కము.

రంగము 1. అర్జునాదులకుదామె గెలిచినట్లు ప్రమీలయొక్క సఖులు వినోదములు చేయుట

రంగము 2. విచారగ్రస్తుడైయున్న యర్జునుని ప్రమీలచూచుట.

రంగము 3. కారాగృహమునందున్న పాండవవీరుల యుద్ధసంస్థ.

### చతుర్థాఙ్కము.

రంగము 1. అర్జునుడు సన్న్యాసి వేషమున కోటలోనికి బోయి మలయవతి మోసమునకు జిక్కి ప్రమీలా భవనమునకు బిలుచుకొని పోబడుట ప్రమీలార్జున సంవాదము.

### పంచమాఙ్కము

రంగము 1. ప్రమీల మోహావస్థ-ఆమెను గనకలతాదులూరడించుట.

రంగము 2. గంధర్వాంగన వేషమునసర్జునుని శిబిరమునకు బ్రమీల పోవుట. వారిసంవాదము. ప్రమీల సర్జునుడు తూలనాడినందున నామెకు కోపావేశము కలుగుట. పిమ్మట వెడలిన సేనానుల్లర్జునునికి దిగుట. వివాహములు.

### ఉత్తరరంగము.



**Bellary. D. KRISHNAMA CHARLU**

"ANDHRA NATAKA PITHAMAHA"

Born 1853—Died 1912.

శ్రీ

# ప్రమీలార్జునీయము.

## ప్రస్తావన.

శా॥ శ్రీవిఖ్యాతుఁడుపాండవేయమహదార్తింబాపి యెవ్వాఁడుమో।
దావిర్భూతిబృహన్నలాదులకుఁ గష్టాజ్ఞాతసంవత్సరం।
జేవిభ్రాంతియులేకయుండఁ దగమాయించెఁ గృపాపూర్ణుఁడా ॥
దేవుండీవుత భక్తసంతతులకుఁ దీర్ఘాయురారోగ్యముల్ ॥

—(o)—

### ప్రథమాంకము-ప్రథమరంగము.

హస్తిపురి-ధర్మరాజుని యిల్లు.

[ప్రవేశము: మృత్యుంజయుఁడు, శతరూపుఁడు నను నిరువురు బ్రాహ్మణులు.]

మృత్యుం—శతరూపా! నీవేటికి రాజునిట్లాడెదవు?

శత—నీమాటలింకఁజాలింపుము. సార్వభౌమపదవికి వచ్చియున్నవానికిట్టిదారిద్ర్యమా! ఏమేమో యిచ్చుఁగదాయని పేరాసలోవచ్చి యిట్లయితిమి. ఇంకేమనవలయు?

మృత్యుం—సార్వభౌమపదవికి వచ్చినమాత్రముననే ధనమెక్కడనుండి వచ్చును? ఉన్నంతలోఁ దగినమట్టుకు దానముచేసియేయున్నాఁడు.

శత—మృత్యుంజయా! నీవిట్లాడిన నాకుఁగోపమువచ్చును. ఇన్నిదినములనుండి నిరంకుశ ప్రభుత్వము గలిగియున్న దుర్యోధనుని యైశ్వర్యమంతయు నేమాయెను? అది లేకుండిన, నెవ్వరినడిగిన రొక్కమివ్వరు? కాకున్న నెంతదండిగా సేకరింపరాదు? ముఖ్యము ధర్మరాజుఁడు లుబ్ధుఁడు. కాకున్నఁ జచ్చిన వారినందఱిని వేర్వేఱుగాఁ గాల్చక యొక్క చితినె దినములకొలఁదిఁ గాల్పఁజేయునా?

మృత్యు—శతరూపా! నీవా మహీవరుని నిట్లేటికిఁ దూలనాడెదవు? మహారణమున మృతిఁజెందిన యక్షౌహిణులకొలఁది సంఖ్యగల రాజన్యుల నొక్కొక్కరి దహింపఁజేయుట సామాన్యమా? ఇదియునొకతప్పా? దండుగలువట్టుటయు, నప్పుగొనుటయు, క్షేమరాజ్యమునకర్హములా? దుర్యోధనుఁ డున్నధనమంతయు వ్యయముచేసి యుద్ధమునకుఁబెట్టలేదా? ఈ ధర్మరాజు ననవలెనా?

శత—కానిమ్ము, నీవా రాజునింతగాఁ బ్రశంసించెదవు. ఒక్కమాట. దీనికేముత్తరమిచ్చెదవు? కృష్ణుఁడు బావమఱఁదిగదా? వానినడిగిన నెంతధనమివ్వఁడు?

మృత్యు—అప్పుగానేకదా? అట్లుఋణముచేయుట ధర్మముగాదు. అదిగో! నకులుఁడును భీముఁడును వచ్చుచున్నారు.

[ ప్రవేశము: నకులుఁడు భీముఁడు. ]

నకులు—బ్రాహ్మణోత్తములారా! మీరిందేలయున్నారు? సదస్యులందఱుఁ జేరి ధర్మజు నాశీర్వదించుచున్నారు.

శత—ఆసదస్సునుండియే వచ్చితిమి. వేదఘోషమును, నాశీర్వాదములను, వినయములకును, విజ్ఞాపనములకును, విన్నాణములకును, వివేకములకును దక్కువలేదు గాని, విశేషదక్షిణలకే యభావము. అందుకే మేమిందు వచ్చితిమి.

నకుల—విప్రవతంసములారా! యుధిష్ఠిరుఁ డింతవఱకు విన్నవించెనే? ఇప్పుడు నిర్ధనుఁడనైయున్నాఁడననియు. మీఋణము నచిరకాలముననే పాపికొనుచున్నాఁడననియు, విన్నవింపఁడా? మీరలిగిన మాకేదిగతి? ఎట్లయిన మన్నింపుఁడు.

శత—శుష్కోపచారములు, శూన్యహస్తములు—

మృత్యుం—శతరూపా! నీకెంతటియవివేకము! ఎంతటిదురాశ? ప్రభువా! వీనికి దక్షిణయందభిలాషయున్నట్లు దాక్షిణ్యమున నభిలాషలేదు. వీనిమాటలఁ బాటింపకుము.

భీముఁడు—నకులా! ఈ బ్రాహ్మణులకేమిచ్చినను వీరికిఁదృప్తి గలుగదు. అతృప్తులైన వీరికి దారిద్ర్యమేలకలుగు?

[ ప్రవేశము: చారుఁడు. ]

చారుఁడు—భీమరాజన్యా! దేవరతల్లియగు కుంతిమాత వృషకేతు ముందిడికొనియేడ్చుచుండి పెనుమూర్ఛఁ జెందియున్నది. ధర్మజుతోడను నర్జునితోడను విన్నవింప వారుపోవుచు మీకుఁ దెలుపుమనిరి.

భీముఁడు—ఏమి! ఏమి! నకులా! మనముపోవుదము.

(నిష్క్ర—)

# ప్రథమాఙ్కము-ద్వితీయరంగము.

## ధర్మజునంతఃపురము.

[ ప్రవేశము: కుంతి (మూర్ఛిల్లి) ధర్మజ-భీమ-అర్జున-నకుల-సహదేవులు.)

ధర్మ—అమ్మా! ఎన్నఁడు లేనిభంగి నీకిది యేలగలిగె? అయ్యో! నీమోమున నిట్టిదైన్యము నిట్టిసంతాపము నెన్నఁడు నెఱుంగముకదా? ఏలయిట్లు దురపిల్లెదవు? నీవించుక మారుమాట వల్కకున్న మా ప్రాణములు నిలువవుకదా?

భీముఁడు—మాతా! ఇన్నిదినములుండిన మన సంకటములఁబాపికొంటిమి. అరణ్యవాసదైన్యమును నజ్ఞాతవాసకష్టమును సంగ్రామజయశంకయు నిరాయాసముగఁ గడఁజేరె. ఇదే నాచేత ధార్తరాష్ట్రశతముఁ జక్కడితి. ఇవియన్నియుఁ బరమసంతోషకారకములుగా నీమోమున వికాసభావముఁ జెందింపవలయునదిమాని, విలాపభావము నెట్లు చెందింపఁ జాలెను.

అర్జు—అమ్మా! ఎన్ని సంకటములకైననోర్చుకొంటివి. మమ్ముఁ బాసియేకతనముననుండుటకుఁదాళుకొంటివి. మేమరణ్యములనుండఁ జూచుటకోర్చుకొంటివి. బంధునాశమునకుఁ బ్రియపౌత్రనష్టమునకైనఁ దాళుకొంటివి. ఇప్పుడీభంగి శోకింప నేమికతము?

అనుబంధము 1.

కుంతి—తనూజులారా! నాకుఁగలపరితాప మింతయని చెప్పఁజాలను. అక్కటా! నేనేలమనియున్నదానను? ఏలనాహృదయము వ్రయ్యలుకాకున్నది! కుమారులారా! నేనేమని వచింతును?

అర్జు—అమ్మా! నీవిట్లాడిన మే మేమనఁగలము? అయ్యో! పరితాప మనియెదవుగాక కారణము దెలుపవే? యుద్ధమునఁ జచ్చినమనవారికై దుఃఖించెదవన్న నదియింతయుఁ దుదముట్టి యిన్ని దినములాయెనే. ఇప్పుడేల యీ శోకము!

కుంతి—హా! హా! కర్ణా!

అర్జు—ఆ లోకకంటకుఁడగు కర్ణుపై జ్ఞాపకముకలిగి వాఁడొనర్చిన పరిభవములఁదలంచి యిట్లువందురుచున్నదికాఁబోలు. అమ్మా! దురాత్ముఁడగు కర్ణుకొఱకు వగచెదవా? వాఁడొనర్చినదుష్కృత్యములఫలము వాఁడనుభవింపఁడా? నాచేతులార నామనసార నాసోదరులు కన్నులారఁజూడ వానినుక్కడంచితినే? యింకేల యీపరితాపము?

కుంతి—హా! దైవమా!—హా పాపాత్మా! నీవుగదా యాలోకైకవీరు నధర్మయుద్ధమున నేలకుఁ దెచ్చితివి?

అర్జు—హా! హా! ఇదేమిమాట? అమ్మరో! ఆయాసురబీజాని నిట్లేటికిఁ గరుణింపనెంచెదు? ఆ దురాత్ముఁడై పాంచాలినాసభలో నట్లాడి మాకెల్లఁ జెప్పరాని సంకటములు కలిగించి యొక్కరు నభిమన్యకుమారు నిరాయుధు దుష్టసంగ్రామమున నుక్కడంచిన యా క్రూరాత్మునిపై నీకేల యిట్టిప్రీతిగలిగె? వానిఁబొలియించినందుకు నీకొడుకుల నైనఁగాదందువే! వాఁడు నీకేనాఁటిచుట్టము? నీకొడుకులకంటె వాఁడు నీకెక్కుడయ్యె?

కుంతి—హా! కర్ణా! హా! కర్ణా! (మూర్ఛిల్లును.)

అందఱు—అయ్యో! ఇదేమి విపరీతము?

ధర్మ—అనుజులారా! మనకెట్టి ప్రాప్తి? మాతా! నీవుమమ్మెల్ల దుఃఖములపాలుచేసెదవు? నీసంతాపమునకుఁ గారణముచెప్పెదవేని నెట్టిదుస్సాధ్యకార్యమునైనను సాధించి నీకుఁగీర్తిఁ దెచ్చెదము. ఒండేని మేమిదే యరణ్యములకు మరల నేగెదము.

కుంతి—కుమారులారా! మీదుఃఖములకెల్ల నేను గారణభూతను. హృదయమున హాలాహలముదాఁచి దావాగ్ని నభివర్ధిల్లఁజేసియు వెలికిరానీయక కుళ్లికుళ్లి కమలికమలి తపియించి తపియించి యిట్లయితి. ఇంకేల దాఁచవలయు! కుమారులారా! మీయుత్తరజాతులకుఁబోలె నాకర్ణునకుఁ దిలోదకములనిండు. (ఏడ్చును.)

ధర్మ—ఏమీ? ఏమీ? అమ్మా! ఇట్టిమాటలాడితివి!

భీమ—అమ్మా! ఇట్టిభ్రాంతి నీకుఁదగునా?

అర్జు—తల్లీ! నీమాట యథేచ్ఛముగ నున్నదికదా! ఆ యంత్యజాతునికి మేమెవ్వరము తిలోదకములివ్వ?

కుంతి—కర్ణా! వాఁడంత్యజన్ముఁడుగాఁ డగ్రజన్మవిభాసితుఁడు.

అర్జు—అగ్రజన్ముఁడైన మేమేల వానికుదకము లీవలయు?

కుంతి—ఆకర్ణుఁడు సూతపుత్రుఁడుగాఁడు సూర్యపుత్రుఁడు. రాధేయుఁడుగాఁడు కౌంతేయుఁడు. నాకుఁ జిన్ననాఁడు భాస్కరు ననుగ్రహంబునఁ గలిగియుండినాఁడు.

అందఱు—హా! శ్రీహరీ! కర్ణా! (అందఱు మూర్ఛిల్లుదురు.)

ధర్మ—(లేచి) అయ్యో! తల్లీ! ఈనిప్పు నీచెఱఁగున నెట్లు మూటగట్టియుంటివే! అక్కటా! ఆకర్ణుఁడు మాయన్నయని యించుక తెలిసియుండెనా మేమీరాజ్యమేల యాశించుచుంటిమి? ఈబంధునాశనమునకేల యీకొనుచుంటిమి? కౌంతేయులకు మాకు రాజ్యముండవలయుననికదా పోరితిమి? కౌంతేయుఁడొక్కఁడు సర్వసంపదల నను

భవించుచుండిన మేమూఱడకుంటిమే? అమ్మా! నీవెంతఘాతుకివే? ఎంతకార్యముఁ జేసితివే? ఎంతసాహసమొనరించితివే! స్త్రీలనోట నింతనుండి యింక మాటనిలువకుండఁ బోవుఁగాక.

అర్జు—అయ్యో! నిర్భరము. ఈభీమాదుల మమ్మెల్లననినోర్చి పెట్టనికోటవలె దుర్యోధనసఖుఁడై పేర్చిన యావీరవరుఁడు కౌంతేయుఁడు కాకుండునా? కౌంతేయుఁడుగాకున్న నింతకీర్తియు నింతదానశౌండత్వముం గాంచునా? అయ్యో! నేభ్రాతృఘాతుకుఁడనైతిని. పుత్రఘాతుకీ! నిను మేమేలజనించితిమి?

కుంతి—పుత్రులారా! మించినపనికి వగచి యేమిప్రయోజనము? కాలకర్మములన్నియు వానికిఁ బ్రతికూలములైనందున జననమాదిగ మరణమువఱకు నిట్టిభంగి వానికిఁ గలిగె. వానికైనేఁ బరితపింపవలసివచ్చె. ఇప్పుడేమనుకొని యేమిప్రయోజనము? ఇదేవాని మాఱుగ వానితనూజు నీవృషకేతు—(వెనుకనున్న వృషకేతు ముందఱికిందెచ్చి) ఈ వృషకేతుఁ బాలింపుఁడు.

వృషకేతు—జననులారా! మీరేల వగచెదరు.

అర్జు—కుమారా! పగసాధించి నీతండ్రినిఁ జంపిన దురాత్ములమనియు భ్రాతృఘాతుకులమనియు మమ్ముఁ దెగడనాడక క్షమించెదవా?

వృష—తండ్రియేమి! సుతుఁడేమి! తమ్ముఁడేమి! అన్నయేమి! ఉత్తమక్షాత్రధర్మవిరాజితమగు సంగ్రామమున మీరెట్లు నిందార్హులు!

అర్జు—వీరశేఖరుఁడని జగములఁ బ్రసిద్ధిగన్న యాకర్ణునకు జనించిన నీకీగుణములవడి యుండుట హెచ్చా?

[ప్రవేశము: సేవకుఁడు.]

సేవక—యుధిష్ఠిరరాజన్యా! శ్రీ వేదవ్యాసమునీంద్రుఁడు నిన్న మీతోఁజెప్పినవేళ యయినందున వచ్చి భవనమునఁ గాచియున్నాఁడు.

అందఱు—హా! కర్ణా! హా! కర్ణా! (మూర్ఛిల్లుదురు) (యవనికపడును.)

—(O)—

## ప్రథమాఙ్కము-తృతీయరంగము.

### అర్జునుని యిల్లు.

[ప్రవేశము: అర్జునుఁడు.]

అర్జు—అక్కటా! ఈవేదనమునకేనెట్లు తాళుదును? మాతల్లియే తన తనయునిపాలిటి మృత్యుదేవతయాయెఁగా! అకర్ణునకుఁ గుంతీదేవిపోలిక యించుక యలవడియుండు టప్పుడప్పుడు తోఁచుచువచ్చెను. ఎంతవైరముండినను, నొక్కొకసారియామహాత్మునియెడ యుద్ధరంగమునసైతము నాకునిండుప్రేమయు నధికభక్తియుఁ గలుగుచుండు. దానికిఁ గారణ మరయఁజాలక యూరకపరితపించుచువచ్చితి. అయ్యో! ఆకర్ణుఁడు మాయన్నయగుట వ్యాసమునీంద్రుఁడును భీష్ముఁడును గృష్ణుఁడును నెఱింగియుండిరఁట. వీరిలోనొక్కరైనమాయెడ నక్కటికముగలవారుకారైరే! ఒక్కరైననాకుఁ జెప్పరైరే! ఆకర్ణుఁడును నీ రహస్యము నెఱుఁగునఁట. ఎఱిఁగియు వీరశేఖరుఁడై దానిఁదరింపఁడాయెనఁట. అక్కటా! ఎంతటి ధీరోదారుఁడు! అయ్యయో! అట్టి మహోదారుని రణరంగమున బలిపెట్టువఱకు నేనిద్రింపనని క్రూరవైరము సాధించితినే! అప్పుడుగాదిప్పుడు చంపుదునని యుత్సహించితినే! నానావిధ హీనాలాపములనుగష్టనష్టకృత్యములను మమ్ముబాధించి యవమానించి రాజ్యముఁదొలఁగించి యరణ్యములకంచి వెతలఁ బెట్టించిన దుర్యోధనునిపైనను, నాకులభూషణు నామోహంపుఁగనయు నభిమన్యుఁ జంపఁ గారణభూతుఁడగు సైంధవుపైనను, నేకవస్త్రను రజస్వలను నామోహంపుటిల్లాలిని సభకీడ్చి తెచ్చి కట్టినపుట్టములొలిచిన క్రూరాత్ముండగు దుశ్శాసనుపైనను లేనిపగ, నాయగ్రజాతుపై, లోకవిఖ్యాతుపై, నలఘుబలోద్ధతుపై, నుదారగుణపరిపూర్ణుపైఁ గర్ణుపై సాధించితినే! అక్కటకటా! అమహామహుని పాద సేవాతత్పరములై యుండఁగల యీచేతుల—నీపాపపుఁజేతుల—నామహానుభావునికంఠచ్ఛేదన మొనరించుపాడుబాణము నెట్లు ధరించితి? పూజ్యుఁడా! అన్నా! యని యాయతిలోకవీరునిఁ బిలుచునోటఁ, గ్రూరకర్మా! చండాలా! యనియెట్లుపిలువనోర్చితిని? ఆయశోవిశాలునిచరణముల నొత్తుకొనఁగల నాకన్నుల రూక్షభంగి నాతనినెట్లుచూచితి? అయ్యో! నిర్దయాస్వాంతుఁడనై యాపూతచరిత్రుఁబరిమార్చితి. అక్కటా! నేనేడఁబరిమార్చితి? ధనువునబాణ మెక్కుపెట్టినమాత్రమున ముజ్జగముల వారికిఁ గలగుండు పెట్టఁజాలు నాయతిరథశ్రేష్ఠుని నొక్కరుఁడని నెదిరింపఁజాలువాఁడా? కూలుపఁజాలువాఁడా! ఇంద్రవంచనమునఁ గవచకుండలములు గోలుపోయి జామదగ్నిశాపమున దివ్యబాణములపై మదితప్పి బ్రాహ్మణశాపమున రథము భూమి దిగఁబడి విరథుఁడై తనకుఁదానే చచ్చెఁగాక, నేనతని నిర్జించువాఁడనా? ఎదుటనిలు

చువాఁడనా? అయ్యో! ఆ కర్ణుఁడు మాయన్నయని యించుకంత తెలిసియుండెనా దుర్యోధనునకు మేమందఱము దాసులమై యాయన్న పాదములఁ గొల్చుచుంటిమే! రాజ్య మాసించి యుండమే! బంధుద్వేషమును గురుబాంధవమిత్రవధయును గాక యుండు నే! పాపులకు మాకట్టి ప్రాప్తి యెట్లులభించు? ఇందు నపయశమును దుఃఖమును నందు నరకమును లభింపనుండ నడ్డేఁగు? కృష్ణా! నీకు నింతటి ద్రోహబుద్ధి కలిగెనా? మఱందియని సఖుఁడని నన్నాదరించుచు సారథివై దైవమవై ననుఁబోషించుచుంటివే? ఈమాట నాకుఁ జెప్పకుండుటకు నే నేమి ద్రోహముఁ జేసితిని? ఇంతవాఁడనైనం జెప్పక పగవట్టి నిర్జింపఁ జేసితివే? ఎవరిని? నీమఱఁదియొక్క మఱఁది నేగదా? నీ మేనయత్త పెద్దకొడుకు నేగదా! అతఁడు నీ కేమి విషమువోసెను! అయ్యో! నేనూరకయీ మహాత్ముని నేల తెగడనాడెదను? నాప్రాప్తియిట్లుండ నెవ్వరు తప్పింపఁ జాలువారు?

అయ్యో! ద్రౌపదికై కదా మే మింతపగఁ బూనితిమి! ఆద్రౌపది లేకున్న నింకొక ద్రౌపది కలిగియుండును. రాజ్యము కావలెననికదా యింత సాహసమొనరించితిమి! ఆరాజ్యము లేకున్న నింకొక రాజ్యము కలిగియుండును. ఇప్పుడట్టియన్న మాకెట్లు కలుగును! అయ్యో! ఆ యన్న మాకు లేఁడయ్యెనే! ఇఁక మాకుఁ గలుగఁడుగా! హా! కుంతీ! యెంతటి దుష్కృత్యమున కొడిగట్టితివి! ఎంత కార్యముఁ జేసితివి! అయ్యయ్యో! ఈపాపము నేనింకెట్లు పాపికొందు? ఎందుఁ జొత్తును? ఏది తెరువు? అశ్వమేధముఖముఁ జేసిన నిట్టిపాపములు నివర్తించునని వ్యాసమునీంద్రులు బోధించి మాయన్న చే భీష్ముని వలన ధర్మములు [illegible] నుత్తరాయణ [illegible] నాముఖోద్యోగముఁ బలపిట్టించియున్నారు. అయ్యో! మాయన్న యనుచున్నాను. కర్ణుఁడు మాయన్న. ధర్మాత్మజునన్న యని పిలుచునప్పుడంతయుం నాకుఁ గర్ణుఁడు జ్ఞాపకమునకు వచ్చునే! దానిని నే నెట్లు మఱతును? అయ్యో! శతసహస్రాశ్వమేధము లొనరించినను నెన్ని పాపములు పోయినను నా కుహోదరప్రవరుఁడే యిచ్చినను మాయన్న మాకుఁ గలుగఁడే!

హా! కర్ణా! కర్ణా! అగ్రజా! యుధిష్ఠిరపూర్వా! నీరూపము నాకుఁ జూపరాదా! ఒండేని యిప్పుడే యంతరించి యీక్రూరకర్ముని నీపితృఘాతుకుని సంహరింపరాదా! అయ్యో! ఇంక నే నీభూమినుండను. ఉండను. నాకు యజ్ఞములు వలదు. యాగములు వలదు. ఊరును వలదు. అరణ్యమును వలదు. అమ్మయును వలదు. అన్నయు వలదు. ఇప్పుడే యీకర్ణునపధించినచోటికేగి చితియమర్చుకొని దగ్ధుఁడనయ్యెద. లేదేని జలపాత మొనర్చెద. విషము భ్రమింగెద. శూలమునఁ గ్రుమ్ముకొని ప్రాణములఁ బాసెద. ఎట్టిదుర్మరణమునకైన నియ్యకొందును. ఈవేదనమున కోర్వఁజాల అయ్యో! ఇచ్ఛామరణము సామర్థ్యము గలవా రెట్టి పుణ్యాత్ములు! అట్టిపుణ్యము నాకు లేకున్నదే! హా! కర్ణా! కర్ణా! (మూర్ఛ).

(యవనికపడును)

## ప్రథమాఙ్కము-తురీయరంగము.

### వీధి.

[ప్రవేశము: శతరూపుఁడు, మృత్యుంజయుఁడు]

శత—మృత్యుంజయా! ఈ యజ్ఞమున నైను మనకు దక్షిణబాహుళ్యముగాఁ గలుగునని నిశ్చయమా?

మృత్యుం—అందుకు సందేహము లేదు. కావలసినంత చిక్కును.

శత—ఈకొన్ని మాసములలో నాఁడు లేని ధనమెక్కడనుండి వచ్చెను?

మృత్యు—శతరూపా! మరుత్తను రాజు పూర్వము యజ్ఞము చేసినకాలమున బ్రాహ్మణుల కలవికాని ధనమును దానముచేసి యుండ వారికాధన మత్యధికమైనకారణమున, దానియందుఁ గావలసినభాగము వారు తీసికొని మిగిలినదానినొక్కయెడఁ జేర్చిపెట్టి యేకవాక్యతతో నాధనమెవ్వరికిఁ జిక్కిన వారిదేయగుఁ గాకయని చెప్పియుండిరని వ్యాసులు ధర్మరాజుతోఁ జెప్పి దానిఁ జూపించి తీసికొనునట్లు చేసియున్నాఁడని మనము వినలేదా?

శత—అయ్యో! ఈయశ్వమేధమునకుం జిక్కిన ద్రవ్యమునాఁడే జ్ఞాతిమేధమునకుఁ జిక్కియుండరాదా! అట్లయిన మనకు కెట్టింపగుచుండెనే!

[ప్రవేశము: ద్రావిడబ్రాహ్మణుఁడు]

ఇతఁడెవ్వఁడో బ్రాహ్మణుఁడు వచ్చుచున్నాఁడు. ద్రావిడప్రాణాయామము గారూ! నమస్కారము.

ద్రావిడ—ఏమి చేయుచున్నారయ్యా యిక్కడ? అయ్యో! ఆఁకలిచే సగమయితిని.

శత—సగమైయిట్లున్నావా! ఇంకఁ బూర్ణముగానుండిన నెట్లుంటివో?

మృత్యుం—అయ్యో! బ్రాహ్మణా! ఈరాజ్యమున నిదియే మాఁకలియనుచున్నావు? ఇప్పుడు జరుగుచున్న సందర్భమేమి? నీవాడుపేమి?

ద్రావి — ఏమిసంరంభము ! ఏమిసంరంభము !

ఆర్య — బ్రాహ్మణా! ఏమియాజము జరుగుచున్నది! ఎంతదక్షిణలిచ్చుచున్నారు! దక్షిణ వాసన గుఱుతింపనేరని బ్రాహ్మణుఁడు పెక్కడి బ్రాహ్మణుఁడవు?

మృత్యు — దక్షిణవాసన యేమి తెలియును? పుళిహోర వాసనయైనఁ బట్టఁగలఁడేమో.

ద్రావిడ — నన్నేల హాస్యము చేసెదరు? సంగతియేమి?

(లోపల భేరీధ్వానము.)

మృత్యుం — అదిగో! భేరిమ్రోయుచున్నది వినుము. ధర్మరాజు అశ్వమేధకంకణబద్ధుఁడై యున్నాఁడు. ఇప్పుడు హయపూజ జరుగుచున్నది. పోదమురండు.

(నిష్క్రాన్తి)

—(౦)—

# ప్రథమాఙ్కము-పంచమరంగము.

———(O)———

## యజ్ఞవాటము

[ప్రవేశము: ధర్మ భీమార్జున నకుల సహదేవులు, (హయముఁ బూజించుచు) వ్యాసుఁడు-బ్రాహ్మణులు.]

వ్యాసుఁడు—(హయపూజనిలిపి) యుధిష్ఠిరా! ఈ హయము ఫాలపట్టిక సిద్ధమయి యున్నదా?

ధర్మ—అర్జునా! యెందున్నది?

అర్జు—అదిగో! సిద్ధమైనది.

వ్యాస—అందేమి వ్రాయఁబడి యున్నది?

అర్జు—(చదువును.)

శా. శాంతశ్రీనిధి వాజిమేధహయ ముత్సాహంబునన్ విడసూ।
కుంతీసంభవుఁ డంపె, వెంటనిటలాక్షుం గెల్చి శ్రీమించు నా।
ద్దాంతుం డర్జునుఁ డేగుదెంచె, వడిశూరప్రక్రియల్ ధీరతా।
స్వాంతుల్ ధారుణినుండు రేని ముకమొప్పన్ వాహముం బట్టుఁడీ॥

వ్యాస—మిక్కిలి చక్కఁగానున్నది. అర్జునుండంగరక్షగాఁ బోవుట మిక్కిలి మేలు. అర్జునకు సహాయులెవరు?

అర్జు—ప్రద్యుమ్నుఁడు-మేఘనాదుఁడు-వృషకేతుఁడు-సాంబుఁడు-సారణుఁడు సహాయులుగా రా నుద్దేశింపఁబడినది.

వ్యాస—మిక్కిలి మేలు. ఇంక హోమమునకుఁ బ్రారంభము చేయింతము.

(యవనిక పడును)

శ్రీ

# ప్రమీలార్జునీయము.

## ద్వితీయాంకము-ప్రథమరంగము.

స్త్రీమండలరాణియగు ప్రమీలాపురి సమీపమందలి కేళీతోట.

[ ప్రవేశము: కాదంబిని, చారుమతి, కనకలత, మంజువాణి, మాలతి, మలయవతి, మంజరి ]

**అందఱు—** అనుబంధము 2.

**మాలతి—** చెలులారా! చూచితిరా! యీవన మెంతరమణీయముగానున్నదో!

**మంజరి—** ఈలేఁత కెమ్మావికులఁ గంటివే! నీసరసనున్న దగమే యొకటొకటిగాఁ గోయుచును-

**కనక—** ఆహా! ఈసరోవర మెంత మనోహరముగానున్నది చూడుఁడు!

**కాదంబిని—** ఈసరసినున్న కమలములఁ గంటిరే! ఎట్టి వికాసభావము గాంచియున్నవి!

**మలయ—** ఉన్నవికాని నీవుమాత్రము వీనిఁ గన్నెత్తిచూచిన నవి ముకుళభావముఁ జెందఁ గలవు.

**మంజు—** మలయవతీ! ఇట్లంటివి? మనకాదంబినికన్ను లంతదృష్టి దోషము గలవియా!

**మలయ—** దానికన్నులకు దృష్టిదోషము లేదుగాని నీకుమాత్రము బుద్ధిదోషము.

**మంజు—** ఆఁ ఏమి, యిట్లాడెదవు! నాకు బుద్ధిదోషమా లేక నీకు వాక్యదోషమా!

**కనక—** ఇట్లేల మాటలాడెదవు? మంజువాణీ! మనకాదంబిని వీక్షించిన నందలి కమలములు ముకుళభావముఁ జెందునని మలయవతి యన్నమాటకు భావమారయలేవైతివా!

**మంజు—** మలయవతీ! నను క్షమింపుము. ఇపుడర్థము తెలిసె.

**మలయ—** తెలిసెనా? మంచి మేధావినివి.

**మంజరి—** అది యుండనీ. ఈగండుమీలఁ గంటివే? ఎట్లులికి యులికి యెగిరి యెగిరి పడుచున్నవి!

మలయ — ఈ కమలములు క్రిందఁ బడునో మేము క్రిందఁబడుదుమో యని పేరాసఁ బోరాడుచున్నవి.

మంజువా — నీమాట లించుకైన నాకుఁ దెలియవు. కమలములకు మీలకు నేమి స్పర్ధ?

మలయ — కొంచెము కన్నులు తెఱచి చూడుము, తెలియును.

చారు — చెలియలారా! చల్లఁగ నున్నది. ఇందింత కూరుచుందము. సఖీమణులారా! ఇపుడే మన మంబుఖేలన మొనర్తమా?

మలయ — మీకుఁ బ్రొద్దుపోవదో! అపూఁ బొదరిండ్ల నింత క్రీడించి పిదప స్నానము సేయుదము. పోదము. (ప్రక్కకుఁ బోవ)

[ప్రవేశము: హయముతో హయపాలకులు.]

## అనుబంధము 3.

కనక — మిత్రులారా! ఇది యజ్ఞాశ్వమైన మంచి సొగసాయె. మనము దీనింబట్టి మన ప్రమీలారాణికిఁ గానుకగా నిత్తము.

## అనుబంధము 4.

అందఱు — (అశ్వమును బట్టుదురు.)

మేఘ — (స్వ) ఔరా! ఈ స్త్రీలెంత సుందరులుగా నున్నారు? వీరితో మాటలాడవలెనన్న బెగడు కలుగుచున్నది. అయినను దగినఫంగి నుద్బోధించెదను. (ప్ర) నారీమతల్లులారా! మీ రేడ యీ యజ్ఞాశ్వమేడ? పట్టినంతనె యూరకపోను సుఁడీ.

కనక — పట్టినపిదపఁ బోవ నెట్లు పోవును? సఖులారా! దీని లలాటమున నేమో పట్టక యున్నది. దానిఁ గైకొని చదువుదము.

మలయ — (పద్యము చదువును)

కనక — ఔరా! „వీరసూసంతీ" యఁట? లోకమునఁ గుంతియొక్కతయే వీరమాతయని యీ ధర్మజుఁడెంచెఁగాఁబోలు! చూతము.

మేఘ — వనితామణులారా! ఇదేమి పిన్నాటయని యెంచితిరా? యజ్ఞము చేయనున్న ధర్మజుఁడును, వెంట వచ్చియున్న యర్జునుఁడును నెవరనియెంచితిరి?

## అనుబంధము 5.

కనక — ఓహో! „ధర్మజుఁడెవ్వరా"? తనయాలిని బగతురుపట్టి సభలోఁ బుట్టము లొలువఁ జూడఁజాలక తలవంచుకొనియుండి యదేపట్టుగా నెత్తిపై బట్టవేసికొని పండ్రెండేండ్లరణ్యమునఁ బడియుండిన ధర్మజు నీవ యెఱుఁగుదువో?

మలయ — అర్జునుని మే మెఱుఁగుదుము.

కాదంబి — మలయవతీ! ఎవ్వఁడే యాయర్జునుఁడు?

మలయ—ఉండనేలేదేమే, యదియుంగాక యిదియుంగాకవిరాటపురిలో గాజులంగంచుక ముం దొడింగించుకొని యాండువాండ్రకు విద్యచెప్పుచుండిన వేడి! అతండే కదే మయ్యా మీయర్జునుండు?

మేఘు—సతులారా! మీరు సతులవుట నేమన్నను జెల్లెంగాక, యొండైన—

మలయ—ఏమిచేయుమంటివి ?

కనక—మలయవతీ! అది యడుగవలెనా? సతులవుటచే నింత ధైర్యముగ నిలిచి నాండు కానున్న—

మేఘు—ఇంకూరకుండుండు. మీకుబుద్ధి చెప్పెద.

మలయ—నీ కాలికిం జెప్పుకొనుము.

మేఘు—భటులారా! యీకలహము మనసునలను. ఈయబలలతో యుద్ధమాడితిమని చెప్పుకొన్న సిగ్గుకాదా? తొలుత మన మాయయ్యునితో నీవృత్తాంతము వివరించి యతండు బోధించిన భంగి జరుపుదము. వనితలారా! అయిన మీరీ యశ్వమును విడువరు ?

కనక—మాయిష్టము.

మేఘు—మీ కిట్టిసరసము తగదనియు మీకీహయముం బట్టందగనియుం జెప్పుచున్నాను.

కనక—కావున నవశ్యము పట్టెదము.

మేఘు—అయినం బట్టుకొనిపొండు.

మలయ—మేము పట్టుకొనిపోవము.

మేఘు—మీరు రాక్షసులుగా నున్నారు.

మలయ—నీవు రాక్షసుని కొడుకవు గావా?

మేఘు—మీతో నేటిసంభాషణము?

మలయ—వలదు. (మేఘనాదాది హయపాలకుల నిష్క్రమము.)

చారు—సఖులారా! ఇది కడుమదుసూదనము. మీకుంజెలివి చాలదు, ఊరకీహయమును విడిచి మనదారిం బోవుదము.

కనక—చారుమతీ! నీకేమి తెగులు కలిగెను? ఇట్టిచేతగాని మగమాటలాడెదవు ?

చారు—కనకలతా ? నీకు వివేకము చాలదు. కాలునువ్వి మన మీకలహమున కేలపోవలయు ?

మలయ—చారుమతీ! నీగుణమే యిట్లా ? లేక, యారాక్షసునిం జూచి యేమైన మోహించితివా ?

అందఱు—(నవ్వుదురు.)

మలయ—కావంబిసి! మన మెల్లగ మీచారుమతిని నీ యశ్వముపై నెక్కించుకొని పోవుదమా వాహ్యాళి ?

చారు—ఇంకంజాలు మీసరసములు. (నిష్క్రమి)

అందఱు—(నవ్వి నిష్క్రమింతురు.)

## ద్వితీయాంకము-ద్వితీయరంగము.

### వీధి.

[ప్రవేశము: సుయోగుఁడు రాయబారి.]

సుయో—అహా! ఏమియీయాశ్చర్యము! ఈరాష్ట్రమున మగరూపుగల పురుషులేకాన రారు. స్త్రీలన్ననో యొక్కరిఁ జూచినకంటె మఱొక్కరిఁ జూడఁగూడనంత సున్నారు. ఆవిలాసములేమి! ఆకులుకులేమి ఆబెళుకులేమి! వర్ణింప శక్యముగాదు.

అనుబంధము 6.

మగవాఁడన్న నించుకైన భేదములేక చూచెదరు. చూచిరా! మొట్టమొదటిది నవ్వు. రెండవది కనుసైగ, మూఁడవది యొయ్యారము, నాలవది యేమో. వీరియొకట మగవాఁడే సతిఁబోలె సిగ్గరియై నటింపవలయుఁగాక వీరి కించుకైన సిగ్గు గనరాదు. ఇట్టి విపరీతము లుండునా! నేనీవీధినివచ్చుచుండ నొక్కవనిత యింటివెలితిన్నెపైఁ గూర్చుండియుండెఁ జూచి యచ్చెరువందితి. సర్వాభరణ భూషితయై ప్రస్తుతికి దిగిన యప్సరోయువతివోలె నలరారె. కొంచెము నిలిచి చూచుచుండఁగా, దానియజమానురాలి యాజ్ఞపనిది కనుపూవుటఁ గాంచి కనుపుబానిసయని యెంచితిని. మాయురే! ఏమిచిత్రమ మాపురివారిది! ప్రమీలారాణియొద్దను రాయబారమునకై సాంఘుఁడు నన్నంపియున్నాఁడు. ఆరాణి యెట్లున్నదో! అదెంత సుందరముగానున్నదో! నాపుణ్యమే పుణ్యము. ఇట్టియప్సరసల దాసీజనములుగా నొనర్పఁగలిగి యీపురివారికెల్ల నేలికయగు నాజగన్మోహినిఁ జూచుపుణ్యమెన్నఁడెట్టివారికి లభింపఁగలదు! అదియంతయు నుండెని. నన్నాయజ్ఞనుడు పంపినపని నేనొనర్పఁగలనా! ఊరుమాచినంతనే భ్రాంతిగలిగె. ఊరికాంతామణులఁ జూచినంతనే తొట్రుపాటుగలిగె. వారినవ్వులఁ జూచినంతనే మతివిభ్రమము గలిగె. ఏమేమో తోఁచుచున్నది. ఇట్టివాఁడనే నీసందేశకృత్యము నెఱవేర్పఁగలనా? ఇదిగో! ఎవ్వతెయో యొకనారి నాయెడకే వచ్చుచున్నట్లున్నది. ఇది సమీపమునకువచ్చి నను మాటలాడించెనా! దానిదాసుఁడనై దానివెంటనే పోయెదఁగాక, నాకార్యము ముగింపఁజాలను. కావునఁ బరుగెత్తి పోయెదను.

(నిష్క్రాంతి)

## ద్వితీయాఙ్కము-తృతీయరంగము.

### ప్రమీలయొక్క సభ.

[ ప్రవేశము: ప్రమీల ( సింహాసనమున ) కాదంబిని, కనకలత, చారుమతి, మలయవతి, మాలతి, మంజువాణి ]

అంకెలు—　　　　అనుబంధము 7

ప్రమీల—సంగతులన్నియుఁ దెలిసెఁగదా? తెలిసియో తెలియకయో మనవారశ్వబంధన మొనర్చిరి. ఇప్పుడొనరింపవలసిన కార్యమునకై మన మాలోచింపవలసియున్నది. మీరెల్లను ధీమతులు. ఈవిషయమున యుక్తాయుక్తములు తారతమ్యములు పరిశీలించి మీమీ యభిప్రాయముల దెలిపింపవలయు. కాదంబినీ! నీయభిప్రాయ మేమి?

కాదం—మహారాణీ! నాయభిప్రాయ మేమని యడుగవలెనా? సర్వవిషయములు కరతలామలకముభంగి నెఱింగి యెట్టి దురూహవిషయములనయిన మంత్రాలోచన మొనరించి కార్యసాధకముఁ బడయఁగల నీకుఁ దెలియని విషయ మేమున్నది? అయినను మా యభిప్రాయము నడుగుట మాపై నీకుఁగల ప్రేమను దెలియఁజేయుఁగావున మహాభాగ్యమని విన్నవించుచున్నాను. ఇప్పుడు మనమింత యాలోచన చేయవలసిన కార్యమే నాకుఁదోఁచదు. మందబుద్ధులగు పురుషులు మనల నబలాజనమనియెదరు. మనబుద్ధిప్రళయాంతకమనియుఁ గల్పించుకొనుచున్నారు. అవియెల్లఁ గల్లఁజేయను నేఁడు తఱివచ్చినది. అబలాజనమనుట పురుషుల ననవలయునో లేక తరుణుల ననవలయునో లోకము వారందఱు నేఁడే యెఱిఁగెదరుగాక. ధర్మజుఁడు "వీరసూకుంతీసంభవుఁడఁట". అర్జునుఁడు నిటలాక్షునిఁ గెల్చిన శూరుఁడఁట. వీరిసామర్థ్యములు పరీక్షించుటకుఁ దఱివచ్చినది. ఆకుంతి యెంతచన్నిక సొంపుగలదియో నేఁడేపరీక్షించెదము. మఱి యొవ్వరెట్లాడినను నాకుమాత్రము నెలవిచ్చిన నేనొకరి సహాయ మపేక్షింపక యాపార్థునకిననంతయును నుఱుమాడి వానినేలకుఁదెచ్చి నీకు దాసునిఁగాఁజేసెద. నాయట్టి సుభటశ్రేష్ఠులు వేనవేలు నీకలవడియుండ యోచింప నేలవలయు? యుద్ధమే కర్తవ్యము. ఇదియే నాయభిప్రాయము.

ప్రమీల—కాదంబినీ! నీమాటలుత్సాహజనకములై, యభిప్రాయము ధీరమై, యొప్పారెను. కనకలత ! నీతాత్పర్యమేమి?

కనక—దేవీ! విజ్ఞాపనము. దిగంతములనెల్ల నీ ధురీణత వలని కీర్తి నిండియుండ నార్జునుఁడైననీయెదుటనిలిచి పోరాడఁగలఁడా? తరుణులకెట్టి స్వాతంత్ర్యము నివ్వఁజనదు, వారికెట్టి విద్యలను నేర్పఁజనదు, వారినెల్లపుడు నేలఁబెట్టి కాలరాచవలయును, వారెట్టిశక్తి కలిగియుండజాలరు పురుషులకంటె మిక్కిలి హీనసత్త్వులను నట్టి యభిప్రాయములుగల మగవందలకు సిగ్గౌవునట్లు సమధికశక్తిసముపేతవై జైత్రయ విఖ్యాతవై, రాజ్యమేలుచున్న నారాయణివి కావానీవు? అట్టినీవు మమ్మెల్ల నభిప్రాయములేల యడుగవలయు? అయినను నడిగిన ప్రశ్నకు నుత్తరమీయకుండుట సేవకధర్మమునకు విరుద్ధము కావున వచించెదను. నీదాసి యేనొక్క తెరవేచాలుదు నాయర్జునుపోటుపడునా? ఈ కాదంబినియు నట్టిదయును. మాకంటె బలిష్ఠులగువారసంఖ్యయ ధృవచరిష్ఠలు నీకుఁగలరు. అట్లుండ నా పార్థునికై యేల చింతింపవలయును? తురంగముఁ బట్టితిమి. దురమునకుఁ దొడదట్టితిమి. ఇంక వెనుకదీయఁబోలునా? పార్థుఁడు కాదా నారాయణుఁడు వచ్చినను భీతిల్లువారెవరు? ఆ పార్థుండు నూపై నరికి వెడలవలయునన్న వానిపతి మంగళసూత్రము మిక్కిలి గట్టిగ నుండవలయుఁగదా? మహారాష్ట్ర సింధూమాళవాది దేశములనేలు దొరలందఱు మంతో నెన్నిమాఱులు సంగ్రామము చేయరైరి? నారిలోకప్రఖ్యాతుడైనఁ బల్లెత్తుకొని వెనుకకుఁ బోవలెదరే? ఈ నరుఁడు గిరుఁడా నారీకంటె నెంతయు నెక్కుడగువాఁడు ?

మ॥ జ్వలనాకుంఠిత లోకభీకరవిరాజద్భూరిదావానలున్ ।
శలభాళుల్ నిజపక్షమారుతములన్ జల్లార్పనేతెంచు భం ।
గి లసద్విక్రమరేఖమించిన మమున్ గెల్వంగ, నీయర్జునా ।
దులుప్పై వచ్చిరి, తామెకాల్పఁబడరో, దుర్వారయుద్ధంబునన్ ॥

కావున నేనీ కాదంబిని యభిప్రాయమున నేకీభవించెద.

ప్రమీల—కనకలతా! నీయుక్తులు శూరధర్మదాయకములు, మిక్కిలి యొప్పును, చారుమతీ! నీయభిప్రాయమేమి?

చారు—మహారాణీ! ధీరలధింగి పీరువాక్రుచ్చిన విషయములు మిక్కిలి యొప్పునని యిందున్న యందఱు శిరఃకంపమొనర్చి ప్రశంసించుచుండఁగా నాయభిప్రాయము చెప్పుటకు నాకే కొంకు కలుగుచున్నది అయినను మనఃపూర్వకముగ నొక్కరొక్కరియాశయము నాసతో వినఁగోరి దేవి ప్రశ్నమొనర్చినందున మనోగతాభి

ప్రాయమును నిశ్శంకముగా నొక్కి యిట్లనుమని భీతిల్లక చెప్పుటయే ధర్మమగు. కావున కొంచెమాని వచించెద. నే నీవిషయమున నింతకు మును పే దీర్ఘాలోచన మొనరించి యున్నాను. వానిఁజూడ నీ యుద్ధ మసమంజస మని తోఁచు చున్నది. తత్కాలమునఁ బ్రభవించిన ధీరగుణోత్సాహమున వలసినంత మాటలాడు చుండఁగాక, తారతమ్యముల గుఱించి యుక్తాయుక్తములఁ బరిశీలించి జయాపజయ ముల నూహించి వచింపవలెనన్న నించుకయోచనవలయు. ఆయోచనమానియూరక నోటికివచ్చినట్లు మాటలాడుట మొఱకుఁదనమగు. తొలుతఁదారతమ్యములయోచింతము. యజ్ఞ మొనర్చువాఁడు దేశదేశరాజకోటీరమణివిభోద్దీపితచరణయుగళుం డగు ధర్మాత్మజుఁడు. అతనిప్రాభవము మనము వినమా? ఆ మర్త్యాధముఁడు సూదిమొన యంతేని రాజ్యభాగమాతని కియ్యనని యేకాదశాక్షౌహిణీ సేనాసమేతుఁడై యాత నితో సమరమున కుద్యమించె. పదునెనిమిది దినములలో వాఁడును, వానిసేనయు, వానిబంధువులు మిత్రులు నేమైపోయిరి? మన మెఱుఁగమా! అట్టివానితో మన ము కారణములేని వైరము పూనుట లగ్గగునా! అది యుండనీ. వచ్చిన వానినింత విచా రింతము. వాఁడెన్నఁడో యుద్ధములో నెక్కటిపోరున నారికేతి పాశుపతాస్త్రముఁ బొంది నాఁడు. అమరేంద్రు నర్ధాసనమున కర్హుఁడనిపించుకొని కాలకేయనివాతకవచుల నొక్కరుఁడె పరిమార్చి దివ్యకిరీటమును దివ్యశంఖమునుఁబడసినాఁడు. ఒకయుత్తరుఁ డు తనకుసారథిగాఁ గౌరవబలము నంతయు నొక్కనాఁడె నేలఁ గెల్చినాఁడు. మును బాలక కౌదాయనిమిషులకైనఁ బోర జయింపఁజాలనివాఁడు. అట్టివానితో మనము సంగ్రామ మొనరింప మనకుజయము సిద్ధించునా! కావునఁ దారతమ్యభంగి యిట్టిది. యుక్తాయుక్తముల నెన్ని చూడ నిప్పుడు మనము పట్టినహయము నట్టె విడిచివాని తోడఁగూడఁగానుకలు సమర్పించి యాయజ్ఞునితో సంధియొనర్చుట పరమభావ్యము. ఇదియే నా యభిప్రాయము.

కం|| నయరీతి సద్గుణనకా ।
హయరాజముఁగానుకలును నర్పించుచు సం ।
ధయొనర్చుటయే తగు ని ।
శ్చయముగ ననిసేయు టదియపాయము దేవీ ॥

ప్రమీల — చారుమతీ! నీ యభిప్రాయము నిరపాయము. మిగిలినవారేమిచెప్పెదరో విచారించి చూచెద. మలయవతీ! నీయభిప్రాయమేమి ?

మలయ—దేవీ ! నాకుఁ జూడ నీచారుమతి మాటలజాడ యుక్తమని దోఁచును. ఇవిరణభీరువుల వచనములు. ధర్మజుని నాయర్జునుని నీ చారుమతి వందివోలెఁ బ్రశంసించి వారికి భీతిల్లినమాటలాడె. అనికి నిలిచిన నాయర్జునుఁడు కోదండాభిమరపాణియై వచ్చి నిలిచినను, సురాసురనరాసవధరాధరశరాసనుఁడే యామురాంతక పరాంబకుఁడే వచ్చి నిలిచినను, మనము వెనుదీయుదుమా? అంతభీరువు లగుటకు మన మేమిమగవాండ్రమా? ఏమి యీమాటలవలనఁ బ్రయోజనము? సంగ్రామభీమత్వంబునఁ బరిపంథిస్తోమగ్రామంబుల నిర్ధూమధామంబులఁ జేయఁజాలమా? నాకొక్కతెకే జయింతును. ఆ యర్జునుఁడొక్కటే పోరునఁ ద్రుంగోల్పఁజేసెనెఁగదా! నేనొక్కటేపోరున వీనినెట్లు చేసెదనో నీవ చూచెవుగాక. కాలకేయనివాతకవచుల నొక్కరుఁడె సమయించె నన్నుఖ్యాతి యాయర్జునునకుఁ గలదు. కౌరవసేననంతయు నొక్కరుఁడె నుఱుమాడె నన్నుఖ్యాతియుఁ గలదు. ఏరుద్రుని జయించినను, నేకేయు నేకవచుఁ జక్కాడినను నేసేనఁ గోల్పుచ్చినను మలయవతిని జయించుట యసాధ్య మనిపించెదను.

శా॥—ఆకామారినిఁ బోరఁ గెల్చినను దేవారాతులన్ గూల్చినన్ !
ఆకౌరవ్యులనెల్లఁ జీల్చినను నాకాధీశు మెప్పించినన్ !
ఈకాంతామణులన్ జయింపనగునే యొందేనియున్ ఖ్యాతి నేఁ !
జేకూర్పంగ రచించెదన్ గలనిలోఁ జీకాకుగావించెదన్

నాఖ్యాతి జగముల నించెదను. ఇంకే మభిప్రాయ మియ్యఁగలదు ?

ప్రమీల—మాలతీ ! నీ వేమందువు ?

మాలతి—రాణీ! ఈకాదంబిని, కనకలతామలయవతుల మాటలును నీచారుమతిమాటయును నాకు రుచికరములుగాఁ గనుపట్టను. యుద్ధమున వాఁడెన్నఁడ నేనెన్నఁడ యని నీవు మాటలాడెదవు గాక ముఖ్యాంశముల గుర్తింపవైరి. ఈయర్జునునితో నైనను మఱియెవ్వరితో నైనను మనకు యుద్ధమేల కావలయు! సానపట్టి చికిలిఁ జేల్చిన కుసుమశరాసనుని నారాచసముదయమో యనుభంగి రాజిల్లు మాయొంటు యుద్ధమునకని నిలిచినవారికి ధనువుపైఁ జేయిపోవునా! బాణములపై దృష్టిగలుగునా! యుద్ధమునకు మదిపుట్టునా ? మము వీక్షించిన మాత్రమున „దాసోహ” మ్మని కాళ్ళఁబడరా ! ఇంక యుద్ధమేటికి? సంధయేటికి ?

చ॥ ప్రకటకటాక్షమాత్రమున బల్విడి లోకములెల్ల గెల్చు బ ।
ల్చికిలి యొసంగ నూఱి మొనఁజేసిన సానమెఱుంగుపంచసా ।
యకునిశరంబులో యన నయారె వెలుంగమె మాకు యుద్ధమే
టికి మఱిసంధయేటికిఁ దటిత్కనదంగములన్ జయింపమే ॥

ప్రమీల—(నవ్వి) మాలతీ! నీ యుక్తి కను మనోహరము. నీవింతటఁ జాలుదువు. మంజరీ! నీ తాత్పర్యమేమి?

మంజరి—దేవి! మన మా యశ్వమేధ హయమును బట్టినదెందుకు? వినోదమునకా? విరసమునకా? పట్టినప్పుడు మనమేమియు నాలోచించక యీ కొంటెతనములకుఁ గార్యవైఫల్యము లెన్నియో వహింపవలసివచ్చును. ఈ యజ్ఞమునకుఁ గాను ఆ విశ్వేశ్వరుఁడు వచ్చినను బ్రహ్మేంద్రాదు లెత్తివేసినను హానిపఁగూర్చి కోటసంపద మనకుఁ గలదు. మనయూరికి యీ హయము నేల? పీడ దీనిగా నుంచుదము. అర్జునాదులందఱు వెలుపల నవయుచుండి వారే కాలక్రమమున నశింతురు. ధర్మజుని యశ్వమేధము నిరంతరాయముగా సమాకల్యముగా నెఱవేఱఁగలదు గాక! మనకేమి యుద్ధము వలదు. మనము వెలిపడఁ బోలదు.

ప్రమీల—మంజువాణీ! యింక నీ యుద్దేశమేమి!

మంజు—నా యుద్దేశమేమున్నది? [illegible] నే నెట్లు చెప్పఁగలను? ఈ హయ [illegible] కొంచెమైనను [illegible] లేదని [illegible] దాని యందును కొంచెము సౌఖ్యములను. సంధిచే గుణము నున్నది. సంధివలనఁ గొంచెము మేలును గొంచెము కీడును గలదు. మిగిలిన వారలతో యుద్ధమే ప్రశస్తము. అదియును మంచి చేకొని దాని యందును [illegible] లేకపోలేదు. సంధియు యుద్ధమును రెండును నొసఁగిన మేలని [illegible]. ఆ మనవారు [illegible] మాత్రము సంశయము. ముదట యుద్ధము కాలెనా సంధి కాలెనా యనవచ్చు. యుద్ధము చేసిన జరుగఁగల సంధి యేల. సంధి చేసిన జరుగఁగల యుద్ధము వేల. అనేకోన్నత [illegible] ములమేల. ఇవి కొన్ని విషయములమేల. మీకేది యిష్టమైన మేలని తోఁచునో దానిని నిర్ణయుడు. ఇదియే నా యభిప్రాయము.

తే॥ గీ॥ చాలమేలును గీడును సంధి దెచ్చు।
మేలు కీడును గలిగెడు నాలమునను।
సంధియైనను జరికింప సమరమైన।
మీకు నెయ్యది యిష్టమో నాకు నదియె॥

ప్రమీల—(నవ్వి) మంజువాణీ! మంచిమాటలాడితివి. ఇట్టి యభిప్రాయముల నాలు కొల్పి యేదేని కార్యమొనర్పఁ బ్రయత్నింపవలయు.

మంజు—అటుగాదు మీరు దీర్ఘాలోచన చేసితిరేని నా యభిప్రాయమే సత్యమనియు శ్రేయమనియుఁ దోఁచఁగలదు.

ప్రమీల — సత్యము నుటకు సందేహమేమి? "కుక్కలే కురకాలు కుండలే భాండములు" గదా? దీనికి దీర్ఘాలోచనమేల? ఆ యాలోచనము మాకుఁ జెప్పించియుండినఁ మేలుగా నుండెను. ఉండనిమ్ము.

మిత్రులారా! కనకలతాదులారా! మీ యభిప్రాయముల నన్నిటిని వింటిని. ఒకరొకరును విశేషధీశాలురై యుక్తవిషయము లనేకరీతుల నొకరికెక్కమియ్యని వారై యుండుటఁ జేసి ప్రతిభావిశేషమున వాదములాడిరి. మనము చిరకాలమునుండి శక్తిశాలులమని యనేకులచేతను బ్రసిద్ధిఁ గంటిమి. ఎందునులేని ధీరవర్తనమున నుంటిమి. వనితాజనము లబలాజనమనియు నపగతవివేకినులనియు నింతవఱకెవరును లేకాడుచున్న మగవందలకు సిగ్గువచ్చుభంగిఁ గంటిమి. రాజకార్యకరణమునను బరిపాలనవిశేషమునను పరినిబర్హణమునను గొఱఁతలేకయుండ నిన్నిదినములు కాలము గడిపిన మనమిప్పుడు వెనుకదీయుట యధీరగుణము. సంధికి మనమై పోవుట యశూరగుణము. సంధి యొనర్చిన నిన్నిదినములనుండి సాధించిన మనకీర్తి నిలుచు ననుట యవిచారగుణము. కావున మనమవశ్యము యుద్ధమే చేయవలయు. ఈ మాటలనుట వలన నేరిచాయకులని మాతవిశేషము నుచ్చరింపరావనకుఁడు. అవి యొనర్చిన వాదము క్షేమకరమే. అయినఁ గీర్తినిఁ గాలఁదన్ని క్షేమము మాత్రము దెచ్చుకొనుట భీరుత్వమనిపించును. ప్రాణలోభమనిపించును. కావున నవి సరిపడదు. యుద్ధజయమా? దైవాధీనతఁ గలుగఁగలదు. దానికెవ్వరు పూటగాఁగలవారు? మీఱిచచ్చినను నింద్రభోగముఁ బడయఁగలవారము. ఇందు జగన్నుతయశమునను నందుఁ జిరంతనభోగమైనను సమకూఱు. ఇట్టిపనుల నెన్నిదినములకు లభింపవలయును? ఆఁగాకిప్పటి యుద్ధమున మన కొక నొకవిశేషము గలదు. ఇంద్రుఁ బోర్చి ఖాండవముఁ దహించినట్టియు, రుద్రుఁ బోర్చి పాశుపతము గ్రహించినట్టియు, గోవాసికము నుఱుమాడి రాజ్యము నహించినట్టియుఁ, దనకెవ్వరీడు లేరని గర్వించి దిగంతముల ఘోటకము విడిచి దానికి రక్షగా నేనుండ నెవరు పట్టువారని వీరగర్వకంకణము ధరించేఁ బూని యీయశ్వకార్యము నిర్వహించినట్టియు నాక్రీడిని మనము జయించితిమా మనకెవ్వరీడు గాఁగలరు? మనకంటె నెవ్వరు విఖ్యాతులు గాఁగలరు? ఆ యింద్రుఁ డా రుద్రుఁడా కొంపలెల్లను మనచే నిర్జితులని యెంచఁబడరా? ఇంకఁ బరాజయము కలిగెనా మనకేమియు లోపములేదు. లోకము వారందఱు స్త్రీజితులని నవిసే యశ్వమునిం జయించిన మనధీరగుణము ప్రశంసింతురు గాక మనపరాజయమును లెక్కింపరు. పరాజితులమైనను రుద్రుఁబోలు సింహముతోఁ దులఁదూగువారమగుదుము. ఎట్లును మనకుఁగీర్తి కాస్పదము ప్రతిష్ఠించెను. ఈమాటలు వచించినతీరున మన మోహానాయకుల నర్జునాదులు వడిరా యింకను విశేషమే. అప్పుడే మంజువాణి వచించిన భంగి యుద్ధమును సంధియు, సంధియు యుద్ధము గలిగినట్లగు.

చ॥ జగమున నీవు గల్గని భుజాబలసారమహాస్త్రసంపదన్।
బగతురనెల్ల గెల్చి జగవందితకీర్తి నెసంగియున్నవా।
కగు సమరంబు దాన జయమైనఁ బరాజయమైనఁ గల్గుఁగా।
కగణితకీర్తియిట్టిసమయంబు ఘటించునె ధీరకోటికిన్॥

[ ప్రవేశము: సుయోగుఁడు. [

## అనుబంధము 8.

సుయో—(నలుదిక్కులఁ జూచి భీతియు నాశ్చర్యము నభినయించి) మహారాణీ! నమస్కారము!

ప్రమీల—మహారాణి యెవరు? నమస్కారమేమి? నీ వెవ్వరవు?

సుయో—నేను— నేను— నేను— నేను అర్జునుఁడు—అర్జునుఁడు.

ప్రమీల—నీ వట్టివాఁడా అర్జునుఁడు?

సుయో—కా-కా-కాదు. రాయ-రాయ-ధూ-సుయో స-కాదు యోగు-దీనితల గాల [illegible]ఁ-సుయోగుఁడు.

ప్రమీల—సుయోగుఁడవు కాని దుర్యోగుఁడవుగాని యేల వచ్చితివి? నిన్నెవ్వరిందు రానిచ్చినది.

సుయో—అయ్యమ్మ. ఆపె! అదిగో!

ప్రమీల—ఏల వచ్చితివి?

సుయో—దేవీ! నన్ను రాయబారి అర్జునుఁడుగా- కాదు రాయబారికి అర్జునుఁడమ్మా అయ్యో! ఇట్లేల పలుకుచున్నాను? ఛూ-ఛూ-కాదు చేతఁగాదు.

ప్రమీల—(కోపమున) దురాత్మా! ఈ యొడ్డోలగమున మము నవ్వులాఁట వచ్చియున్నావా? నీకుఁ దగిన శిక్ష విధింతును.

సుయో—కాదమ్మా, అవునమ్మా. లేదమ్మా.

ప్రమీల—పలుగాకీ-నీవిందు హాస్యమాడ వచ్చియున్నావా?

సుయో—అవునవును, కాదు కాదమ్మా.

ప్రమీల—కనకలతా! వీనికిఁ దగిన బుద్ధి చెప్పుము.

కనక—(లేచి సుయోధనునిఁ గొట్టును, ద్రోయును.)

సుయో—(త్రోఁపుపడి) అయ్యో! అయ్యో! ఈ బాజు-ఈ బాజు.

కనక—ఏమి బాజు? అదేది!

సుయో—(తనయంగీలోపలనున్న జాబుఁదీసి) అమ్మా! అమ్మా! ఈ బాజు చీకో.

ప్రమీల—జాబనుటకు వచ్చిన తిప్పలా? కనకలతా! యేమున్నదో యీజాబును దీసికొని చూడుము

కనక— (చదువును)

శ్రీమదంగనామండల రాజ్ఞియగు ప్రమీలాదేవికి:—

రాజశేఖరుఁడును రాజశేఖరసఖుఁడును నగు నర్జునుఁ డొనరించు విజ్ఞప్తులు. పాండుభూపప్రజాగ్రజుండగు ధర్మాత్మజుం డొనరించు హయమేధ సవనమునకై తిరుగవిడిచిన మా యాగాశ్వము మీసీమను మీవారిచేఁ గట్టఁబడియుండుట నీకింతవఱకు తెలియఁగకున్న నిప్పుడైన తెలియఁగఁ గలవు. నీకుఁ దెలిసి యీ వారివలన నీకార్యమొనరింపఁబడినదని నేనమ్మఁజాలను. కావున నిందుకుఁ బ్రతిక్రియగా నా యుత్తమాశ్వమును గొనివచ్చి మాకర్పింపవలయు. నీకుఁ దెలిసియే యీకార్యమొనరింపఁబడియున్న నదిదుష్కృతమని వచించుచున్నాను. అబలలకు మీకు మాయట్టివారితోడి వైరమనుచితము. ఫలప్రాప్తి లేకుండుట యట్లుండ ననర్థములు ప్రాప్తింపఁగలవు. శివునితో నింద్రునితో భీష్మాది కౌరవులతోఁ గాలకేయాది రాక్షసులతోఁ బోరాడినది నేన చెప్పికొన్న నాత్మస్తుతి కాఁగలదు. నీవు నాకీ జనమునకుఁ దల్లివనియు యుక్తాయుక్త పరిగ్రహణ శీలవనియు జనులందఱందురు. కావున మాఘోట్టాణము మాకర్పించి స్తుతిపాత్రవయ్యెదవో, లేదేని మద్బాణానలమునకు నింధనమవై మృతిపాత్రవయ్యెదవో నీవే దృఢీకరింపవలయు. విశేషములు వ్రాయఁజాలను.

ఇట్లు

వైరిరాజేంధన ధనంజయుఁడు,

ధనంజయుఁడు.

ప్రమీల—(జాబు చేతఁ దీసికొని) అవురా! ఏమి యీపాండిత్యము. మేముబలలమయిన దానెంత సబలుఁడో పరీక్షించెదముగాక. ఆత్మస్తుతి కూడదఁట. శివుని జయించినాఁడఁట. ఒక భిక్షువును జయించిన మాత్రమున నింతప్రతాపమా? ఉత్తమాశ్వమును దనకర్పింప వలయునఁట. వలయునన్న వానినే యశ్వముగా నొనరించి యెక్కి తిరుగాడఁ జాలనా! ఓరీ! రాయబారీ! యిట్టి తుచ్ఛపత్రికలు వ్రాయకుండ వానిధనంజయతకు నేనింతలోననె నాసర్వతోముఖపాండిత్యము ప్రసరింపఁ జేసి యార్చెదననుము? పొమ్ము.

సుయో—పోవ. పోవ- పోవలెనా?

ప్రమీల—మలయవతీ! వీఁడు పోవలేఁడఁట. కొంచెము చూడుము.

మలయ—(సుయోగుని మెడఁబట్టి త్రోయును.)

సుయో—అమ్మో! ఓసి! ఓసి! యేమి-యేమి?

(నిష్క్రా)

ప్రమీల—చూచితిరే సఖులారా! ఈ యజ్ఞుని యహంకృతి! దీనికిఁ దగినశాస్తి మన మొనర్పకున్న మనయంగనాత్వమునఁ బ్రయోజనము లేదు. మనమందఱము కృతసన్నద్ధులమై యుండవలయు.

మలయ—దేవీ! నీవఱకుఁ బనిలేదు. మేమే యిందుకుఁ జాలెదము. మాకుమీఱి వచ్చినఁ గదా నీవు కడలవలయు? కాదంబినీ! మంజరీ! మాలతీ! కనకలతా! మనము కృతసన్నాహుల మగుదము. పోదమురండు.

(నిష్క్రా)

శ్రీ

# ప్రమీలార్జునీయము.

## తృతీయాఙ్కము-ప్రథమరంగము.

### యుద్ధభూమి.

[ ప్ర: సాత్యకి-ప్రద్యుమ్నుఁడు-సాంబుఁడు--సారణుఁడు-నీలధ్వజుఁడు-సుయోగుఁడు- వృషకేతుఁడు-అర్జునుఁడు- మేఘవర్ణుఁడు. ]

అర్జు—సుయోగా! రాయబారమున నీకుఁగలిగిన యున్మాద మిప్పుడైనఁ దీరెనా! చక్కఁగ యుద్ధమునకు నిల్చెదవా లేక యింకను నాప్రమీలను నర్జునరాణియని పిలుతువా!

సుయో—దేవా! నాకున్మాదమని యేల పలికెదవు? ఆకామినులు ఎట్టి పురుషులను నవలీలగఁ గటాక్షమాత్రమున నిర్జించువారు. తుదకు నీవైన నేమి? ఆదేవినిఁ జూచితివా గుఱ్ఱమును గోదావరి వైచి యజ్ఞమును గంగకుఁ ద్రోలి యామరణము నిందే యుండుచుంటివి.

అర్జు—సుయోగా! నీమాటలింకఁ జాలింపుము. నీప్రసంగవిశేషమయ్యె. యుద్ధముచేయు నుత్సాహము గల్గిన నిందుండుము. ఆ కామినుల సౌందర్యమును వర్ణన చేయుతలంపు గల్గిన శిబిరమునకుఁబోయి యందుండి నీమనసార స్తోత్రముచేసి కొనుము.

ఉ॥ మంచివినోదమాయెఁ బలుమాఱును నిక్కడినారులం బ్రశం ।
సించుట మానవైతి విటు చెల్లునె పిఱిఁడిబుద్ధి పుట్టఁగా ।
నించుక నీమతంబు గణియింపఁగ వైరులయుద్ధభూమి ని ।
ర్జించెదొ కాకవారి పదసేవ యొనర్పఁగఁ బాఱిపోయెదో ॥

ప్రద్యుమ్నా! నిలధ్వజా! సాంబా? సారణా! సాత్యకీ! మేఘనాదా! మీరెల్ల నీ మాట పాటింపుఁడు. ఈ రాజ్యమున స్త్రీలు కడుసత్వము కలవారని మనము వింటిమిగదా? బాహు సత్వమునకంటెను కటాక్షసత్వమే వారి కెక్కువ గాఁ గలదు. అనేకకన్నుల సోయగపుఁ జూపులను మరులుగొనని వారుండు టరిది. అయిన వారిఁ గలసిన మానవులు నెలనాళ్ళలో సత్వహీనులై మృతిఁజెందుదు రని మనము విని యుండలేదా? ఈ విషయము మఱవక వారి మోహార్జవులఁ దగులుకొనక యేమఱ కుండవలయుఁ జుఁడీ! యుద్ధమునకు మనమిందొక మార్గము వెదకవలయు. మనమెల్ల నూరకొక్కెడ నుండక వేఱువేఱు మార్గములఁ జని యీ సాలభేదనం బొనర్పవలయు. ఇంతలో నాతరుణులే యుద్ధమున కేతెంచిరా మఱియు మేలాయె.

ప్రద్యు—మామా! అంతయు నెఱిఁగితిని. నీ విందేల యుండవలయు? ఉండినను నీవు యుద్ధమాడువాఁడవు కామకదా?

అర్జు—ప్రద్యుమ్నా! నిక్కమాడితివి. అంగన పేరుగల పురుషులతోడ నే(నేఁ అర్జునుఁడు) యుద్ధమాడనని ప్రతిజ్ఞ చేసుకొని యుండ నంగనలతో యుద్ధమాడుదునా? అయినను మీకలను చందము పరికించుచు నే నిందే యుందును.

మేఘ—ఈ తుచ్ఛాంగనల నిగ్రహించుట కతఁడు కావలయునా? నేనొక్కఁడ నాపనికిఁ జాలుదు. నీవిఁదేల యుండవలయు? ప్రద్యుమ్నాదులతోఁబొరిము మట్టడించి కోట పటాపంచలుగఁ జేసి హయము సాధించుకొని వచ్చెదను.

అర్జు—ఘటోత్కచ కుమారా! నీయిష్టము. నీచేతఁగాని పనియుండునా? నే శిబిరమున నే యుండెదను. మీ జయోదంతము నాకువచ్చి యెఱింగింపుఁడు.

(నిష్క్రమి)

మేఘ—ప్రద్యుమ్నా! మనమందఱను వేఱువేఱుగాఁ బోవుదము. ఈ నిలధ్వజుఁడు తన సేనతో వృషకేతుఁతోడ నుత్తరపువాకిట నుండువాఁడు. ఈ సాంబ సారణులు పూర్వపు గవనియొద్ద నుండఁగలవారు. సుమోఘునితో సాత్యకి దక్షిణపునఁ గావలి యుండఁగలఁడు. నే నిందే యుండెదను.

(మేఘనాదుఁడు తప్ప నందఱు నిష్క్రమింతురు.)

మేఘ—ఇదియేమి!మా ప్రాప్తి. వీర శ్రేష్ఠులతో నెందఱితోడనో సంగ్రామ మొనరించితిమి. ఎందఱినో జయించితిమి. తుదకు నేఁడీ యబలాజనముతో సంగ్రామము వాటిల్లెనే! అయినను దగినకొలఁది సాంత్వన వాక్యములఁ జెప్పిచూచెదను. ఎక్కడికిని సాధ్యము కాకున్న నుండ నేయున్నది. అందేమో తుములము వినిపించుచున్నది. పోయి చూచెదను.

(ప్రక్కకు నిష్క్రమి).

[ప్ర: కాదంబిని-కనకలత-మాలతి-మంజరి-మలయవతి-
చారుమతి-మంజువాణి.]

మలయ—

మ॥ ఇదె నేఁడున్నది మాయదృష్టసమయం బింకేవరాలోకలా।
ర దిగంతంబులఁ గీర్తిఁబెంప నరిఁబోరప్వేడ కుత్సాహమూ।
నిదరంబించుక లేక పోరుఁడు హిమారాత్రులన్ సాధుఁడన్।
వదలన్ లేక సతుల్బ్రైనంగువగనిండన్ జూపి సాధింపుఁడీ॥

సోదరులారా! నేఁడున్నది మనయదృష్ట పరీక్ష. మీరందఱు దిట్టలై యని సేయవలయు. ఇంతకుముం దారథికులందఱు నిక్కడఁ జేరియుండిరని వింటిమే వారెందుఁ బోయియుందురు? ఆహా! తెలిసెను. అదే యావైపున ధూళి రేఁగుచున్నది. మఱి యావైపున రథ నేమినిస్వనములు వినిపించుచున్నవి. ఆయెడ భటుల కోలాహలము శ్రవణగోచర మగుచున్నది. ఈ రథికులందఱు నొక్కరొకరు నొక్కొక యెడకుఁ బోయినట్లు గోచరించుచున్నది. మనము నల్లే పాయలు గావలయు. వారిలో నారాక్షసుఁడుండెఁగదా వాఁడెందైన నగపడినా కత్తిఁగింపుఁడు. వాఁడు కడుమాయావియని తోఁచుచున్నది. నాకుఁగల మాయోపహార విద్యకుఁదక్కవాని జయించుట దుర్లభము. పాండావైపున. కలకలము వినిపించె.

(మలయవతి తప్ప అందఱు నిష్క్రమింతురు.)

ఎవ్వఁడు వాఁడియ్యెడకు వచ్చుచున్నవాఁడు? ఆహా! పిల్లి వెదకఁ బోయిన యెలుక దానినోటఁ బడినట్లాయెను. వీఁడే యారాక్షసుఁడు. వీనిఁ జించి చెండాడెద.

[పుం: ప్ర: మేఘనాదుఁడు]

మేఘ—

శా॥ ఆహాహా! యిటులౌనె యాగడము పూర్ణాశ్లేష మింపారఁగా।
బాహాభ్యంతరసీమ నిల్పి మదనప్రఖ్యాతిసంగ్రామస।
మ్మోహాయత్తలఁ జేయఁగల్గఁదగుసొంపున్ మాని యీనారులన్
బాహాబాహిఁ గచాకచిన్ బెనఁగు దీనత్వంబు చేకూఱునే॥

అనుబంధము 9.

(స్వ) ఆహా! ఈయబల ధనుర్బాణ తూణీరపాణియై కదనమునకు వెడలిన దానివలెనున్నది. దీనిందొలి ముద్దుగాఁ గైకొనఁగాక. (సమీపించి) ఆహా! ఏమి యీ కామిని సౌందర్యము! సాక్షాత్కరించిన రతీసతివలె నున్నదిగదా! రాక్ష

సుఁడనైన నాకే భ్రమపుట్టించుచున్నది. అయ్యో! హయసాధకఘనకార్యమును బూనిన నే నిట్లాడవచ్చునా? (ప్రకాశము) అబలా!

మలయ— ఆ మాటనకుము. నీ మెడ తునియలై పడును.

మేఘ— ఓహో! అబలాయన్న నీకుఁ గోపమా? అట్లయిన మానెదను. ప్రబలా! ఇదే మిట్లాయితమై వచ్చితివి?

మలయ— సంగరమున నినుఁ జించిచెండాడుటకు.

మేఘ— అనంగసంగరము మాని యీ సంగరము నీ కేల!

మలయ— ఇదె నీ కా దేవలోకమున నున్న యప్సరసలతో నాసంగరమే కలిగించెద. చక్కఁగ నిలువుము.

మేఘ— అబలా! కాదు, ప్రబలా! నీమోము చూచిన నింతముద్దు కొలుచున్నదే! ఆది యీబాణక్షతముల కెట్లోర్చెడు? చంద్రసుందరమైన యీమోముపయి నే బాణము నెట్లువైవఁగలను?

మలయ— "ఎట్లు వేయఁగలవా" ఇదిగో యిట్లు మఱియు నిట్లు.

(బాణము వేయును.)

మేఘ— (స్వ) ఈ కోమలాంగి హస్తములు కుసుమములఁబోలెఁ గన్పట్టినను బాణములు మాత్రము నిశితములయ్యె. ఇంకఁ దడసినఁ బ్రమాదము.

## అనుబంధము 10.

మేఘ— కామినీ! నీ వంగన వగుటఁ జేసి సుమకోమల మగుని మేను కసిగందునని శంకించి క్రీడాయుతి నాబాణములఁ బాటించిన నాసత్త్వమింతే యనుకొంటివి కాఁబోలు. ఇదె నాగదచే నీతలఁ బగల్చెద.

(అని కొట్టఁబోవును.)

మలయ— నా బాణమున నీగద యేమాయెఁ జూడుము.

మేఘ—

## అనుబంధము 11.

(మాయమగును)

మలయ— ఈ మాయావి రక్కసుఁడు మాయాయుద్ధము చేయుచున్నాఁడు కాఁబోలు. ఆహా! ఈబాణ మెంతతీవ్రముగా నను నాటెను? ఇంక నా మాయోపహారవిద్యను బ్రయోగించెద. (కత్తి త్రిప్పును.)

## అనుబంధము 12.

మేఘ— (క్రింపఁబడును)

మలయ—(త్రాళ్ళచే వానిఁ గట్టును)

మేఘ—తరుణీ! నాయాన నీతో యుద్ధ మాడునభిలాషము నాకులేదు. నీకుమాయోపహారవిద్య వచ్చుట నే నెఱుఁగనైతి. ఈబంధనములు నాకొక యామమాత్రమే కదా యుండఁగలవు! నీవు ననుఁ గౌఁగిలింతువని నమ్మికపుట్ట నొక్క-ంతమాట యిచ్చితివా చచ్చుటవఱకు నిట్టి బంధనముననే యుండఁగలను. అనుగ్రహించి వాగ్దానమిమ్మా.

మలయ—రాక్షసా! ఈ సంగ్రామము నాకెంతమాల కంటివే?

మేఘ—ఇప్పుడుమాత్ర మీసంగ్రామము నేఁ గోరనే?

మలయ—ఊరక కట్లు పడియుండుము. ప్రేలకుము.

మేఘ—అయిన నాప్రార్థన మిచ్చినట్లేగదా?

మలయ—ప్రార్థనమేమి? ఊరకుండుము. నీచోట విన్నుంతును. పోదము రమ్మా.

మేఘ—ఏచోట? నీపడకటింటనా?

మలయ—అవును నీపడకటింటనే. పగలనక రాత్రియనక యందుఁ బండుకొనియుండ వచ్చును. వెలికిరాకుండ బీగముమాత్రము వేసియుందును. (అని యీడ్చుకొని పోవును.)

మేఘ—(పోవుచు) ఆహా! ఈయంగన సాంగత్యమే నన్ను నేమఱచునట్లు చేయుచున్నదే! (నిష్క్రా)

[ ప్ర: సాత్యకి మాలతి యుద్ధమాడుచు. ]

సాత్యకి—కామిని! నేను గౌరవయుద్ధమున వృద్ధుఁడనై గడిదేఱినవాఁడ. నీవోకన్నులు తెఱచి యుఁడెఱపని ముద్దరాలవు. నీచెక్కు-లు జీరిన వసలెడలుచున్నవి. నాతోడనా నీకుయుద్ధము! ఈసాత్యకి ప్రభావము కావలెనన్న నా సైంధవుఁడుపడిన యుద్ధమునాఁ డుండిన వారినెవరినైన నడుగుము.

మాలతి—ఆప్రభావము నెవ్వరినేల యడుగవలయు? సమక్షముననే తెలియునుగదా! ఊరక యని సేయుము.

సాత్యకి—రమణీ! నినుఁ జూచిన నాకన్నులకుఁ బరమానందము జనించుచున్నది. ఆనరకాసురునిఁ జంపిననాఁడున్న సత్యభామవలె నున్నావు. సుందరమగు నిట్టి నీ మేను నా నిశితబాణపరంపరల కేలపాలుచేసెదవు? చెడక యూరకపొమ్మా.

మాలతి— అనుబంధము 13.

సాత్యకి—(స్వ) ఆహా! ఆకౌరవుల యుద్ధమున ననునాటిన నెందఱు వీరులయొక్కబాణము లయినను నింతవాఁడిగలవికావుండె. ఇంచుక వయసు చెల్లినందున నాకీబాధ కలిగెనా ? లేక యీతన్వియే యంత బలశాలినియా !

## అనుబంధము 14.

తరుణీ ! నీధనుర్విద్యా కౌశల్యమునకు మెచ్చితి. నీ వే మడిగిన నడుగుము. లేదన కిచ్చెదను.

మాలతి—నాకుఁగల భాగ్యభోగములు నాకుఁజాలి నీయట్టివారిఁ బదివేవురఁ దనియఁ జేయునంతకలవు. అయినను నీ కై యిచ్చెదనన్న వలదనను, నాకు రణదానమిమ్ము.

సాత్యకి—(స్వ) ఔరా ! ఎంతధీరగుణము. (ప్ర) రమణీ! నీపేరు మాలతియంటివిగా? ఎంతతగనిపేరు ! ఆమాలతీలతకున్న మార్దవమునకును నీకుఁగల రణధీరత్వమునకును నేమిసంబంధము? అసిధారయని నీకుఁబేరుండిన బాగుగనుండును.

మాలతి—(స్వ) ఎంతమనఃపూర్వకముగ నుతియించుచున్నాఁడీరథికుఁడు! నిక్కంపు శూరుఁడు గనుక నే నన్నిట్లు ప్రశంసించుచున్నాఁడు. (ప్ర) వీరపుంగవా నేను స్తోత్రమునకు జయింపఁబడుదానఁగాను. సత్వముండిన సమరముచేయుము. కాకున్నఁ జితుఁడనైతి నను. నినుమాని శూరుఁడున్న యెడకుఁబోయెద.

సాత్యకి—(కోపమున) తెలవా ! నీక్షేమముఁ గోరి నే నాడినమాటలు నీకంత శ్రుతి కటువు లాయెనా! నినోఁటుపలుకుట వింతయా? (అని బాణము వేయును)

మాలతి—(క్రిందఁబడి) ఆహా! ఈశూరాగ్రేసరునితోఁ గదనము పండుగఁబోలె నన్నలరింపఁ జేసె.

సాత్యకి—తరుణీమణీ ! నే వలదన్నను మానక నాతోఁ గదనమున కుద్యమించితివే. ఇప్పుడు నీదేహవల్లి యెంతనొచ్చుచున్నదో! (శరీరము నిమురును.)

మాలతి—(లేచి) ఇంతటితోఁ దీఱె ననుకొంటివా? ఇదె నాబాణము వేసి నింత పరీక్షింపుము (బాణము వేయును.)

సాత్యకి—ఆహా! (అని క్రిందఁబడి) అన్యతోదరీ! ఇట్టి యధర్మయుద్ధము నీకుఁజెల్లునా? విరథుఁడనై విగతశరాసనుఁడనై యున్న వేళ నలుగు నేసితివి.

మాలతి—చాలును లెమ్ము నీధర్మము. నినుఁగ్రింద గెడపికరవాలమునఁగంఠమునఱుక నున్న భూరిశ్రవసునిఁ గృష్ణునామంత్రణమున నర్జునుఁడు కేలుద్రెంచి క్రిందఁబడవేయ నప్పుడా భూరిశ్రవుని నీవు చంపితివే యప్పుడు నీధర్మగుణ మెందుండెను? (త్రాళ్లచేఁగట్టును)

సాత్యకి—(కట్టుటకుఁజేతులిచ్చి) ఆహా! నీయట్టికోమలాంగి చేఁజేతఁ బంధింపఁ గను పుణ్యము కొంచెమా! కోమలాంగి యనుమాత్రముగాదు. సాక్షాత్కరించిన వీర లక్ష్మివి. నీమనసారఁగట్టుము. ఒక్కింత మోముమోమున మాత్రము సేర్పుము.

మాలతి—ఊరకుండుము చాలు నీముదుసలి మోహములు.

సాత్యకి—తప్పుఁబలికితివి. శరీరమునకే మైన వార్ధక్యము రానున్న రావచ్చుఁగాక నా మోహము మాత్రము కడుంగడు తరుణముసుమా.

మాలతి—(సాత్యకి నీడ్చుకొని) (నిష్క్రమి)

[ ప్ర: వృష కేతుఁడు మంజువాణి అర్భటించుచు ]

వృషకే—

అనుబంధము 15.

వృష—జాగా! ఈ కర్ణసూతి వృషకేతు నెవ్వనిఁగాఁ దలంచితివి!

మంజు—ఓహో! నీవు సూతసూతి సూతివా? నీకేటి క్షాత్రగుణము?

వృష—మాయయ్యను సూతసుతుఁ డన్న వానినాలుక తుండ్లుసేయ నేఁబ్రతిజ్ఞవట్టితి. అతఁడు పాండురాజాదిమకుమారుఁడని యెఱుఁగవో? ఏది! తాళుము. చూతమీతీవ్ర బాణము. (ఎక్కు పెట్టును)

చారు—(వృషకేతుని వెనుకనుండివచ్చి గిలిగింత పెట్టును)

వృష—(ఉలికిపడి ధనువు బాణము విడిచి వెనుకకుఁ దిరిగిచూచును.)

మంజు—(పరుగెత్తివచ్చి వృషకేతు నెత్తికొనిపోవును.)

[ ప్రవేశము; సుయోగుఁడు ]

అనుబంధము 16.

సుయో—ఘూర్తా! ఏమియుఁ దెలియనిబాలు నిట్లు చేసితివా? ఏదీ! యిటువచ్చినిలువుము.

చారు—నీ వెవరవు? లాణీయని మాదేవినిఁ బిలిచిన లాయబాలివా! ఆబాజు నేమి చేసితివి?

సుయో—నీపుణ్యమగు నూరకుండుము.

చారు—నేనెట్లూరకుందును? నన్నెఱుఁగవా? మనత్కారము మఱచితివా?

సుయో—(రోషించి) నన్ను మీదేవియొద్దకుఁ బిలుచుకొనిపోయిన చెలువవునీవేకదా?

చారు—(స్వ) వీఁడు మిక్కిలి భ్రాంతుఁడుగానున్నాఁడు. ఏయుద్ధము లేక వీనిజయింప వచ్చునని తోఁచుచున్నది. (ప్ర) అవును నేనే. ఇంతలో మఱచితివా?

సురో—నీపేరేమి?

చారు—పేరే మఱచితివా? నేనేమని చెప్పితిని?

సురో—ధీరగుణయని యేమో చెప్పితివిగదా?

చారు—కొంచెమే వ్యత్యాసము. ధీరగుణ గాదు చారుమతి.

సురో—చారుమతి యన్నట్టులేదు. ఏమో యెవ్వఁడెఱుఁగు? అప్పుడు నేనుండినస్థితిలో రాముఁడని చెప్పిన రావణుఁడనుచుంటిని. చారుమతీ! చూచితివా నీవెంత మోసకారిణివి? నీరాణియొద్దకుఁ బోయివచ్చినవెంటనే నా కాశ్లేషసౌఖ్యమిచ్చెదనంటివే? తప్పితివే?

చారు—అయ్యో! భ్రాంతుఁడా! నిన్నుఁ బిలుచుకొనుచు నీవెంటఁ బరుగెత్తివచ్చినను మాటలాడక పాఱిపోయితివే?

సురో—(తలను మెల్లగాఁ గొట్టుకొని) పాపిష్ఠిజ్ఞాపకము, పాడుబుద్ధి, ధీరగుణా! నేనప్పుడు నిక్కువముగాఁ మఱచిపోయితినా?

చారు—అదిగో! యిప్పుడే చారుమతి యనుమాటమాని "ధీరగుణా" యనసాగితివి. పేరు మఱచువాఁడవు ప్రేమ మఱవకుందువా?

సురో—అయ్యో! అయ్యో! ఈమాటనఁదగునా? నీముద్దుగారు మోము చూచిన నెక్కడలేని ప్రేమయుఁ ద్రవ్వికొనివచ్చుచుండ, మన్న ప్రేమపోవునా? ఇప్పుడైన నీ యాశ్లేషసుఖ మిచ్చెదవా? (తిరిగిచూచును)

చారు—నామాట యొనరించిన నీకాశ్లేషసుఖము, ముఖాసుఖము, పుత్త్రాసుఖము, అన్నియుఁ నిచ్చెదను.

సురో—దేవీ! నీవించుక యాజ్ఞయిచ్చినఁ జాలునే. వలసినపని యొనరింతును. ఏమి చేయుచుంటివి?

చారు—ఇందుఁ బండుకొనుము.

సురో—ఇక్కడనా? ఇచ్చోటనా?

చారు—ఎక్కడనైననేమి? ఎచ్చోటనైననేమి?

సురో—(సంతోషమున) ఆహా! అవశ్యము పండుకొందును. (పండుకొని) ఏమి చేసెదవు?

చారు—బోరగిలఁగమ్ము

సురో—అదేల?

చారు—ఇన్ని ప్రశ్నము లడుగువాఁడవు నీవుచెప్పినపని చేయుదువా? ఊరకపొమ్ము.

సురో—లేదు లేదు. వలదు వలదు. పండుకొందును. (బోరగిలఁబడును)

చారు—నీచేతులిట్టిమ్ము.

సురయో—(వెనుకచేతులిచ్చును)

చారు—(చేతులఁబట్టి త్రాళ్ళఁగట్టును)

సురయో—అయ్యో! ధీరాఙ్గనా! చారుమతీ! యిదియేమి? యిదియేమి?

చారు—ఇది యాశ్లేషసుఖము. (తలఁబొడిచి) ఇదిముఖసుఖము. (వీపుఁగొట్టి) ఇది కడుపుబ్బసుఖము. (తలవొత్తి ముఖము చూచి) ఇది యుత్తరసుఖము. (చేతులల్లాడించి) ఇది హస్తసుఖము. ఇవన్నియుఁ గలసినఁ జిత్తసుఖము. స్వాతిసుఖము ముందున్నది. పోవమురమ్మా. (ఈడ్చుకొనిపోవును.)

[ప్రవేశము: ప్రద్యుమ్నుఁడు]

ప్రద్యుమ్న—

గీ॥ వేఁడిగలభుజమేపారు వీరులెల్లఁ ।
జేడియల మోహశరములఁ జిక్కినేఁడు ।
జేల లగుచును బాలావిలోలురైరి ।
కామినులను గెల్చుఘనుఁడీ కాముఁడొకఁడె ॥

అవ్వైపునఁ గోటవాకిటఁ గావలికాడు వేసరితిని. మనసైన్యమేమాయెనో! భటులేమైరో! రథికులేమైరో! ఎందును వెదకినను గానఁబడకున్నారు. మేఘనాదుఁడుండిన యెడకు వచ్చినను నేమైనఁ దెలియునేమోయని వచ్చితిని. ఇందు మేఘనాథుఁడును లేఁడు, మాఘనాథుఁడును లేఁడు. వీరందఱు నీపుర నారీమణుల వలలలోఁ బడిరనుట నిర్ధారణము. అయ్యో! ఇంతటి యవివేకులెందైనఁ గలరా? కాపలయున్న వీరలకు వారు లెంకలు రాలైరి. వైరివారలఁ గొంపవలయునా? అదియును నిట్టిసమయమునవా? అర్జునుఁడన్న స్త్రీలపై బాణముఁ బూనననిప్రతిజ్ఞపట్టినాఁడు. కార్యసాధనము కావలెనన్న వీరివలనఁ గాదగియుండెను. వీరే యిట్లుజేలలై బాలాలోలురై డీలుపడిన నింకేమనవలయును? అంతమునను బిగఁబట్టుకున్న నెట్లు? తరుణుల మోములఁ జూడని బ్రహ్మచారులా? సన్న్యాసులా? ఇఁక నే నొక్కఁడ నిలిచితిని. ఇప్పుడే సాహసించి పురిఁ బ్రవేశించి కార్యము సాధింతును.

[ప్రవేశము: కనకలత.]

ఇందెవ్వతెయో వీరగుణమున భూరిరణమున కేతెందుదానివలె నున్నది. దీనినిప్పుడ చక్కడెద.

కనక— అనుబంధము 17.

ఓరీ ! వీరనూకుంతీపుత్రుఁ డనియు, శివునిజయించిన వాఁడనియు, లోకమున లేనట్టివాఁ డనియు నింతప్రశంసచేసుకొని యింతదూరము వచ్చితిరి. మే మనిసేయ వలయునన్న నిల్చువీరుఁడే లేఁడాయెఁగా? వచ్చినవారందఱు పరాజితులై చిక్కిరి. నీ వెవఁడవో నిలిచినట్టున్నది. నాచేతులతీఁటదీఱ రణమియ్య నోపుదువా ?

ప్రద్యు—(చూచియాశ్చర్యపడి) ఔరా! కామినీ! నీ వీభూమినున్న మానవవనితవు గావు వీరలక్ష్మి మోహనాకారమున నవతరించిన వీరమోహినివే. నినుఁజూచిన నా శస్త్రాస్త్రములన్నియు నుడిగె. కరుణించి నీయధరామృతపానమున కౌఁగయియ్యకున్న నే బ్రదుకను. రక్షింపుము. రక్షింపుము (నమస్కరించును).

కనక— వైరినిఁ జూచినంత నే ప్రణామ మాచరించు నీ వేనాటిశూరుఁడవు ?

ప్రద్యు— నే వీరుఁడఁగాను శూరుఁడఁగాను. వీరుఁడనే యనినీవన్న నిదే జితోఽస్మి యను వాఁడను. నాసతి జగన్నుతరూప విఖ్యాతయని తరుణుల వర్ణించునపుడు రతీసతీ సౌందర్యము గలదంచుఁ బ్రశంసించెదరు. ఎంతటి యజ్ఞానులు! నీ సౌందర్యమున నావంత యయిన నారతికిఁ గలదా? ఉండిన నేను నిన్నుపీడించుచుంటినా? ఇపుడు జితోఽస్మియనువాఁడను. నీవంగీకరింపకున్న హతోఽస్మి యనువాఁడను.

కనక—(స్వ) ఆహా! ఈ పురుషుఁడు నా సౌందర్యము నెంతవర్ణించుచున్నాఁడు! నా కెంతప్రీతి జనియించె! (ప్ర) కృష్ణకుమారా! నీకేలకలిగె నిట్టియశోహాని? లెమ్ము. ధనువు చేకొమ్ము. బాణముల సంధింపుము. కానున్న నిను రణభీరుఁ డందురు.

ప్రద్యు— కలికీ! నాకిది యశోహానియగునా? దివ్యాంగనలకైన లేని దివ్యసుందరతగల నీయట్టిసతి చేపట్టుట యా వింతయశమునకు మూలముగదా? ధనువేల చేపట్టవలయు, బాణములేల కావలయు? మదనుఁడు కుసుమశరుఁ డనియుఁ బంచబాణుఁడనియు? వాని శరములుజగమునంతయు గెలుచుననియుఁజెప్పుట యెంతయుఁగల్ల. నీశృంగార రూపముగల మోహిని కనుబొమ లనురెండుధనువుల నొక్కసారియే యెక్కుపెట్టి నీకటాక్షములనుబాణద్వయమును మాత్ర మనుసంధించినాహృదయపదమునంతయు నగలఁజేయుచున్నదిగదా? కామినీ ! నీ వనుగ్రహింపకున్న నే బ్రదుకను. నిక్కువ ముగా నే బ్రదుకను.

కనక— అనుబంధము 18.

ప్రద్యుమ్నా ! నీవా రణవిశారదుఁడవు ? నీయట్టికాతరులతో నాకేమిపని? వేఱొ యోధుకుఁ బోయెద. (పోవ).

ప్రద్యు—వధూమణీ! నీయట్టి వీరమోహిని శరణాగతాభయదాన వ్రతము పూనకున్నఁ ప్రయోజనమేమి? ఏదీనుఁడ. నినుశరణొందినవాఁడ. పోషింపుమా (నమస్కరించును)

కనక—అట్లయిన నినుఁ గట్టి వేసెద.

ప్రద్యు—నీబాహువల్లరులతోడనా?

కనక—కా దీరజ్జువులచేత.

ప్రద్యు—అవియే నీబాహుమృణాళములని భావించి తృప్తిఁజెందెద.

కనక—నిను నిర్బంధమున నుంచెద.

ప్రద్యు—నీయంతఃపురముననా?

కనక—కాదు కారాగృహమున.

ప్రద్యు—అందు నీవు నాదండ నుందువుకదా?

కనక—ఉండను.

ప్రద్యు—దర్శనమైన నియ్యవో! గంటకొకసారి లేక దినమునకు-వారమునకొకసారి?

కనక—ఏమో. అదేల యడిగెదవు!

ప్రద్యు—నీయిష్టము వచ్చినట్లొనర్పుము.

కనక—అయినఁగానిమ్ము. (బంధించును.)

[ ప్రవేశము: మంజువాణి.]

మంజువాణీ! నీవేమొనర్చితివి?

మంజు—కాదంబిని మొదలగు వారొక్కరొక్కరు, నొకని, నిరువురవీరుల మనదేవి కప్పనముగాఁబట్టిదెచ్చియున్నారు. నీకొఱకై నిరీక్షించుచున్నారు. నేనావృషకేతుఁడనుబాలుని, సాంబుఁడనువానిఁ గాదంబిని పట్టితిమి. పోదమురమ్ము.

కనక—ఈ మృగమును గొనిపోవుదము. (నిష్క్రి)

[ ప్రవేశము: నీలధ్వజుఁడు]

నీల—కం॥ సందేహమయ్యె మనవా।
రెందునుగనరారు, కదన మేగతిఁ గనెనో।
యంతయును గెలిచిరో గా।
క్రింవలిసుందరులనలల నింపుగఁ బడిరో॥

అనుబంధము 19.

ఆహా! వారిగతియేమి? ఇంక సవనతురంగము గతియేమి? ఆకైపున జరుగుచున్న యుద్ధమంతయు నట్లేనిలిచెను. ఎందుకో? ఎందుఁజూచినను ధనుష్టంకారమే వినరాదు. ఇంకెక్కడిటంకారము? అహంకారము తీఱినది. అర్జునుఁడింక నెగతియశ్వముఁ బడయువాఁడు? ఊరక యోచనలఁ బ్రయోజనములేదు. నేనైనను జక్కఁగ యుద్ధమాడి వీరల జయింపవలయు. మహామహులని రణభయంకరులని యున్నవారి గతియంతయు నిట్లయ్యె. వారి నేలనవలయు? శృంగారరసము మూర్తీభవింపఁజేసి నట్టు,లీయంగనామణుల సృజించిన బ్రహ్మ నవవలె. నేనుమాత్రమో బీరములువల్కుచున్నాను కాని, యీనారీజనము దృగ్గోచరమైన నేమయ్యెదనో? అదిగో! దాఁపున నెవ్వతెయో ధనుర్బాణములఁ బూనివచ్చుచున్నది. అది రతీసతియగు.

[ ప్రవేశము: మంజువాణి ]

రమణీ! ఈజగన్మోహనరూప మూని యే యభిప్రాయమున నియ్యెడకు వచ్చితివి? నీవేల రావలయు? నీ పేరేమి ?

**మంజు**—నేమంజువాణియనుదాన. నాకుఁ గావలసినది ధీరయుద్ధము.

**శిల**—„ధీరయుద్ధము”? తప్పఁబలికితివి. తొలియక్షరము కడుకఠోరము.

**మంజు**—ఛీ! ఎవ్వఁడును యుద్ధమిచ్చువాఁడే లేఁడు.

(నిష్క్రమి)

**శిల**—అయ్యో! ఈ కామినిపోయె. ఇంక నేనెట్లు నిర్వహింతును? అస్త్రసన్న్యాసమవలంబించి దాని వెనువెంటఁ బోయెద.

(నిష్క్రమి)

## తృతీయాంకము-ద్వితీయరంగము.

ప్రమీలసభ:

[ప్ర: ప్రమీల-కాదంబిని-కనకలత-చారుమతి-మాలతి-మంజువాణి-మలయవతి- మంజరి ]

ప్రమీల—సఖీమణులారా! ఏమి పిలిపించితిరి? మీ రేలయిట్లు దీనభావమొందియున్నారు? మీమోములు తప్తములయ్యె మందస్మితము మానకున్నవే ఇదేమి?
కనక—దేవీ ! వచ్చినకార్యము నివేదింపక తీఱదు. నేఁటికి జగద్విదితమగు మాయాశ మంతయుఁ గొల్లవోయె.
ప్రమీ—హా ! ఏమి ! ఏమి !

మలయ— అనుబంధము 20.

దేవీ ! అర్జునుని భటులచే మేము మొత్తపడి-డీలుపడి-బెండువడి-యోటువడితిమి.
ప్రమీల—హా ! శ్రీహరీ ! వీరమతల్లులారా! నేఁడేల యిట్లయితిరి? ఇది నావిధిబలము గాక మీశక్తిచాలమివలన నయినదికాదు. అయ్యో! ఎందఱెందఱు రాజన్యులు మీయెదుట నిలువఁజాలక శృంగభంగము నొందరైరి? అట్టి మిమ్ము నేఁ డర్జునుఁ డొక్కఁడు గెలువఁజాలెఁగా !

అనుబంధము 21.

అయినను మీరొక చిన్నగాయమైనను గాంచక యెట్లు పరాజితలైతిరి? యుద్ధక్రమ మంతయు నాకతింగింపుఁడు. వింటుఁగాక.
మలయ—దేవీ! అర్జునభటులతోఁ బ్రద్యుమ్న, మేఘనాద, సాత్యకి, నీలధ్వజ, సాంబాదులతో మాకు ఘోరసంకులసంగ్రామ మొదవె. మాబాణములు శ్రేటుదినియు వానిభరియించియు, సెట్టిధీరులో మాకించుకైన నొప్పిగాకుండఁ బరాజయము కలిగించిరి. మేము విధిలేక కర్తవ్యములేక వెనుక వచ్చితిమి.

ప్రమీల—హా! హా! ఇంతటి భీరుత్వము నింత యశక్తపురుషగుణము మీకుండునని యొకనాఁడును నెఱుఁగనైతి? నాకుఁ జెప్పిపంపక పోయితిరా? లేక చావనైనఁ జావరైతిరా? మిమ్ము స్త్రీలగుదురంచు నమ్మితిఁగాక, పురుషులఁబోలె నిట్లవుదురని తలంపనైతి. చారుమతీ! నీయాశయమే ఫలించె. కానిమ్ము. ఉండనిమ్ము. మంజరీ! తెమ్ము నాధనుఃకాండములు. చేకొమ్ము నాబాణతూణీరములు. చేయింపుము రథమాయితము. కమ్ము నీవు నాకు సారథివి.

## అనుబంధము 22.

చారు—దేవీ! ఇవన్నియును నాయితము చేసి యెక్కడికిఁ బోవనెంచుట. నే విన్నవింప వచ్చునా?

ప్రమీల—ఇప్పుడె పోయి యాక్రూరాత్ములఁ జక్కాడి నఱుమాడి పీచమణఁచి నేలఁ గూఁబెట్టి పీనుఁగుపెంటలఁ గావించి వచ్చెద. నాపగఁదీర్చెద.

చారు—వారికై యెక్కడికేల పోవలయును? వారే యిక్కడికి వచ్చియున్నారు.

ప్రమీల—ఎందున్నారు? ఏలవచ్చియున్నారు?

చారు—అయ్యో! వారిసామర్థ్యమింతయని చెప్పవచ్చునా? అక్కడ మమ్మెల్లర జయించినది చాలక మముఁ దలఁచి మిగొని యిక్కడికే వచ్చియున్నారు. సెలవయినఁ దోడ్తెచ్చెదము. మలయవతీ! నీవుపోయి వారిఁ దోడికొనిరమ్ము.

మలయ—(పోయి భుజబద్ధులైయున్న ప్రద్యుమ్నాదులనెల్లఁ బిల్చుకొని వచ్చును)

అందఱు—(గొల్లున నవ్వుదురు.)

ప్రమీల—సఖులారా! నన్నిట్లు హాస్యము చేసెదరా?

చారు—అయ్యో! హాస్యమేటికి?

ప్రమీల—వీరి జయించి భుజబంధనములఁ గావించి తెచ్చి యిట్లాడుట నను గేలిసేయుట కాదా?

చారు—అయ్యో! నీకేమి భ్రాంతి? మేమిచ్చిన బంధనములు కావు. కావలసి వారె కట్టుకొన్నారు.

ప్రమీల—వారేల కట్టుకొనిరి?

చారు—స్త్రీలతో యుద్ధము చేయవలయునన్న నసమసంగ్రామము ధర్మము కాదని వీరు చేతులఁగట్టుకొనిరయ్యె. వీరస్వభావము. ధీరగుణము.

అందఱు—(నవ్వుదురు)

ప్రమీల—వీరిలో నర్జునుఁ డెవఁడు?

చారు—ఆ యర్జునుఁడు యుద్ధమునకు రాలేఁడు. తనప్రాణముపై వచ్చునంతవఱకు వని తలపై విల్లెక్కు పెట్టఁడఁట. ఇది యాతని వ్రతమఁట.

ప్రమీల—ఎంతసేపు హాస్యమాడెదవే?

చారు—నీయాన యీమాటమాత్రము నిక్కము.

మంజు—దేవీ! యిది నిక్కము.

ప్రమీల—ఈ బాలుఁడెవఁడు?

మంజు—కర్ణకుమారుఁడగు వృషకేతుఁడఁట.

ప్రమీల—(బంధనములు విచ్చి) వీని నిట్లేల గట్టితిరే? పాపఁడా! రమ్మిందు. కూర్చుండుము.

వృష—(సిగ్గుతో నూరకుండును.)

మలయ—దేవీ! వీరినందఱి నిప్పుడు కారాగృహమున నుంచెదను. పిదప వీరియుదంతము వినిపించెదను.

(అని అందఱితో నిష్క్ర)

ప్రమీల—ఇంక మనము పోవుదము.

అందఱు—(పోవఁబోవ)

ప్రమీల—చారుమతీ! యిటురమ్ము. మీరుపొండు (చారుమతి ప్రమీల దప్ప నందఱు నిష్క్రమింతురు.)

ప్రమీల—చారుమతీ! నీవర్జునుగూర్చి యన్నమాట నిక్కవమా?

చారు—నీయానయని పల్కితిఁగదమ్మా?

ప్రమీల—వాఁడెట్టి ధీరశేఖరుఁడో కదవే! వానిఁజూచు కుతూహలమును వానితో సమరము సేయు కుతూహలమును నాకు మెండుగనుండె. ఇప్పుడదియెట్లు సిద్ధించు?

చారు—రాణీ! ఇప్పుడు మనమిందఱ నిర్బంధమున నుంచియున్నారముకదా? ముందఱ తఁడే వచ్చునని తోఁచుచున్నది.

ప్రమీల—నాకట్లుతోఁపదు. ఊరినుండి భీమాదులగు తనవారినైన రక్షించుకొనుఁగాక తాను యుద్ధమునకు రాఁడని తోఁచుచున్నది.

చారు—ఉండవచ్చును ఇప్పుడు మన కాయోచనయేల?

ప్రమీల—అటుగాదు, నేను వానిఁజూడ నభిలషించియున్నదాన.

చారు—అయిన మనమే యక్కడికిఁ బోవుదము.

ప్రమీల—ఎక్కడ? ఎప్పుడు? ఎట్లు?

చారు—నాకొకటి తోఁచుచున్నది. ఇపుడు కారాగృహమున నున్నవారిలో మన యెడకు నిన్న రాయబారిగా వచ్చియుండిన సుయోగుఁడ నువాఁడు మిగుల నున్మత్తుఁడు. వానివలన నన్ని కార్యములు సాధింపవచ్చును.

ప్రమీల—ఏదైన నుపాయము చేయుము.

చారు—మంజువాణీ!

[ ప్రవేశము: మంజువాణి. ]

ఇపుడు కారాగృహమునకుఁ బోవనున్నవారిలో సుయోగుఁ డనువాఁ డొకఁ డున్నాఁడు. రొయ్యమీసములవాఁడు, చూడుము, వానిఁ దోడెమ్ము.

(మంజువాణి నిష్క్రమి)

ప్రమీల—వాని నియ్యెడకే పిలిపించెదవా?

చారు—అదే వచ్చుచున్నట్లున్నది.

ప్రమీల—అయిన నేఁ బోయెదను. (నిష్క్రమి)

[ ప్రవేశము; సుయోగుఁడు ]

చారు—సుయోగా! యిందురమ్ము.

సుయో—ఏలరావలయు? అయ్యో! ధీరగుణా-

చారు—మరల మఱచెదవా నాపేరు?

సుయో—ధీరమతియే యుండని. ధీరమతీ నన్నెంత చెఱిచితివి?ఎంతయవమానమాయెను.

చారు—,,చారుమతీ'' యనుము. నిన్నేమి చేసితిని? అంత నీకు బంధనములు లేక నాయట్టియువతియాశ్లేష సుఖము లభించునా?

సుయో—బంధనములుగాని యేమైనఁగాని. ఆశ్లేష మిప్పుడు మాత్రము లభించెనా?

చారు—ఏల లభింపదు? నేను నీదానను గదా?

సుయో—నీవు నాదానవే యయినఁ జరణములంటి వేఁడెదను. ఈవిన్నపము మాత్ర మొనరింపుమా. నేనర్జునుని యెదుట నేమేమో చెప్పుకొంటిని. నేను జిక్కుటవలన నాపాటలు కల్లలాయె. కావున ననుగ్రహించి నను విడిపింపుమా. నేనేసుఖమును గోరను. నీ వేకార్యముఁ జేయుమన్నను జేయుదును.

చారు__సుయోగా! నాప్రియసుయోగా! నేను నీదాననైయుండ నన్నింతడుగవలెనా! అవశ్యమొనరించెదను. నీవు మాత్ర మర్జునునియొద్దనే యుండి వాఁడేమనునదియు నేమిచేయనెంచునదియు నీరహస్య వృత్తాంతములు నాకుఁ దెలుపుచుండవలయు. ఇంతమాత్రము చేయుదువా?

## అనుబంధము 23.

సుయో—మంచిమాటాయె. నన్ను గురుద్రోహివి కమ్మని చెప్పుచున్నావా? ఏమైన నొనరింతుఁగాక యిట్టికార్యముఁ జేయుదునా?

చారు__ఇదెట్లు గురుద్రోహము?

సుయో—అందలి రహస్యము లన్నియు మీకుఁజెప్పి, యేమఱుపాటొనరించుట గురుద్రోహము గాకింకేమి?

చారు—(మెల్లఁగ సుయోగుని చెంపఁగొట్టి) భ్రాంతా! అట్టిపనియయిన నిను నియమింతునా? ఎన్నఁటికిని గలుగను. నీతలముట్టి బాసచేసెదను. ఈహాయమును మరల నర్జునున కొప్పగింపవలయు ననియే మారాణి యభిప్రాయము. ఆయమ యర్జునునిఁ జూడఁగోరియున్నది. చూచినపిదప వారిర్వురు నేమగుటయు నీవ యెఱుఁగుదువు. అందలి రహస్యము లెఱుఁగఁగోరుట వేడుకకుఁ గాని యితరముకాదు.

సుయో—అటులనా? అట్లయిన నవశ్యము చెప్పెదను. ఇంకొక్కమాట. నే నెప్పుడెల్లెవ్వరికిఁ జెప్పవలయు?

చారు—నీచెంత నుండునది యేమి?

సుయో—చారుమతీ! ఇది మాతాతలకాలమునాఁడు మాయింట నుండినరక్ష. దీనిచేత ధరించి దైవభజనముఁ జేసిన సర్వాభీష్టములు సమకూరును. చూచితివా! యిప్పుడునను నిర్బంధితుఁ జేసినతోడనే దైవధ్యానము చేయసాగితి. వెంటనే నీకే యనుగ్రహము గలిగి విడిపింప యత్నించితివి.

చారు__దీనియందిట్టి మహిమగలదా? ఏదీ? (తీసికొని) ఈ యుంగరము నీయొద్దనుండ నిమ్ము. దీనిఁజూపిన నిను నెవ్వరు నష్టముచేయరు. నీవు నిర్భయముగ నీయెడకు వచ్చి యుదంతములన్నియు నెఱింగింపు చుండుము. నీవీమాట జరుపుటకుత్తరవాదివి. నీరక్ష నాయొద్దనుంచుకొని యుండెద. భయపడకుము. నేనేమియు దీని మ్రింగను. నీ వీపని నెఱవేర్చుటలో నించుకైన మోసము చేసితివా యీరక్ష నీకు రాదు. యోచింపకుము.

సుయో—నే నంతయుఁ జేసెదఁ గాక రక్షమాత్ర మిమ్మా?

చారు—రక్షయేమి? పాదరక్ష. మనసొత్తు. నీయొద్ద నున్న నేమి నాయొద్ద నున్న నేమి? ఇంకఁ బొమ్ము. ఏమి యోచించెదవు?

సుయో—ఏమియును లేదు. నా స్వాతంత్ర్యమును గోరి నా ప్రభువును మోసము చేయు నటుల నా రక్ష రాఁ దీసితివి. నీవలన ననుఁ దగుల చేసితివి. ఇంత చేసియు మీఁదు పెట్టియున్నావుగాని యొక కౌఁగిలియైన నొక ముద్దయిన నియ్యవైతివి.

చారు—ముద్దునకేమి వచ్చెను. వలసినన్ని కొనుము.

సుయో—(ఎగురులాడుచు) ఇప్పుడు ధన్యుఁడనైతి.

(ముద్దు పెట్టుకొనఁబోవును)

## అనుబంధము 24.

చారు—(పెంపఁగొట్టి) ఇం తాతురమా! పోవుము పొమ్ము. మా దేవి మాళవిరమునకు వచ్చి మీయర్జునునకుఁ దెలియకుండ వానిఁ జూడఁగోరుచున్నది. ఆ పనికిఁ దగిన ప్రయత్నములు చేయవలయును. (నిష్క్ర—)

## తృతీయాఙ్కము-తృతీయరంగము.

### అర్జునుని శిబిరము.

[ప్ర: అర్జునుఁడు-సుయోగుఁడు ]

అర్జు—సుయోగా! మనవా రొక్కరును లేరు.

సుయో—ఇంకెక్కడ రాఁగలరు? అందఱు వైరివనితలవలలఁబడి వారియూర నిర్బంధమున నున్నారు.

అర్జు—మేఘ వీర్యు?

సుయో—వైరికాంతామారుతములు మేఘములనయినఁగొనిపోవవీరెక్కడనుండఁగలరు?

అర్జు—నీలధ్వజుఁడు?

సుయో—మకరధ్వజుని బారికిఁ జిక్కె.

అర్జు—ప్రద్యుమ్నుఁడు?

సుయో—వాఁడే మకరధ్వజుఁడు. వానియిల్లువాఁడు చూచుకొనియె.

అర్జు—సాత్యకి?

సుయో—ఆముసలివాని కొక్కవయసుపడుచు చిక్కె. ఇంక నేమికావలయు?

అర్జు—సాంబుఁడు?

సుయో—వాని కొకయరాంగిని గలిగె.

అర్జు—వృషకేతుఁ డేమాయె?

సుయో—వాని కేగిరికన్య దొరకెనో నేఁ జూడనైతి.

అర్జు—ఇంద ఱిట్లయిన నీ వెట్లువచ్చితివి?

సుయో—వారందఱు సొగసుకాండ్రు. విటపురుషులు. చూచిన మాత్రమునఁదగులమునఁ బడిపోయిరి. నన్నెవతె మోహించును? నేనట్టివారి మోసములకుఁ జిక్కుదునా?

అర్జు—సుయోగా! నీవు వెలుపలనుండుము. పిదప మాటలాడుదము.

(సుయోగుఁడు నిష్క్రమించు)

సీ॥ ఘనరీతి వహ్నికై ఖాండవం బర్పింప
నెంచిన వేళఁ జింతించి యెఱుఁగ।
హరునితో వనవరాహమునకై మార్కొనఁ
గాంచిన వేళఁ జింతించి యెఱుఁగ।
గాల కేయనివాత కవచాది దనుజుల
నొంచిన వేళఁ జింతించి యెఱుఁగ।
గోగ్రహణమునాఁడు కురుసేన దలకొని
మించిన వేళఁ జింతించి యెఱుఁగ।
తే॥ గీ॥ జండతర బాణవహ్ని సంశప్తకాళిఁ।
జించి చెండాడు వేళఁ జింతించి యెఱుఁగ॥
నిప్పు డబలాసమూహంబు నెనసి పోరఁ।
జింత కలిగెను నక్కటా సిగ్గుచేటు॥

తలఁచుకొన్న నవ్వు వచ్చుచున్నది. చెప్పుకొన్న సిగ్గగుచున్నది. ప్రాణముం బాయుదునా? లేక పరాజయమున కొప్పికొందునా? పరాజయమున కొప్పికొన్న నెన్ని యనర్థములు గలుగు! మొట్టమొదట యజ్ఞము నిలుచుఁగదా! దాని కెట్లోర్చుకొందును? ఏమి చేయుదును? హస్తిపురికి వ్రాసి భీమాదులను బిలిపించుకొందునా? ఎంతాలస్య మగును? ఆహా! ఇప్పుడొకటి తోఁచుచున్నది. (యోచించి) అట్లు చేసిన నెట్లు? ధీరకృత్యము గాదు. మాయోపాయములు చేయుపని. ఆయినను నిట్టికోట్ల మాయరయే యొనర్పవలయును. ఎట్లయిన నిగూఢవృత్తిని బురము ప్రవేశించి, హయమున్నచోటును మానవు లున్నచోటును జూచివచ్చి, సులభముగ నా యనుహయమును వెలిసేయు మార్గము చూచివచ్చెద. మోసమైన నొనరించి, వారిని వెలికిఁ దీసితినా యన్ని కార్యములు సాధ్యము లగును. ఆహయమును నా భటులను నాయొద్ద నుంచుకొనియెద. ప్రమీలాదులు యుద్ధమునకు వచ్చిరా నేదంపమునుండి వారితో యుద్ధ మాడించెద. మీఱివచ్చిన నేనే సమరముఁ జేసెద సుయోగా!

సుయో—(ఇంతవఱకుఁ బ్రక్కన నుండి ప్రమీలకుఁ జారుమతికి నర్జునుఁ జూపుచుండును.)

[ప్రవేశము: సుయోగుఁడు.]

సుయో—దేవా! ఏమి సెలవు?

అర్జు—సుయోగా! నీవు రాయబారివై యీపురిఁ జొచ్చి యుంటివికదా! పురివైపుల నంతయుఁ జక్కఁగాఁ జూచి యున్నావా?

సుయో—అందంముఁ జూచియున్నాను, గాని యిప్పు డెందుకు ?
అర్జు—సుయోగా ! నే నూరు ప్రవేశింపవలసియున్నది.
సుయో—అయ్యో ? ఇప్లేల? వారు గుఱుతించిన ?
అర్జు—కాదు. గూఢవృత్తి వేషాంతరమునఁ బోయెద.
సుయో—పోయి—

అర్జు—పోయి హయమున్న నెలవును మనవారున్న చోటును జూచివచ్చి పిదప నొక కార్యముఁ జేయనెంచి యున్నాను.
సుయో—ఏమికార్యము ?
అర్జు—అదంతయు నీ కెందుకు? నీ వాచోట్లఁ జూచివచ్చియున్నావా? లేదా ?
సుయో—కొంతకుఁ గొంత చూచియున్నాను.
అర్జు—అయిన నీ వేదేని వేషాంతరముఁ బరిగ్రహింపుము.
సుయో—నీ వేమి వేషము గైకొనెదవు ?
అర్జు—అన్నియుఁ జెప్పెద నిటురమ్ము (నిష్క్రా.)

[ ప్రమీల చారుమతి ముందఱికి రాఁగా ]

చారు—రాణీ చూచితివా, యీవీరుని ?

ప్రమీల—

అనుబంధము 25.

ఆహా ! చారుమతి! యీవీరుఁ డతిలోక సుందరుఁడే. విగతకళంకుఁడగు నేణాంకుఁడు. సారంగభూషణుఁడగు మీనాంకుఁడు. ఈవీరుని ననంగక్రీడలఁ దేలింప లేని తరుణి యౌవన భాగ్య మెందుకు ?
చారు—అమ్మా! మనమింటికిఁ బోయి మాటలాడుకొందము. ఇం దుండిన నపాయముః
ప్రమీల—చారుమతీ ! యిం దుండుట యుపాయము. ఆ మోహనాంగుఁడు మరల నిందు వచ్చె నేని వానిచరణములపైఁ బడి వేఁడికొని నాప్రాణము లతనిశృంగారమున కుపాయనముగా నర్పించెద.

చారు—దేవీ! అదిలగ్గుగాదు. అదియుత్తమమును గాదు. దీనికి నేదేని యుపాయముఁ జూపెద రమ్ము.

[పునః ప్ర: సుయోగుఁడు-ప్రక్కన.]

సుయో—(చారుమతిని సైగఁ జేసి పిలుచును.)

చారు—అభ్రాంతుఁడేమోపిలుచుచున్నాఁడు. నేఁ బోయి యిప్పుడే వచ్చెద. (పోయి సుయోగునిఁ జూచును.)

సుయో—(చారుమతితో రహస్యము మాటలాడును.)

చారు—(ప్రమీలయొద్దకు వచ్చి) దేవీ! నేనొక్క వినోదము వింటిని. అర్జునుఁడు నీకుఁ జిక్కుటకు నుపాయ మొదవె. పోదమురమ్మ. (నిష్క్రమి).

శ్రీ

# ప్రమీలార్జునీయము.

## చతుర్థాంకము-ప్రథమరంగము.

### కారాగృహము.

[ప్ర: మేఘనాథుఁడు-సాత్యకి-సాంబుఁడు-నీలధ్వజుఁడు-
ప్రద్యుమ్నుఁడు-సారణుఁడు వృషకేతుఁడు ]

అందఱు— అనుబంధము 26.

మేఘ—అయ్యో! ఇట్టి పలుగాకిచేడియలచేతఁ జిక్కి యింత వంమరు చున్నానే! ఇట్టిదుస్స్థితి కలదా? ఇక్కడనుండి వెలిఁజేరుమార్గము కలదా? మలయవతీ! నీ వెట్టి ప్రళయవతివి! నీ విప్పుడు నాకంట్లఁ బడితివేని నినుఁ జించిచెండాడి నీ మాంసము కాకములకు విందొనర్పనా?

సాత్యకి—హా! నా దౌర్భాగ్య మేమనవలయు! ఎంత జితేంద్రియుఁడపించుకొంటిని! ఎట్టిశుద్ధుఁడనై యుంటిని! అయ్యో! మాలతియని గలిగినపేరున నెంత సౌరభము గలదిరోయని కొనసేరక యిట్లు బేలనైతి. అక్కటా! ఆమాలతి మాలదియాయె నే! ఇట్టి చండాలినికి నేనేల గోలుపడితిని?

ప్రద్యు—అయ్యో! కనకకలశా! విపులతవా? నమ్మినవారి గొంతుకోయు కరగసమవు. అట్టినినునమ్మి మోసపోయిన నన్నే యనుకొనవలయుఁగాక నిన్నని ప్రయోజనమేమి? నీ విప్పుడు మాత్రము వచ్చితివా నాకసి యంతయుఁ దీఱ నిను నింతింతగాఁ గడికండలు సేయుదునే!

నీలధ్వ—మంజువాణియను పేరు పెట్టుకొని నన్నిగతికిఁ దెచ్చెఁగా! అది మంజువాణి యయిన నగుఁగాని హాలాహలహృదయ యగుట యెఱుఁగనైతి. అదిమాత్రము నాకుఁ గన్పట్టెనా యదిమంజువాణి యగుటయు నిర్వాణి యగుటయుఁ జూపించెద.

వృష—అయ్యలారా! మీరందఱును మంజువాణి గార్దభవాణి యని భ్రమఁ జెంది యిట్లయితిరి. నే నేపాపము చేయఁగ నేఁ? నాకేల యీగతి గలిగె?

మేఘ—కూనలారా! మనమూరక యిట్లు నిర్వాణదీపమునకుఁ దైలముపోసినట్లుమాట లాడుచుండిన నేమిప్రయోజనము? ముందుఁ జేయదగిన కార్యమును యోచింపుఁడు.

సీ॥ దుర్వారలయకాలశర్వాధికాభీల
గర్వాతిరేకంబు గాంచవలదె।
శంకారహితధీర హుంకారబహుళతా
హంకారపటిమ యింత తడరవలదె।
నిర్నిద్రకల్పాంతఘూర్ణమానకృతాంత
పూర్ణరోషం బింత పూనవలదె।
శక్రారివిలయకృచ్ఛక్రాయుధామంద
విక్రమక్రమ మింత వెలయవలదె।
తే॥ గీ॥ తడయ కీచెఱఁ గూలంగఁ దన్నవలదె।
యీ నిరోధంబు నెట్లైన మానవలదె।
కవిసి యీపురి నీఱుగాఁ గాల్పవలదె।
చేడియలనెల్లఁ జించి చెండాడవలదె॥

ప్రద్యు—మనమందఱ మెట్లయిన నీ నిర్బంధమునుండి వదలించుకొని మున్నిగతికిఁ దెచ్చిన యీవిధవలఁ గలరే-వారిఁ దుంచుతున్నగా నయికామువలెను వారూఱట గలుగదు.

సాత్యకి—అదినిశ్చయమే. అయిన మనము తప్పించుకొనుట కొకమార్గము వెదకుదము.

మేఘ—ఈ వాకిళ్లు నిట్టులే కాలఁదన్ని పగులఁగొట్టుదము. ఈ యింటినిట్లే కాలఁదన్ని-

సాంబ—అట్లయిన నీయింటితోఁగూడ మనమును గృష్ణార్పణ మయ్యెదము.

సాత్య—ఏమయిననుగాని.

[దూరమున ప్రః కనకలత-మొదలగు స్త్రీలు]

మేఘ—అదిగో! స్త్రీలు నడచిన చప్పుడు వినిపించుచున్నది. ఇక్కడికి వారువత్తురేమో.

ప్రద్యు—వారుమాత్రము వచ్చిరా యీ కాడలు పీకివైచి పోయి నఱకాడెదను.

కనక—ఎవరిని నఱకాడెదవు శూరవర్యా?

ప్రద్యు—అలివేణీ! నీవె వచ్చితివా? నాపాలిభాగ్యదేవతవు!

కనక—నఱకాడునది యెవరిని?

మేఘ—నిన్ను నీయక్కను దానియక్కను. రంపితలారా! మమ్మెల్లర మోసపుచ్చి హాస్యమాడుటకు వచ్చితిరా?

ప్రద్యు—మేఘనాథా! నా ప్రియసతీమణి నట్లాడిన నీనాలుక నిప్పుడ గోయుదును.

మేఘ—నీ ప్రియసతీమణి తలగొరిగిరి. ఈ ముండలెల్లరు మమ్మునన్యాయముగఁ బరిభవించినందుకు వీరిధ్వంసము చేయవలయు.

మలయ—(ముందటికి వచ్చి) ఎవరిని ధ్వంసము చేయుదువు?

మేఘ—దేవీ! నీవె వచ్చితివా! నమస్కరించెదను.

అనుబంధము 27.

మలయ—ఇది యుండనీ! నీవుధ్వంసమెవ్వరిఁ జేసెదవు?

మేఘ—నీవు నాదండ లేనప్పుడు నన్నింతచానచేసెను కరుణాగుణమాధుని, ప్రాణుని, మారుఁ.

ప్రద్యు—వన్నెల యిట్లనెదవు? నీకన్మగతికి మారుఁడేమిచేసెను? కనకలతాదాసుఁడనై దానిచింతవప్ప నన్య మెఱుఁగకున్న, మారుఁడు నీకేమొనర్చెను?

సాత్యకి—చాలునులెమ్ము. మీరందఱు నిట్లుభ్రాంతులై మీ మీ తరుణులఁ బ్రశంసించుచు వారియమనులకు మడుఁగులొత్తుచు నిట్లుండ మాగతియేమి కావలయు? మీనుండి యేకదా నాకీతగుల మొదవినది?

మాలతి—సాత్యకీ! ఎవరినుండి?

సాత్య—నీవా! చూడుము. నీపావనఖరములనయిన విలువఁజాలని యీయంగనల నీ భ్రాంతులెట్లు ప్రశంసించుచున్నారు. కనకలత యఁట. మలయవతి యఁట. నీయింటఁ గసవూడ్చుచుండనైనఁ దగుదురా?

మంజు—ఎవరు తగరు?

నీల—నోరకుండుఁడు. మీమాటలు మీరిగాని నాముద్దుల మంజువాణిమాటల వినకే!

అందఱు—అయ్యో! మమ్ము నేమిచేసిపోయెదవు? తరుణీ! మలయవతీ! కలికీ! కనకలతా! పొలఁతి మాలతీ!

మలయ—ఏలయిట్లు తీవ్రపడెదరు.

అందఱు—అయ్యో! తీవరమా! అయ్యో! సౌఖ్యమా!

మలయ—దుఃఖము పిదపఁ గలిగిన సౌఖ్యముగదా రుచించును? మీరు యోచింపుఁడు.

(స్త్రీలు నిష్క్ర—ం.)

మేఘ—మలయవతీ! (అని ప్రద్యుమ్నునిఁ గౌఁగిలించును.)

సాత్య—మాలతీ! (అని మేఘునాథు పైఁబడును.)

నీలధ్వ—మంజువాణీ! (అని సాత్యకిని డుచ్చును.)

ప్రద్యు—ఇందఱు కనకలతాంగా నాథ! (అని క్రిందఁ బడును.)

(యవనిక పడును.)

# చతుర్థాఙ్కము-ద్వితీయరంగము.

## వీ థి

[ప్ర: అర్జునుఁడు (సన్యాసియై) సుయోగుఁడు (ఫకీరువేషమున) ]

**అర్జు**—**సుయోగా!** నేనెట్లున్నాఁడను?

**సుయో**—నేనో?

**అర్జు**—నీవెట్లుండిన నేమి?

**సుయో**—నీవెట్లుండిన నేమి? నేమిగదా ముఖ్యము.

**అర్జు**—అదియెట్లు?

**సుయో**—ఈపురిలో నిన్నొక్కరును జూచినవారు లేరు. రాయబారినైవచ్చి యుండి నందున నన్నందఱు గుఱుతింతురు. కావున నే గుఱుతింపఁ బడకుండుటయే ముఖ్యము.

**అర్జు**—సుయోగా! ఎట్లున్న దీపురి వైభవము!

సీ॥ సర్వంసహాభార నిర్వాహకోదగ్ర
దుర్వారరాజకృతోర్వీధరము ।
చోరాదికత్రాస దూరాయితౌన్నత్య
తారాపథంకషాగారకులము ।
వ్యాపారకల్లోల ఘోషాయితారభసా
కూపారపర్యవస్థితాపణంబు ।
కేళికావనవాసపాలికాంచితజల
నాళికాసందోహలాలితంబు ।

గీ॥ చారుమారాంగనాకార, పౌరవార ।
ధీరతా, ద్భుతభుజబల సారతా, త్యు ।
దారతా, శంసనారావదశదిగంత ।
ఘట్టినంబయితోఁచె నీపట్టణంబు ॥

ఈసుధాసౌధములు వజ్రముల మేడలవలెనున్నవి. ఈవీథు లెంతశృంగారములుగ నున్నవి! ఈకాంతలందఱు నెంతరమణీయములుగా నున్నారు! ఎవ్వరు చూచినను నమూల్యభూషణముల ధరించి యున్నారు. ఇందలివారు దారిద్ర్యము నెఱుఁగరు కాఁబోలు. పేదలుకలుగరు కాఁబోలు. నారీశృంగారరసమువంతయు విధాత్రుఁడు గ్రహించి యెంమనుడికోవని తెలివికలిమి నీపట్టణపుసుందరుల సృష్టిసేసెఁగాఁబోలు?

సుయో—(మెల్లఁగా) ఇప్పుడే యిట్లనుచున్నాఁడు. ఇఁకముం దేమి కాఁగలదో?

అర్జు—సుయోగా యేమంటివి?

సుయో—ఏమియులేదు, దారితప్పితి మంటిని.

అర్జు—దాదియెట్లు తప్పితిమి?

సుయో—ఈపాడుపట్టణమునవీథులన్నియు, వీథులలోనియిండ్లన్నియు,నొక్కతీరుననే యున్నవి. ఇదికామ మార్గము.

అర్జు—మనవా రున్ననిర్బంధగృహమునకు నిది దారిగాదా?

సుయో—ఆగృహమును నేఁ జూడలేదు. ఏమోపోవుచుండిన నిక్కేచిక్కునని వచ్చితిమి. దారి తప్పితిమి-ఇంకేమిగతి?

అనుబంధము 28.

అర్జు—ఓరీ! యవివేకీ! నిన్నునమ్మినమ్ముల నున్నపోఁకుతోఁకఁ బట్టి యేఱుదాఁట నుద్యమించినట్టులాయెఁగదా!

సుయో—నను దూఱకుము. ఎవ్వఁడెఱుఁగు నీపాడుదారు లన్నియు? నే నాప్రక్కకుఁ బోయి విచారించి వత్తును. నీ విందైన నుండుము లేకున్న నెవ్వరికైన నడుగుము.

(నిష్క్రమి.)

అర్జు—ఈమూఢుఁ డిట్లాయెను. వీని నమ్మి నే వచ్చినందుకు నాకు బాగాయెను. ఎవ్వరికైన నేనేమి యడుగుదును? అడిగిన నన్ను సంశయింపరా?

[ప్రవేశము: మలయవతి.]

మలయ—(స్వ) ఓహో! ఇతఁడే యున్నట్లున్నది. (ప్ర) మునీంద్రా! నమస్కృతులు. (అని నమస్కరించిలేచి) పావనులరగు మీ రీపురికి విచ్చేయుట నీ పురివారిభాగ్యము ఫలించెను. మీ శుభసందర్శనము నా కబ్బుటచే నాజన్మము పవిత్ర మాయెను. ఎందును రాక వచ్చియున్నవారు. నే నొసంగు నాతిథ్యము స్వీకరించినాయిలు పవిత్రముచేయ విచ్చేయవలెనని విన్నవించుదానను. అదియే నాభవనము. వేంచేయుఁడు.

అర్జు—యువతీ! నీయాదరణ మగణ్యము. నీ విచ్చునాతిథ్య మంతయు నాకు ముట్టె. ఒక్కసీమ నిలువక యెల్ల సీమల హాయను పోయినట్టు పోవుచు నిపుడు సర్వాశలు మానియున్న మే మెక్కడయెడ నిలుచువారము కాము. ముందుఁబోయెదము.

మలయ—మునివతంసమా! నాయాదరణమును గణించి నన్నాదరణ మొనరించుట పాడియా! కొన్నివత్సరములనుండి నాకుఁ గుక్షిశూల గలదు. రెండేండ్ల క్రిందట నొకయోగి వచ్చియుండి, యిఁకఁగొన్నిదినములలో నొక్కపరమమునీంద్రుఁడు నీకు సందర్శనమిచ్చును. అతని దర్శించుకొని యతని పాదతీర్థము సేవించితివేని, నీకు నిరామయత గలుగునని యానతిచ్చెను. అతఁడాడిన మునిచంద్రుఁడు నీవ కానోపుదువు. కానున్న నహోరాత్రములు నెడగానక యుండినశూల యిప్పుడు మిము దర్శించినమాత్రనే నిలుచునా? ఇంక మీపాదతీర్థము నా కనుగ్రహింపవలయు.

అర్జు—రమణీ! నీయుపచారవాక్యములకుఁ గడు మెచ్చితి. నాపాదతీర్థము నిన్నరోగినిగఁ జేయఁజాలిన దాని నీ నందునా? అవశ్యము కానిమ్ము.

మలయ—ఇదె నాభవనమునకే వచ్చితిమి. ఇందుఁ గూర్చుండుఁడు. (పీఠము వేసి కూర్చుండఁబెట్టును.) మునివర్యా! ఇదె పూజాద్రవ్యములఁ దెచ్చెద.

(నిష్క్రా)

అనుబంధము 2ు.

అర్జు—(స్వ) దైవానుగ్రహము నాపైఁగలుగుచున్నట్లున్నది. ఇది నాయెడ భక్తిగలదిగా నున్నది. ఆసుయోగగర్భుఁడు పోయినను నిదినాకు లభించె. దీనిమూలమున మనవారిఁ జూచుభంగి గలిగించు కొందును.

[ పునః ప్ర: మలయవతి పూజాద్రవ్యములతో. ]

మలయ—(స్వ) మారాణికై నేను మన్మథపూజ సేయుచందమున నీమారసుందరుని నీమన్మథమన్మథుని పూజ నేనిప్పుడు చేసెదను. (అర్జునునిఁ బూజించి) మునీంద్రా! యింక దీర్ఘ మీవలయు.

అర్జు—(ఇచ్చును.)

మలయ—(తీసికొని) మునివతంసమా!

ఉ॥ దిక్కులదిక్కులన్ బహుళతేజము నించుచు నాశ్రితాళిపై ।
నక్కటికంబు వెంచుచు దయాగుణభాసురతన్ జెలంగుసీ ।
వెక్కడివాఁడ వేమికత మిక్కడరా నభిధానమేమి నేఁ ।
డెక్కడనుండి యెక్కడికి నేగెదవో మునివంశచంద్రమా ॥

అర్జు—తరుణీమణీ! నాదేశము కడుదూరము. నే నిష్పటి యతినిగాను, గత్యంతరములేక యీ వర్తన మాచరించితిని. మావా రెందఱున్నను నాకు లేరైరి. దైవగతివలన నాకును నిర్బంధముగలిగె. వారికినిగలిగె. ఊరక యుద్దేశములేక యిటు తిరుగాడు చున్నాఁడను. ఇంద్రలోకమునను నా ప్రవేశమునకు నిరాటంకము. ఆ యింద్రుఁడు ననుఁ గడుగారవమునఁ జూచును. అట్టివాఁడ నిట్లయితిని.

తే॥ గీ॥ తరుణి యీపురివెలుపల నరసిచూడఁ ।
గదనరంగవిధానంబు గానఁబడియెఁ ।
బట్టణంబున నొక్క సంభ్రమములేదు ।
వెఱఁగు జనియించె నిందెట్టివింత కలదొ ॥

సుభ—(స్వ) మంచిమోసగాఁడు. ఇల్లులేకున్న నిట్టిరూపమున సుభద్రను బడయుచుండెనా? (ప్ర) స్వామీ!

సీ॥ కరిపురిధర్మజుం డరుదార హయమేధ
యాగంబొనర్పంగ హయము విడిచె ।
వెనువెంట నాతనియనుజన్ముఁ డర్జునుం
డఁట మహాహంకారపటిమ నెలయ ।
నరుదెంచె మావీటఁ దురగంబు తిరుగ మా
వారలచే నది పట్టువడియెఁ ।
గర్ణసూనుఁడు మేఘవర్ణనీలధ్వజుల్
ప్రద్యుమ్న సాత్యకి ప్రముఖయోధు ।

తే॥ గీ॥ లడరి యదికారణంబుగా ననికి నిలిచి ।
భుజబలము లేక మాచేత విజితులైరి ।
వారి మావారు చెఱనుంచినారు నేఁడు ।
ఇదియె మాచరితంబు యతీంద్ర వింటె ॥

అర్జు—అర్జునుఁడును బరాజితుఁ డాయెనా ?

మలయ—అతఁడు యుద్ధ మాడఁడఁట. ఆడిన నేమగు చుండెనో ?

అర్జు—అయిన వాఁ డేమన్నాఁడు ?

మలయ—ఈస్థలముననే యున్నాఁడు.

అర్జు—(భయమున) ఎక్కడ ?

మలయ—అందున్న యీ శిబిరమునందు.

అర్జు—అయిన నిందున్నవారు బహుపరాక్రమాంచితు లనుటకు సందేహ మేమి! కావున నేనే యీపురిఁ జూడవచ్చితి. ఈ విషయమునంతయు నీవ చెప్పితివి గావున, నిన్నడిగెదను. నీమాటలపై నాకు రెండుకోరికలు కలిగినవి. ఆధర్మజుఁడధ్వరమునకై విడిచిన హయము పృథివి నొక్కటిరయే యుండునదియఁట. అది భద్రావతీపురమున యౌవనాశ్వ రక్షితమై యుండ దాని ధర్మజుఁడు సాధించెనఁట. దానిఁజూడవలయునని నాకభిలాషము. అదిగాక, వృషకేతునితండ్రి కర్ణుఁడుండెఁగదా? వానికి నాకు యావజ్జీవవైరముగా నుండెను. ఆవృషకేతుని మీరు చెఱలో నునిచియున్నారు. కడు సంతసమైనకార్యము. ఆ చెఱలోనున్నవానిని నేనట్లు చూడవలయుననిగోరుచున్నాను. ఈ రెండును నీకు సాధ్యమాయెనా సంతసించెదను. కాకున్న నాదారిఁ బోయెదను. అంతకును నీకు దేహమున స్వాస్థ్యము కలిగినదే పదివేలు.

మలయ—(స్వ) ఔరా! మంచిమోసగాఁడు. ఎల్లుమాటలాడు చున్నాఁడు. (ప్ర) స్వామీ! మీయభీష్టములు రెండును నెఱవేర్చు స్వాతంత్ర్యము నాకుఁ గలదు. మీ హయమును జూపఁగలను. మీ వృషకేతునిఁ జూపఁగలను.

అర్జు—నా హయమేమిటిది ?

మలయ—మీహయమంటి నేమోగదా! క్షమింపుఁడు. మీరు మాకుఁ గోరినహయము. ఆ మార్గమున నటు పోదమురండు. (నిష్క్ర)

—(౦)—

## చతుర్థాఙ్కము-తృతీయరంగము.

### ప్ర మీ ల న గ రు:

[ప్ర: ప్రమీల (మంచముపైఁ బవ్వళింప) ప్రక్కనఁ గనకలతా కాదంబినీ మంజువాణీ మాలతులు - ఉపచారములఁ జేయుదురు.]

ప్రమీల— అనుబంధము 30.

సఖులారా! ఈ తాపము నేసహింపను. అయ్యో! నే భరింపఁజాలను. ఆరూపజితమారు, బలజితసమీరు, నాచారుమోహనాకారుఁ గూడని నాజన్మ మేటికి? తరుణీ! కనకలతా! ఆ యర్జునుఁ జూడ నాకభిలాష యేలఁగలిగెను? కలిగె బో యీ చారుమతి నన్నేల వలదనక గొనిపోయెను? పోయి వానినేల చూపెను? చూచి యిట్లేల మారుబారిఁబడితిని? అకటా! నే జీవింపఁజాల.

కనక— అనుబంధము 31.

దేవీ! ప్రమీలా! నిమ్మళింపుము. ఈ కార్యసాధనము సమకూర్ప నేఁ గలను. చింతింపకుము. ఆ యర్జునుఁ డెంతమాత్రము నిన్నుఁ జూచెనా వరింపకుండఁడు. శీఘ్రకాలముననే నీ యభీష్టము లన్నియును నెఱవేఱఁ గలవు.

ప్రమీల—కనకలతా! నా యభీష్ట మెట్లు నెఱవేఱును? ఆ యనంగసుందరుఁడు న న్నిచ్ఛయించునా? ఇచ్ఛయింపనినాఁడు నే జీవింపఁ గలనా?

మాలతి— అనుబంధము 32.

దేవీ! నీవిప్పుడేల యిమ్మరలించెదవు? అవశ్యము నిన్నానరుఁ డనంగక్రీడలఁ దేలింపఁ గలఁడు.

ప్రమీల—మాలతీ! అయ్యో! ప్రియసఖివైనందున నీ వీయూఱడింపుమాటలఁ జెప్పఁదగినదే కాని, నాకించు కంతయినను నెమ్మది గలుగదు. సఖులారా! నాకిదియే యంతమని యెఱుఁగుఁడు. ఇంక నా ఋణము మీకు లేదు.

మంజు—

## అనుబంధము 33.

దేవీ! నీవేల యిట్లు వంతఁ జెందెదవు? మలయవతి పోయి వేళయయినది. అది సాధించుకొనక రాదు. అవితప్పక నరుని నిందుఁ బిలుచుకొని రాఁగలదు.

ప్రమీల— సఖీమతల్లులారా! ఆ యర్జునుఁ దోడ్తెచ్చినఁ దేవచ్చుఁగాక, వాఁడు నా మనవి గైకొనునను టెట్టిమాట?

కనక— అమ్మా! ఏల నీ సౌందర్యమును నీవ కొఱవడెదవు? అనరుఁడుగాఁడు, నరుని యబ్బ దేవేంద్రుఁడే యైన నేమి? నిన్నుం జూచి తిలకించెనా యచ్చెరువంది కనులఁ గప్పికొని ప్రార్థించి కార్యఁబడి దీనుఁడై నీకు దాసుఁడై లోఁబడకుండునా? ఎందఱు రాజాధిరాజులు నీకుఁ గానుకలిచ్చి నిన్నాశింపరైరి? నీయట్టి కాంతావతంసము లభింపవలెనన్న నాయర్జును తల్లి నాని మంచివేళఁగని యుండవలయుఁగదా?

## అనుబంధము 34.

[ప్రవేశము: మలయవతి.]

మలయ— దేవీ! ఆ యర్జునుఁ దోడ్తెచ్చియున్నాను. ఇందే వెలుపల నిలిపియున్నాను.

కనక
మాల
మంజు }— పిలుచుకొనివచ్చి దేవికి సందర్శింపుము మేము పోయెదము.

ప్రమీల— మీరేల పోయెదరే? ఇందే యుండుఁడు.

కనక
మాల
మంజు }— మంచికార్యము మేముపోవలెనమ్మా. ఆ యర్జును నింత చూచి మరలి వత్తుము.

(నిష్క్ర—)

[మలయవతిపోయి యర్జునునిఁ బిలుచుకొనివచ్చి.]

మలయ— ఆ కారాగారము కావలివారలఁ దెచ్చెదను. నే వచ్చువఱకు, మునీంద్రా! యిందే యుండుఁడు. (నిష్క్ర—)

అర్జు— ఆహా! ఈ భవనమునందలి సౌందర్యములఁ జూడ నాకు నేత్రానందము జనించుచున్నది! నన్ను మలయవతి యిట్టి వైభవశాలి గేహమునకేల తోడ్కొనివచ్చెను? ఆహా సౌధము! నీయాకార నిర్మితియే కాఁబోలు? దీనినెంత వర్ణించినను దక్కువ యగును.

ఏమిది! ఇంతసేపయ్యు మలయవతి యింకను రాలేదు! దాని కండేమంతరాయము గలిగెనో. నేనెంత యుపాయకృత్య మొనరింప నుద్యమించితి? నన్నెవ్వరైన గుఱుతించిరా తలవంపులేఁగదా? ఎట్లు గుఱుతింపఁగలరు? నాయాకారమును వీరెవ్వరును జూడలేదే! ఆహా! మోసకృత్య మెంతనిరుపాధికమైన దైనను, జేయ వలయునన్న భయము గలుగుఁగదా! అప్పుడే యఱుగడియ మీఱె. ఇందొంటిగా నుండుకొలఁది వేసట గలుగుచున్నది. ఈహర్మ్య మెట్లున్నదో దీనినైనఁ బరీక్షించి చూచెదఁగాక. (తిరిగి వెదకి పండుకొని యున్నప్రమీలను జూచి భీతి నభినయించి వెనుకకు జరిగి) ఇం దెవ్వరీవనిత యిట్లు పండుకొని యున్నది? ఆహా! ప్రణయ వశమునఁ బతినిఁ బాసి జగమునకుం దిగి కోపమువగను బండియుండు మృగాంక భామినియో, నలకూబరు వెదకికొనివచ్చి కానక విసువు జనింప నూరక శయనించి యున్న విభూషావిశేషాలంకృత రంభాప్సరసయో. కాదేని తనపతి నంగభూషితుఁ జేయుతలంపున శయనతపంబున హఠయోగ మవలంబించియున్న రతీసతియో యగుఁ గదా!

## అనుబంధము 35.

ఆహా! ఈసతియే యుండునా ప్రమీల! అమలయవతినిఁ జూచినప్పుడే భ్రమసి యుంటి. ఇదియన్న దిగ్భ్రమము గలిగించుచున్నది. ఈయూర నిట్టితరుణు లుండుటనే గదా ప్రద్యుమ్నాదులు నిర్విణ్ణులై వారిచేఁ జిక్కిరి. ఆహా! ధర్మజాఁడు బద్ధాధ్వర కంకణుఁడై నియతుఁడైయుండ, నట్టినియమము నుపాసించి హయసంగతి వచ్చియున్న నే నిట్టినియమభంగమునకుఁ బాల్పడుదునా! ఈపెడద నాకేటికి! (ఊరకుండి) ఆహా! శుద్ధమానసమునం దెంతయు పేక్షకలిగినను మదియించుక యీడ్చుచున్నది. తుదకు నీతరుణీమణి వచోవైఖరి నైనను వినఁగోరుచున్నాఁడ. దీనినుద్బోధించి సంభాషించినంతనే యేమితప్పు? పలుకరించెదఁ గాక! (సమీపించి వెనుకకు వచ్చి) ఇది మరాగతమగు. ఇట్లొనరించు టొప్పును. అయ్యో! అమలయవతి యెంతాలస్యముఁ జేసె?

ప్రమీ—(నిమరనుండిలేచినట్టులేచి) మహాత్మా! నాపాలిదైవమువలె నన్ననుగ్రహింప నేతెంచినని వెవ్వరవు?

అర్జు—రమణీ యడుగడుగునకు సర్వసంగపరిత్యాగము చేయుచు మనసువచ్చినరీతిఁ దిరుగాడుచున్న వ్యర్థకర్మందిని.

ప్రమీ—యతీంద్రా! తమ్ముఁదాము తుచ్ఛము చేసుకొని మాటలాడుట పూజనీయులగు నార్యులకు నైజగుణము. ఇందుల కేల వచ్చితిరి? నను ధన్యఁ జేయఁ గదా యిందు విచ్చేయుట?

ఆ॥ వె॥ పరులమేలుచూచి పలుమాఱు పొగడుట।
చెలఁగి తమ్ముఁదాము నిందచేసికొనుట।
కరుణ నాశ్రితాళి నరసి రక్షించుట।
జగతి నైజగుణము సజ్జనులకు॥

ఈపీఠము నలంకరింపుఁడు.

అర్జు—(కూర్చుండి) జగన్మోహన శృంగార మలరార మాయట్టి సన్న్యాసుల కర్ణములకైనను వినుఁగలుగఁదేనెతేటలకు ముద్దుపలుకులు పలుకుచు మదనసామ్రాజ్యమునకుఁ బట్టముగట్టిన వైభవదేవతవోలె సొంపుగులుకుచున్న నీవెవరవు? ఈ స్త్రీమండలము నేలుభాగ్యము గన్నయాప్రమీలవా నీవు?

ప్రమీ—దేవా! యేనెవ్వరగుటయు వెనుకనుండి విన్నవింతు. నేనొసంగుపూజఁగాంచి నాకు ధన్యత నొదవింపవలయు. పిదప నేఁజేయుప్రార్థన మన్నింపవలయు.

అర్జు—కామినీ! నీమాటలెట్టి తేనెలతేటలు! నీ వెవ్వరింత చెప్పరాదా?

ప్రమీ—(స్వ) నాయునికి నిజస్థితిఁ దెలియఁజేసిన నెట్లుండునో! అయినను నొకభంగిఁ జూచెదఁగాక. (ప్ర) దేవా! ఏ నాప్రమీలాసతి నేలు సుభద్రయనుదానిని. ఆమె నన్ననవరతము తనయట్టిదానిగాఁ గూరిమి చూపుచు నేలుకొని యుండును.

అర్జు—ఆహా! నీ వాప్రమీలదానివా? ఏమివైభవ మామెది! అతివా! నీవామలయువతి యనుకాంత నెఱుఁగుదువా?

ప్రమీ—అది నాకూర్చుసఖి.

అర్జు—ఆబిడ యెందున్నది?

ప్రమీ—నేనెట్లెఱుఁగుదును?

అర్జు—ఇదేమి వచ్చెను నాకు? ఎంతసేపిట్లుండుదు?

ప్రమీ—దేవా! ప్రాజ్ఞులయు లగుపెద్దవారలు నమ్మినవారిఁ గరుణించు సువ్రతముగలవారుకదా? మీ రనుగ్రహించిన నాయభీష్టము విన్నవించెద.

అర్జు—రమణీ! నీయభీష్ట మదియేమి?

ప్రమీ—మునివతంసమా! ఈయూర నారులు స్వైరిణులగుట విదితవిషయము గదా? కావున నేనెవ్వరికి భీతిల్లవలయు? నినుఁ జూచినప్పటినుండియు నామది నినుఁబాయదయ్యె. మారుఁడు క్రూరుఁడై లతాంతనారాచములనూఱి సానపెట్టసాగె. నీయనంగసుఖము నభిలషించిన నాపై దయారసము ప్రసరింపఁజేసి నాయభీష్టము చెల్లింపవలయు నని ప్రార్థించుదానను.

అర్జు—రమణీ! ఇదియేమి నీ కోరిక! యతులను మమ్ముఁ గాంక్షింపఁ దగునా?

తే॥ గీ। సకలవాంఛితసుఖములు సంఘటించు ।
విలసితాకారయౌవన విటుల మాని ।
సర్వసంగ విరాగులై సంచరించు ।
యతులఁ గోరెదులావణ్యవతులు గలరె ॥

మేము సర్వసంగముల మాని మనఃప్రీతిని నిట్టివిషయములఁ గోరనీకుండ విసర్జించి యున్నారము. అట్టి మమ్ము నీవపేక్షించుట పిఱిఁడితనము.

అనుబంధము 36.

ఈయభిలాషము మానుము.

ప్రమీ—కరుణాకరా! సర్వసంగపరిత్యాగుల మని చెప్పికొనుచు నిట్టినిష్కారుణ్యము మదిబూనఁ బాడియా? ఒక నిమేషమాత్రము నమ్మి తత్పరయై యున్నదాని కాంక్షించిన యభిలాషము నెఱవేర్చినంతనే నీ నియమములన్నియు వ్యర్థము లగునా?

అర్జు—తెలివా! నీకు వివేకము చాలదు. నియమము లొనరించి సిద్ధిఁ బడయవలయు నన్నఁ జిరకాలము పట్టుఁ గాని, యాసిద్ధి నీగుటకు నిమేష మేల క్షణమైనను బట్టదు. ఊరక తీఱని కోరికలఁ గోరకుము.

ప్రమీ—యతీంద్రా! మహామహుఁ డగునర్జునుఁడు సన్న్యాసియై సుభద్రను బరిగ్రహింపఁడా? నీవేల నన్నిట్లలఁతిఁ జేసెదు.

అర్జు—కైతవసన్న్యాసులవిషయ మేల చెప్పెదవు? నే నట్టివాఁడ నని యెంచితివా?

ప్రమీ—ఎట్టివాఁడవో కాని యాసుభద్రయింటనున్న యర్జును డింతమఱిపెములు గాఱి ముద్దులుమీఱి యుండె నని వచింపఁజాల.

అర్జు—(స్వ) ఇదియేమి సమీపమునకే వచ్చుచున్నది! (ప్ర) తరుణీ! యిట్లాడుట నీకు మేలుగాదు. వాఁడట్లేల చేసెనో యా యర్జును నడుగు పొమ్ము.

ప్రమీల—కైతవ సన్న్యాసియగునర్జును సుభద్ర వేఁడిన చందమున నేనిను వేఁడుచున్న దానఁ గదా! వానికిఁ గలిగిన కరుణ నీకేల గలుగదు? నేను ప్రమీలదాసినంటినే. నా పేరును సుభద్రయె. ఈ సుభద్రకై నీవేల యర్జునసన్న్యాసివి కారాదు?

అర్జు—గ్రహచారమా?

ప్రమీల—గ్రహచారమనుటకు నీకేమి యక్కఱ? రాజాధిరాజులు వరించినను వారివీటిఁ బుచ్చి కన్నెఱికముఁ బాయకున్నధరాప్సరస తానే మీఁబడి వరింపవచ్చి విలువలేని యనంగసుఖ మియ్యఁదలపడినది నీకు గ్రహచారము గదా? పురుషపుంగవా! నీవు నాచేఁ జిక్కిన వాఁడవు, ననువరింపఁ బోలెఁ నాయెడకే వచ్చియున్నవాఁడవు.

ఇందలి తరుణుల సౌందర్యమునుం బోలెఁ బరాక్రమమును నీవెఱుఁగఁగలవు. ఎట్లును దప్పిపోఁజాలవు. నీదేశపురుషులు చెలులఁ జూచినచందమున నిక్కడి చెలులు పురుషులఁ జూతురు. సమ్మతిగాకున్నను సమ్మతియైనను నేనినుమానఁగలదాననుగాను. సరసముల నా విలాసాంబుధి నోలలాడక విరసపుఁ బనికి నన్నేల ప్రేరేపించెదవు?

అర్జు—కామినీ! నీసరసమునకు నానమస్కృతులు, నీవిరసములకు నాతిరస్కృతులు. నీతో వాదులాడకున్న నాకుఁ బ్రొద్దుపోదని యెంచితివా? ఇంక నేఁ బోయివత్తును.

ప్రమీ—నాకు సుఖమియ్యకయా? ఎన్నఁటికిని నిను విడువను. నాకును నీకు నిందొక్కరుఁ లేరు రమ్మేల సంశయించెదవు ?

## అనుబంధము 37.

ధరణీశా!—అయ్యో! ధరణీశాయని వచ్చుచున్నది—యతీంద్రా! నిను నే మానను. ఒకనాఁడింత నాయభీష్టము నెఱవేర్చిన నీశృంగారమంతయుఁ గొల్లవోవునా? విడువను. నినువిడువను. (ఆలింగనము సేయఁబోవ)

అర్జు—రక్కసీ! నీ వింతటి దానఁగవా? (త్రోయును.)

ప్రమీ—(క్రిందఁబడి కొంతసేపటికి లేచును.)

## [ప్రవేశము: చారుమతి.]

(రూపాంతరమందనున్న సుయోగుని నీడ్చుకొనుచు నార్భటించుచు, మలయవతిం దిట్టుచు.)

చారు—నేవినను. నేవినను. ఊరక విడువను. మారాణితోఁ జెప్పెదను. మలయవతీ! యిట్టిద్రోహము చేసెదవా? వీఁడెంతవేషము వేసికొన్న నేమి? రాయబారమునకు వచ్చిన సుయోగుఁడుగాక వీఁడెవ్వఁడు? మిగిలిన యందఱును జెఱసాలలోఁబడఁగ సుయోగుఁడును నర్జునుఁడును మాయావేషముల వేసికొని పురిఁ జేరియుండవలయు. ఈదురాత్మ్ముఁడు సుయోగుఁడు గదా?

సుయో—కాను కాను.

చారు—నీరోయ్యమీసములు చూచినఁ బదివేవురలో నిను గుఱుతింపవచ్చునే (కొట్టును) మలయవతీ! నీవు పూజించిన సన్న్యాసి యనువాఁడేల యర్జునుఁడై యుండరాదు) వానికి సన్న్యాసవేష మలవాటుగలదికదా! ఎప్పటికి వానికదియభ్యాసము.

మలయ—వాఁడుండఁడు.

చారు—ఉండని యుండకుండని యెందున్నాఁడో తోడ్తెమ్ము. అర్జునున కుండిన వీపు మచ్చ వానికిఁ గలదేమో పరీక్షింతము.

అర్జు—(స్వ) ఇదెట్లు వచ్చెను? విషమపరీక్ష యాయెనే ?

చారు—మలయవతీ! చూపు మాసన్న్యాసిని. ఏల తడసెదవు? ఎందుంచి యున్నావు? రాణి యొద్దకుఁ బిలుచుకొనిపోయి వాని వస్త్రము లన్నిటిఁ దీయించి పరీక్షించెదను. మచ్చ లేకుండెనా నమస్కరింతము. ఉండెనా వానిచర్మము నొలిపించెదను. ఏఁడి యేఁడి యెందున్నాఁడు ?

మలయ—నేఁ బిలుచుకొని వచ్చెదను.

అర్జు—(పరుగెత్తి పోవును.)

ప్రమీ—హా! (అని మూర్ఛిల్లును)

మలయ—పట్టుకొనుము. పట్టుకొనుము. (అని వెంబడించును.)

సుయో—(పక పక నవ్వును.)

చారు—(సుయోగుని చెంపఁగొట్టును.)

(నిష్క్రా.)

శ్రీ

# ప్రమీలార్జునీయము.

## పంచమాంకము-ప్రథమరంగము.

### ప్రమీల యంతఃపురము.

[ప్ర: ప్రమీల-కనకలత-మలయవతి-చారుమతి-మాలతి-మంజువాణి-కాదంబిని-మొదలగువారు].

ప్రమీ—చారుమతీ! నీ వెంతటి పగదాయవే! ఆమోహనాంగుని సరసనైన నను వసింపనీక యట్లొనర్చితివి.

చారు—దేవీ! ఆ క్రూరాత్ముఁడు నిన్నెంతగాఁ ద్రోసెను! అట్టివాని సరస నీవుండి యేమిసుఖ మనుభవించుచుంటివి ?

ప్రమీ—వాఁడు ననుఁ జంపియుండినను సంతోషమునఁ జచ్చుచుంటినే! త్రోసినందుకు నీకేమి వైరము ?

చారు—అమ్మా! నీవు మోహమున నిట్లు మాటలాడెదవు గాక యవమతి నించుకైనను యోచింపవు. నీయట్టితరళాక్షి పైఁబడినను వలదని పొఱఁదోలిన నపుంసకుఁడేటి సరసుఁడు? అట్టివానిఁ బొందుటకంటెఁ బ్రాణమైన విడుచుటమేలు. అట్టివాఁడు గాననే పేడియై—

ప్రమీ—చారుమతీ! నీవూరక వాయున్నదని యాడెదుగాక, నాయట్టి మోహమును దాపమును నీకున్న నీవేమనుచుంటివో?

అనుబంధము 38.

కనక—దేవీ నావిన్నప మంగీకరింపవలయు. నీవు తొలుతనే కొంత యలౌకికముఁ జేసితిని. దానివలన నింతయయ్యె. నీవేల నీపేరుఁ జెప్పుకొనక ప్రమీలదాసి నంటివి?

**ప్రమీ**—కనకలతా! ఒకవేళ నేఁ బ్రమీలయని చెప్పుకొన్న నాపురుషవరుఁ డంగీకరింపకున్న లోకముననున్న వారికంటికి నేఁ బలుచ నాచుంటినేఁగదా? కావున నట్లొనర్చితి.

**కనక**—కావుననే యది యశాస్త్రీయమనుచున్నాను. నీవు ప్రమీలవని యతనికిఁ జెలిసియుండెనా యప్పుడే నీయభీష్టము నెఱవేఱుచుండెను.

**ప్రమీ**—సఖియా! ఏమిమాట యీ యిది? ఆయర్జునుఁడు నారూపమునా. లేక నా పేరునా వరించుచుండెనద? నీ వారయక పలికెదవు.

**కనక**—అమ్మా! అటుగాదు. మొదట నీ వెవ్వరని యా యర్జునుఁ డడిగినప్పుడు మోహంపుమాటల నెన్నియో యాడెఁ జూడుము పిదప నీవు ప్రమీలదాసివని తెలిపిన మనసుఁద్రిప్పె. రాజాధిరాజు దాసిని వరించునా?

**ప్రమీ**—ఇప్పు డేమనుకొనినయేమి ప్రయోజనము? నామోహంపుఁ జిలుక నన్నాదరింపక నాకొక ముద్దయిన నొసంగక చేఁ దప్పిపోయె. ఇంక నే జీవింపఁ జాలను. సఖులారా! ఇంక నాయాశ మానుఁడు. ఈప్రమీల మీకింక గలుగదు. దుఃఖైకభాగిని యగు నీహతభాగ్యురాలు పుట్టనేలేదనుకొనుఁడు. సతీమణులారా! మీరింక మా యనసూయనుఁ బట్టము గట్టుఁడు. అది వయసుగలది యగుటవలన దానిమాఱుగ మీరెల్లరు రాజకార్యముల నిర్వర్తింపుచుండుఁడు. నేను లేనంతమాత్రమున నే యీ రాజ్యము నొరుల కీకుఁడు. కనకలతా, నీవు నాసొమ్ముల నెల్లఁ గైకొనుము. మంజువాణీ! నాశయ్యాగృహము నీవు చేకొమ్ము. మలయవతీ! నా పెంపుడు పక్షుల నీవంగీకరింపుము. మాలతీ! నాచిత్రపటముల నీకొసఁగితి. కాదంబినీ, నావస్త్రముల నీవు తీసికొనుము. ఇంక మీరు నన్ను మఱచిపొండు. ఇట్టి నిర్భాగ్యురాలు మాకుఁ జెలికత్తె యొక్కతెయుండెఁగా యనుటమాత్రము మఱవకుఁడు. నే నేదేని విషముననో జలముననో యగ్నినో త్రాఁటనో యంతము చేసికొనెద.

## అనుబంధము 39.

ఇంక నాకు సెలవిండు. (అని పోవఁబోవ.)

**అందఱు**—హా! (అని పట్టినిలుపుదురు.)

**మలయ**—దేవీ! ఇట్లాడుట నీకుఁ బాడియా?

## అనుబంధము 40.

అట్లు నీయంతము నీవొనరించుకొనునంత యేమివచ్చినది? అట్లుకావలసియే వచ్చిన నేమును నీతోడఁగూడఁ బోవువారము గాక యీతుచ్ఛ రాజ్యమున నీచసుఖముల నాశించి నిన్ను మాని యుందుముమా?

ప్రమీ—అయ్యో! నా కెట్టిపగదాయులే మీరు? ఇట్టిమిత్రశత్రుత్వము సాధించెదరు. నానాథుని నాదండ నుండనీకుండఁ జాపితిరి. నేను నతఁడు నుండియున్న నింకింత సేపునకైన ననుకూల మగుచుండెడి నేమో? అది లేకుండఁజేసితిరి. చంపితిరి. ఆచావున కియ్యకొన్న నన్ను విడువకున్నారు. చంపియుఁ జావనీకున్నారు. ఇంత చూడలే రేని మీచేతులార నను సంహరింపుఁడు, దానికైన సమ్మతింతును.

మలయ—అమ్మా! ఇట్లేల మాటలాడెదవు?

## అనుబంధము 41.

నీవు ఫల్గునుఁ జూడఁగోరి చారుమతితో నతఁ డున్నయెడ కేగి చూచియుఁ దనివిదీఱ వీక్షింప లేదని యూరక చూడవలయు ననికాదే వానిఁబిలుమకొనిరా నన్నంపితివి? చూచినప్పుడె కూడవలెనా? నీ వెంత ప్రార్థించినను నిప్పు డతఁడు నినుఁగలసి యుండునా? ఇంతకే యింతేల యుమ్మలించెదు? ఇప్పుడు మించిపోయి నదేమి?

కనక—దేవీ! ఈమలయవతి మాట సత్యము. ఆయర్జునుఁడు సన్న్యాసి వేషమునఁగదా యిందు వచ్చుట? నీ వతని గుఱుతించినట్లును నతనికిఁ దెలుపక పోయితివి. నీ వెవ్వరగుటయుఁ దెలుపక పోయితివి. ఇట్టిచోరూపాంతరమున నున్నవాఁ డిప్పుడే నిన్నెంతైనఁ బరిగ్రహించియుండునా? ఇంతయోచింపరాదా? మరలవాని నీవుగంటి వేనివాఁ డవశ్యము నీకుఁ జిక్కఁగలఁడు. నేనూరక నిన్నూఱడిలఁబలుకుటకై చెప్పు మాటలుకావు. ఇందే దాఁపుననుండి మేమంతయుఁ దిలకించుచుంటిమిగదా? వాఁడు నినుఁజూచినప్పుడె భ్రమచెంది వితాకుపడెను. అప్పుడు ముఖలక్షణము నాయద్దము నీడ గుఱుతించితిమి. నీవు ప్రమీలదాసివని యతనితోఁ జెప్పుకొనువఱకు మోహాంపు జూపును మాటలును వానిఁ బాయవయ్యె. సమయము స్థలమును నునికిఁ జూచి యిప్పుడొప్పకపోయెఁ గాక వేఱొకటి కాదు. నీవు కొంచెము మించిపోవనిచ్చితివి. త్రోఁపువడితివి. దానిఁజూచి వొడమున యించుక కనలువలన మేమే యాచారుమతిఁ బంపి సుయోగుని నెపమున నంతరాయము గలిగించితిమి. మఱియొకసారి నీవువానిఁ జూచి మాటలాడితి వేని నీ కార్యము సఫలమగును.

ప్రమీల—అయ్యో! మఱియొకసారి వాని నెందుఁ జూతును. ఆ రమణుని పునర్దర్శన మగు భాగ్యము నాకుఁ గలదా?

## అనుబంధము 42.

చారు—ఏల వగఁ జెందెదవు? ముం దెట్టు లాయర్జునుఁడు జరుప నుద్దేశించుటయు నా సుయోగుఁడు నాకుఁ జెప్పఁ గలవాఁడు. ఈ పేమి వేషము స్వీకరించునో యేమి చేయునో యెఱిఁగి యోచింతము.

ప్రమీల—చెలియా! నీ వా లోఁపనుమాట యెంత సులభముగ నెంతవలిగఁ జెప్పుదువే. ఈరాత్రియే నేజీవింపఁ గదా! లోఁపు నేనెవ్వతెను!

కనక—

## అనుబంధము 43.

అయిన నింతాతురముగా నున్న నా కొకటితోఁచు చున్నది. ఈరాత్రి నీవే యాతని శిబిరమునకుఁ బోయిన నన్నియు ననుకూలమగు.

ప్రమీ—నే నెట్లు పోవఁగలను? పోయిన నెట్లు సిద్ధించు?

కనక—అట్లుగాకున్న నేనే యెట్లయినను బోయి యామనోహరు నిందుఁ దోడ్తెత్తును.

మలయ—వలసియున్న నేఁబోయెద. నాపై నర్జునునకు విశ్వాసము మెండు. వాని యెదుట నీచారుమతి నన్నుఁ దిట్టినది యా విశ్వాస మినుమడించి యుండును. పోయి వత్తునా?

ప్రమీ—సఖులారా! మిమ్ముఁ నే నమ్మఁజాలను. నాకిప్పుడుతోఁచుచున్నది మీరే యాపురుషపుంగవుఁ గోరి నాకుఁ గాకుండఁ జేసియుందురని? అట్టిమిమ్ము నమ్మి యర్జును నొద్దకుఁ బంపఁ గలనా? నేనే యెట్లయినను బోయెద.

మలయ, కనక—అట్లే కానిమ్ము.

ప్రమీ—నేఁబోయిన నతఁ డాదరించునా? ఆదరింపకున్న నే నెట్లు సైరింతును?

మలయ—అవశ్య మాదరించును. సంశయింపకుము.

ప్రమీ—అయ్యో! నా కెట్టి భ్రాంత నే? మీ వట్టిమాటల విశ్వసించు చున్నాను. నన్నా మహామహుఁ డంగీకరించునా? అట్లంగీకరింపఁగలవాఁ డేని యప్పుడే సన్మతింపక పోయియుండునా? ఎంత వెఱ్ఱిది నైతి? ఎంత యవమానిత నైతి! ఇట్లయ్యు జీవింపఁ గలయునా?

## అనుబంధము 44

సీ॥ హయమేధతురగంబు నట్టిపోనియ్యక
దిట్టనై నేనేల కట్టనిడితిఁ।
గట్టితిఁ గాక యక్కటా యూరకిట నుండఁ
గూడక యర్జును నేల చూడఁబోతిఁ।
జూడ మా పురుషులఁ జూచినంతనె పట్టఁ
జాలనిమరులు నా కేల కలిగెఁ।
గలిగెఁబో సమయంబు గాదన కిచటికా
తని నేల పిలిపింప మనసు కలిగె॥

తే॥ గీ॥ బాళి నణఁపక యెంతటిబేల నైతిఁ।
బేరు మఱఁగించి యెంతటి వెకలి నైతిఁ।
గోరిక వచించి యెంతటిగోల నైతి।
జనవిభునిఁ బొంద కెంతటియనద నైతి॥

ఇప్పుడె యీకరవాలమున—(ఎత్తును.)

అందఱు—(హా! హా! అని నిలిపి)

## అనుబంధము 45.

చారు—అమ్మా! యించుక తాళుము. నాకొకటి తోఁచుచున్న దిప్పుడు. మావలలకుఁ జిక్కి యిపుడు చెఱసాల నున్నవా రున్నారు గదా? వారివలన నీ కార్యము వశ్యము సాధింప నగు. వారందఱు మే మెల్లెగరులాడి చిన నల్లెగరులాడు చున్నారు. వారికిఁ జెప్పఁ దగినరీతిఁ జెప్పిన నీ కార్యము చేకూరును. (కనకలతామలయవతుల చెవులలోఁ నేమో చెప్పును,)

కనక, మలయ — ఇది మంచిమాట. తప్పక సిద్ధించును.

చారు—దేవీ! నే నింకను దీనికిఁ గారణములు చెప్పుచున్నాను. ఇప్పుడ మే మందఱము కారాగృహము నొద్దకుఁ బోయెదము. (నిష్క్ర—)

## పంచమాఙ్కము - ద్వితీయరంగము.

### అర్జున శిబిరము.

[ ప్ర: అర్జునుఁడు-సుయోగుఁడు. ]

అర్జు—వింటివి గదా నాచరితము?

సుయో—వింటినిగాని నీ వాసతీమణినిఁ జేపట్టకున్నది తప్పని నాకుఁదోఁచుచున్నది.

అర్జు—నాకుఁదొలుత నట్లేతోఁచెను. చూచిన వెంటనే తీన్పవడి నారూపమును సయితము మఱచి మోహపు మాటలాడ సాగితి.

సుయో—అట్లయిన నేల యప్పుడే దానిఁ బరిగ్రహింపవైతివి?

అర్జు—సుయోగా! తెలిసి యిట్లేలడిగెదవు? ధర్మజుఁడధ్వరకంకణముఁ బూని నను హయరక్షకుఁగాఁ బంపియుండ నియమములు మాని. మనవారందఱుఁ జెఱనుండిన చింతలు మాని దాని నేనెట్లు పరిగ్రహింతును?

సుయో—మీమాటయే మేలు. ఊరకడిగితిఁగాక మీ రిట్లు నర్చినదియే శ్రేష్ఠమగు కార్యము. రాజేంద్రా! చూచితివా! మనవారిలో నీమోసకారితరుణులచేతఁ బడనివారు నేనొక్కఁడ, నీవొక్కఁడవు. మిగిలిన యందఱు నెట్లయిరి? ఇట్టి తుచ్ఛేందు వదనలకుఁ జిక్కిన మనపౌరుషమునఁ బ్రయోజనమేమి?

అర్జు—అది యుండనిమ్ము. నీవానాఁడు నిను గుఱితించినవారివలనఁ జెఱసాల నునుపఁ బడక బ్రదికివచ్చినదే మిక్కిలి యెక్కువ.

సుయో—ననుఁ బట్టినగయ్యాళి నన్నేమో యని యెంచియుండెను. నేనుబడుగు వాఁడ నగుట దుర్బలుఁడ నని యెంచెను. మిగిలినయందఱు జరిగిన వెంటనే దానిచీర పయిఁటదానికన్నులకుఁ గట్టినది. ఒకతన్ను తన్నినది. వచ్చినది. (సైగఁజూపును)

అర్జు—సెబాసు! సుయోగా! నీవు మలయవతియనుదానిఁ జూచినావా?

సుయో—దాని నేనే మెఱుఁగుదును? చారుమతియా?

అర్జు—చారుమతి కాదు మలయవతి.

సుయో—అది యెవ్వతెయో.

అర్జు—అది కడు నెఱజాణ. నాయెడ దానికి భక్తికలదు.

సుయో—ఎంతభక్తియున్నను మనము నమ్మరాదు సుమా.

అర్జు—సుయోగా! నీవు ప్రమీలను జక్కఁగఁ జూచినావా?

సుయో—ఎక్కడిది? రాయబారమునకు నేఁ బోయియుండినపుడయినదానిఁ జూడ నైతి.

అర్జు—దానిదాసియే యట్లుండ నింకది యెట్లుండునో?

సుయో—మంచిమాటాయె. నీకేమో యించుక మనసు కలిగినట్లున్నది. ఈమాటల నేమి ప్రయోజనము? ముందు జరుగఁదగినసంగతుల విచారింతము. ఱేఁపు మన మేమి చేయవలయు?

(వెలుపలధ్వని)

అర్జు—సుయోగా! వెలుపలఁ జప్పుడు వినిపించె. పోయి విచారించిరమ్ము.

[ప్రవేశము: చారుమతి (ప్రక్కన.)]

సుయో—(వెలుపలకు వచ్చును.)

చారు—(సుయోగునితో రహస్యమాడును.)

సుయో—(అర్జునునొద్దకు వచ్చి) దేవా! గానవిద్యానిపుణ యఁట! గంధర్వాంగన యొత్తువచ్చి యోలగము నపేక్షించుచున్నది.

అర్జు—గంధర్వాంగనయా! గానవిశారదయా? మేలాయె. ఇపుడు ప్రొద్దెంతైనది?

సుయో—(గడియారము చూచి) జాము రాతిరి యవుచు వచ్చెఁగదా?

అర్జు—నడురేయి యయినను మానె. రమ్మనుము వీనులవిందుగా నింతగానము వినఁగాక.

[ప్ర: ప్రమీల వేషాంతరమున.]

రమణీ! రమ్మింముఁ గూర్చుండుము. ఏదీ! నీవిద్య నింత యాలకించెద. (స్వ) ఎవ్వరీ వనిత! ఎంత రూపవతి? దీనిపోలిక యెందో చూచిన జ్ఞాపక మున్నది.

ప్రమీ— అనుబంధము 46.

అర్జు—అంగనామణీ! నీపాట యపూర్వముగా నున్నది. దీనియర్థమును గడు సారస్యముగా నున్నది. కడు సంతసించితిని.

ప్రమీ అనుబంధము 46.

అర్జు—అంగనామణీ నీపాట యపూర్వముగా నున్నది. దీనియర్థమును గడు సారస్యముగా నున్నది. కడు సంతసించితిని.

కం॥ ప్రవిమలమై సురుచిరమై
నవమోహనమై సుధాభినవమై సరస ।
ప్రవణంబై నీగానము ।
శ్రవణానందంబు నించె జలజదళాక్షీ ॥

నీయభీష్ట మేమి? కామ్యోపహారము.

ప్రమీ—ధరణీశా! గంధర్వులకు మా కీభూషణము లేటికి? ఇట్టివారి మాదాసీ జనములకు దినమొకపదిగా నిచ్చువారము.

అర్జు—అయిన క్షమింపుము. నీయభీష్టమైన నేమి ?

ప్రమీ—నాయభీష్ట మడిగి ప్రయోజనమేమి? నీ చేమైనఁ దీర్పనున్నఁ గదా ?

అర్జు—(స్వ) ఎందో యీధ్వనియు వినియున్నాను. తరుణీ ! ఇట్లేల డిగెదవు ? నేఁ దీర్పఁజాలని దెట్టిది? నిర్భయముగా నడుగుము. ఎట్టిదానినయిన యుక్తముకానిది గాకుండిన నిచ్చెదను.

ప్రమీ—మహాత్మా ! మాలోకమునందంతయు నీరూపవిఖ్యాతి నిండియున్నది. ఎన్ని యజ్ఞము లెన్నితపములు చేసియుఁ బడయఁజాలని యా యూర్వశితానె మోహించి వచ్చినను కలదనిన ధీరత్వ విఖ్యాతియు నిండియున్నది. నాఁటనుండి నినుఁజూడ వలయునని నాయభిలాషము. ఇంత వఱకది సిద్ధింపదయ్యె. నేఁడు నీసేయింపు వచ్చుట సమకూరె. మనోహరా! పురుషులయెడ స్వచ్ఛంధవర్తన లగుమంగళాంగులు దేని నభిలషింతురో దాని వేఁడుదాన.

## అనుబంధము 47.

అర్జు—రమణీ! నీయట్టిగాన విద్యానిపుణయు సరసాగ్రేసరయు నగు యువతి యిటు ప్రార్థించుట భాగ్యము గదా? అయిన నామనవి నింత వినుము. నేను ధర్మజుఁ డొనరించు మఖమునశ్వము వెంటఁ బడివచ్చియున్న వాఁడ. యాగదీక్షనాతఁ డెట్లో యేనునట్లు వహించి నియమవ్రతము సలుపుచున్నవాఁడ. కావున నిపుడు క్షమింపుము.

ప్రమీ—పురుషపుంగవా ! ఇదేమి మాట ? హయరక్షగావచ్చిననీకు నియమము లేల కావలయు! కాముఁడు నను సుమశరముల పాలు సేయుచున్నాఁడు. ఇంచుక తడవీన నాప్రాణములు నిలుచునట్టు లేను.

## అనుబంధము 48.

పురుషపుంగవా! నేవినఁ జాలను. నీవీకార్య మొనరింపక తప్పదు. ఇంతదూరము నుండి నిను వెదకికొని వచ్చిన యతివ కాశాభంగ మిట్లొనర్చుట పాడియా?

అర్జు—కామినీ! నను వెతలం బెట్టకుము. అన్నినియమము అట్లుండ నావెను వెంట సహాయభూతులుగా వచ్చిన మేఘవర్ణ సాత్యకి వృషకేతు ప్రద్యుమ్నాదులు, నీపుర భామినులకుఁ జిక్కి నిర్బంధమున నుండువారు. వాజిమేధహయమును వీరిచేఁ జిక్కి నాకింకను నబ్బకున్నది. ఇట్లుండ నేమి సంతోష మని నేను నీయభీష్టము నెఱవేర్తును? ఊరక నను బాధింపకుము.

ప్రమీల—ధరణీశా! ఈకార్యమున కింత కావలెనా? నీవీపని కించుక సమ్మతించిన నీహయము నీకిప్పింపఁ గలను. ప్రద్యుమ్నాదుల నెల్లఁ జెఱవిడిపించి నీకు ముదము జనించునట్లు చేయఁ గలను. తుద కాప్రమీలనే నీదాసిగాఁ జేయఁ జాలుదు. యోచింపకుము.

అర్జు—(స్వ) ఇదే మీ కాంత యిట్లనుచున్నది! ఇది యెవ్వతెగా నుండునో? (పరికించి) ఈ కామినియా యిపుడు తెలిసెను. అశ్వవనమున నేఁ జూచియుండిన ప్రమీల దాసికాదా యిది? నావలెనిది యిప్పుడీ వేషముఁ బూనివచ్చినది. (ప్ర) కామినీ! నిన్నెఱుఁగుదు లెమ్ము. ఈయూరికి నవీనాగతుండైయున్న యొకయతి నిన్ను నీ యింటఁ జూచి నట్టును వాని సురతిఁ గోరి నిర్బంధపఱచి నట్టును నాయతి యింతవఱకు నాతోఁ జెప్పెను. ఆతఁడు చెప్పిన యంగ మచ్చల గుఱుతు లన్నియు నీయందుఁ గనుపట్టుచున్నవి.

సుగంధివృత్తము.

నీసుధావిలాస మింక నీకె యుండనిమ్ము నర్క
మోసగింప నెంచితే వినోదమే ప్రమోదమే
వేసరంగఁ బోకు నీకు విన్నవించువాఁడ నో
భాసురాంగి యిట్టిభంగి పాడిగాదు మానినీ.

కన్నవారిఁ గలయఁగోరు కాంతలనెల్ల నీ కవ్వడి కాంక్షించు ననియెంచితివా? నీవా ప్రమీలదాసి వగుసుభద్రవు కావా?

ప్రమీల—నరపాలకచంద్రా! ఇంతకువచ్చిన నేనేల దాఁపవలయు? నీవేల యీయుక్తు లాడెదవు? నేనే యాయతీంద్రుతో మాటలాడినదానను. నేఁ బ్రమీలదాసినిగాను, సుభద్రనుగాను. ఆయర్జునుఁడు యతివేషము ధరించి, పురిఁ బ్రవేశించినాఁ డని యెఱిఁగి యతనియభిప్రాయమునుఁ దెలిసికొనక నన్ను నే నెఱింగించు కొనుట యనుచిత మని యెంచి ప్రమీలదాసి నని చెప్పికొన్న యప్రమీలనే నేను. ఇంక

నాశయము గుఱితించితివా? ఇప్పుడైన నాశుద్ధమానసము నెఱిఁగితివా? భూరమణా! నిన్నే నమ్మినదానను. దైవమ వంచుఁ, బ్రియుఁడ వంచు, సఖుఁడ వంచు భావించుచున్నదానను. అనదను, దీనను, నన్యథాగతికను, ననుఁ దెగడనాడకుము. నను నిరాశఁ జేయకుము. విడనాడకుము. త్రోయకుము. నీపాదములయాన. నిను గా కొరుని నేఁ గోరినదానఁ గాను.

అర్జు—(స్వ) అహో! ఈ తన్వియా ప్రమీల? నామది నిది యాకర్షించుచున్నది. అయ్యో! నేనేల బేల నగుచున్నాను? ఇట్లొనర్పుట తగునా? (ప్ర) తరుణీ! నీ కేటికీ భ్రాంతి గలిగె? ఇది వలవని దురాశ. దీని మానుము.

ప్రమీ—ప్రాణేశా! నన్నిటు నిరాదరణ మొనర్ప నాయపరాధమైన నేమి? ఆసుభద్రయు నాయులూపియు నాచిత్రాంగదయుఁ జేసినపుణ్యము నేఁజేయనైతినే! నాథా! నిను మానను. నీ వేమన్నను మానను.

## అనుబంధము 49.

అర్జు—వనితా! ఇదియా నీధీరతనము? ఇంకూరకుండుము. నాకుఁ గోపముగలుగు.

ప్రమీ—నీకుఁ గోపముగలిగిన నను సంహరింపుము. కాదనను. స్వవనితను సంహరించుటకు నాథుఁడు స్వతంత్రుఁడని యందురు గదా?

అర్జు—ఇంకఁ జాలు నీసరసము. వ్యభిచారమున శత్రులఁ గెలువ నుద్దేశించుట వ్యర్థమని యెంచుము.

ప్రమీల—(కోపమున) ఓరీ! మహాత్రింగుంపుచున్న మగువ నెట్లాడిన నాడవచ్చునని కొంటివా? నీవాయి నిన్నాడ నిచ్చినంతయు నాడెదవా; నన్ను వ్యభిచారిణియని యాడెదవా? ఏల పలుకవు? దయ్యమువోలె మగఁడుండ వానియెదుట యమాదులతో సంపర్క మొనరించి మి మ్మెల్లరఁ గనినకుంతి యెట్టిది? మీకన్నులయెదుట మీయిందఱితో నేకరీతిఁ గలయుచున్న నీసతి పాంచాలి యెట్టిది? అట్టిదాని కొడుకవు, నట్టిదాని పతివి నీవు. నీ కిట్టిమాటలు గా కిం కెట్టిమాటలు వచ్చును? అరయనేరక నన్నిట్లాడెదవా? కావలసియున్న నావాక్యము నీతల్లిపై నీసతిపైఁ బ్రయోగింపుము అప్పు డది సమంజసమును సార్థకము నగు.

అర్జు—పవిత్రచరిత్రల నిట్లాడిన నాలుక గోయింతును.

ప్రమీ—నా నాలుక నీవు కోయింతువో నీనాలుక నేఁ గోయుదునో యెఱుఁగఁగలము నిలువుము, (కటారి చేఁబూనును)

## అనుబంధము 50.

అర్జు—తరుణీ! నాప్రాణముపై వచ్చువఱకు నే నంగనలపై బాణ మెత్తను, నీయిచ్చ చొప్పున యుద్ధమాడుము చూచెదఁ గాక.

ప్రమీ—ప్రాణకాంతా! (ఖడ్గముఁ బాఱవైచి) నేనెంతటి పలుగాకిని! ఎంతదుష్కృత్య మొనరించితి? ఇది ప్రణయముగాని నిక్కంపుగనలుగా భావింపకుము. నన్నాదరింపుము. రక్షింపుము.

అర్జు—ప్రమీలా—నీవేల యిట్టిమోసములు చేసెదు. త్రికరణశుద్ధిగా నిను నే వరి—

[ప్ర: రభసముగా భుజబద్ధులై ప్రద్యుమ్నాదులు.]

ప్రద్యు—తాళుము, తాళుము. నిలుము నిలుము. నీవు వరింపనే వలయు తప్పదు.

సాత్యకి—ఔను, ఔను. వరింపవలయు, వరియింపవలయు.

అందఱు—(గట్టిగా) వరింపవలయు. వరింపవలయు.

అర్జు—ప్రద్యుమ్నములారా! ఇదియే మాగడ మిట్లాడెదరు?

ప్రద్యు—ఏయాగడెమును గాదు. నీవు వరింపకున్న నీయిచ్చ చొప్పునఁ బొమ్ము. మేమిందే యుండెదము.

సాత్య—మేము హయము నెత్తుకొని యెక్కడికైనఁ బాఱిపోయెదము. ఇంక స్త్రీజాఁడు మఖము నిర్వహింపని.

మేఘ—ఆహయమును నేఁ గత్తిరించి వైచెదను.

నీల—నేనిక్కడ విడిచిముందొక్కడుగు రాను.

సాంబ—నెత్తిన గుడ్డ వేసికొని నీవేపొమ్ము. మేము రాము.

అర్జు—మీ రేల యిట్లు విజృంభించితిరి? చెప్పినదియైన నేమి?

అందఱు—విజృంభణము? మఱి విజృంభణము. ఇంకను విజృంభణము. నీ వీసరిని వరియింతువా లేదా?

అర్జు—లేదన్న?

అందఱు—మేమందఱము నిన్నెత్తికొనిపోయి చెఱసాలలోనునిచి మానారీమణులతో మేము భోగభాగ్యముల ననుభవించెదము.

అర్జు—సుయోగా! ఈవఱాధు లేల యిట్లయిరి?

సుయో—మీరవశ్య మీనారినివరింప వలయు. కాకున్న నే నిందుండను. వీరివెంటఁ బోయెదను.

అర్జు—నే నే మొవరు నింక?

ప్రమీ—దేవా! ఇందఱు నాళులకు నిను వేఁడు చున్నవారే నీ కేల కరుణ రాదు?

## అనుబంధము 51.

అందఱు—(అర్జునుచే పట్టి-ప్రమీలచేతిఁ గలియఁ జేయుదురు.)

అర్జు—ప్రమీలా! మనవారి కిందఱి కిష్టమైనపని నేఁగా దందునా? అవశ్యము కానిమ్ము. అయిన సవనము కడచను వఱకు మాత్రము ననుక్షమింపుము.

ప్రమీ—ప్రాణేశా! ఎప్పు డెప్పుడు నీవిలాసాంబుధి నోలలాడుదు నని వేకరుచున్న నాకు నిమేష మొకయేఁడై తోఁపఁగలదు. అయినను నీ వంగీకరింతు వని చెప్పినదే పదివేలు. సోమపానమైన పిదప నే నాయధరపానముఁ గానిమ్ము. అయిన నీ హయము వెనువెంట నీతోడఁ గూడి యేతెంచుటకును, యుధిష్ఠిరునకు మాయూరికి వచ్చుటకును ననుగ్రహింపవలయు.

అర్జు—తరుణీ! అట్లే కానిమ్ము.

[ప్ర: కాదంబిని, కనకలత, చారుమతి, మాలతి,
మంజువాణి- మలయవతి, మంజరి.]

స్త్రీలు—(వారివారిపురుషుల బంధనములు వారువిచ్చుచుండఁగా)

## స్త్రీ పురుషులకు వివాహములు.

## అనుబంధము 52.

— మంగళము —

శ్రీ

# ప్రమీలార్జునీయము.

---

## ఉత్తర రంగము.

[ఒకానొక నటుడు ప్రవేశించి.]

---

సీ॥ సతుల కించుకయైన స్వాతంత్ర్య మిచ్చుట
తరము గా దనుపుణ్యపురుషులార!
స్త్రీలకువిద్య నేర్పించిన లోకముల్
మునుఁగు నం చనుధీరమనుజులార
పాటింపఁ గూడ దెచ్చోటఁ గాంతలబుద్ధి
ప్రళయాంతకం బనుభవ్యులార
సుతులఁ గాంచుటకంటె సతులకు నింకొక్క
పనిలే దనెడుమహాప్రభువులార

తే-గీ. ఆలకించిరే ప్రమీలార్జునంబు
సరసితిరె వీరు పురుషుల నాముభంగి
యెంచి చూడంగ నాశ్చర్యమేమి కలదు
బలముగలవారె యెయ్యెడఁ బ్రభులు గారె.

ఉ॥ మానవతీలలామ మగ
మానిసితోడు వహింప కుజ్వలం
బైన మహావనిఁ జతురు
పాయధురీణత నేలి సర్వది

జ్ఞానిత వైభవంబు నన
మానబలంబును గన్న యీప్రమీ
లానళినాయతాక్షికిని
లగు సము లెవ్వరు కీర్తిసంపదన్

సీ॥ అనిలోన నరకాసురుని డీలుపడఁ జేయఁ
బరఁగిన యొక సత్యభామ గలదె
పతికి సారథ్యంబు వఱపి యాదవ సేన
బడలించు నొక్క సుభద్ర గలదె
అరిసతు ల్విధవ లౌనందాఁక ముడిఁ గట్టఁ
జాలని యొక్క పాంచాలి గలదె
రాజ్యధోరణి యెల్ల రాజులు భళి యన
నేలెడు నొక్క ప్రమీల గలదె

ఆ-వె। కలుగ రైరె భరత ఖండంబునను మున్ను
ధీరసతులు విమల భూరియశలు
ఇప్పు డట్టివార లెందైన నున్నారె
లేరు లేరు లేరు లేరు లేరు

సీ॥ మున్నటివా రేల కన్నారఁ గనమె నేఁ
డున్నవారుల వారి నెన్న వలదె
చక్రవర్తిని నావిశాల ధారుణి నేలి
గ్రాలు విక్టోరియారాణి లేదె
పాండిత్యపరిణతోపన్యాసముల నించి
జగమెన్న నానిబెసాంటు లేదె
విమల కావ్యంబుల నమృతంబు గురియించు
జేనాస్టి ననుమందయాన లేదె

తే॥గీ॥ ఈయుడాదుల దెందరో యుండలేదె
పశ్చిమధరాతలంబున భరతఖండ
మున నొకర్తుక యట్టి బల్వానితకలదె
కటకటా యిట్టిదశకేమి కారణంబు.

సీ॥ తనకన్నబిడ్డల కనువార విమలవి
ద్యావినీతుల నేర్పుతల్లి యేది
పితరులు గౌరవస్థితిఁ గాంచఁ గలిగిన
విజ్ఞానధన్యయా బిడ్డయేది
గోడువెట్టక తనకోడలికిని ధీర
చిత్తంబు గలిగించు నత్తయేది
పొరకచేటలఁ గాక పొరి నత్తమామల
గురుబుద్ధిఁ దనియించు కోడలేది

తే॥గీ॥ వరసుధీగరిమంబున వన్నెకెక్కి
తనమగనిఁ దప్పుత్రోవలఁ దగులకుండ
నంకుశంబుగ గృహకార్యమాత్రమెల్ల
భారమువహించి వెలయించు భార్యయేది,

క॥ ఏరాజ్యంబునఁ దరుణులు
దారకళాకుశలసుస్వతంత్రులు గలరో
యారాజ్యంబునఁ బురుషులు
ధీరులు నధికారు లమలధీసువిచారుల్.

క॥ ఏరాజ్యంబునఁ జెలు లవి
చారులు పరతంత్ర లస్తసత్వలు గలరో
యారాజ్యము పురుషుల నా
ధారులు నవిచారు లస్వతంత్రవిహారుల్.

సీ॥ అన్వర్థముగఁ గాంత యబల కావున దయో
జ్వలసమత్వము నింపవలయు సుండి
పుత్రుల కిల మాతృబుద్ధి పొల్పదుఁ గాన
లలన విద్యల నేర్వవలయు సుండి
నీరజాక్షికి విద్య నేర్పినంతనె మగం
డలసి కూడు డికింపవలదు సుండి
స్వాతంత్రమగునంత వనిత పతివ్రతా
భావంబు తక్కువపడదు సుండి

ఆ॥వె॥ విద్య నేర్చినంత విరిబోఁణి స్వాతంత్ర్య
మడర శక్తిఁ వాయు ననుట తగునె
విద్యలేనివారు వెలయాండ్రు కాలేదె
కొందఱవనిఁ కల్లరింద సుండి

సీ॥ స్వాతంత్ర్యమీకున్న వలదు పోవఁగ నిండు
పారతంత్ర్యము మాత్ర వలదు సుండి
పూజ సేయక యున్నఁ బోయే నేలను బెట్టి
కాల రాచుట క్రూరలీలసుండి
ఎల్లవిద్యల నేర్ప నొల్లరో వలవద
జ్ఞానవారిధి ముంచఁ జనదు సుండి
రాజ్యతంత్రముల నేర్పకయున్నఁ బోనిండు
ప్రకృతితంత్రము ద్రుంపవలదు సుండి

తే॥గీ॥ అపుడు మానససుఖము లింపారు సుండి
యపుడు మీపారతంత్ర్యంబు ఉడఁగు సుండి
యపుడు దేశంబు వృద్ధిమై నలరు సుండి
యపుడు మానవత్వము నిశ్చయంబు సుండి

——(o)——

# అనుబంధములు

అనుబంధములు.

1. రాగం-కాంబోజి. తాళము-ఆది.

కమలావరనీదాసుని-కాపాడఁగరారాదె
రమణీయము నీపదసేవనె
సమంచితము మానను దేవా ॥
సాంగవేద పదసంగతకరుణా-పాంగదానవ విభంగచలితసా
రంగపోష సువిహంగమహహా-రమాకరా-సమానరా-రఘు
వీర ॥ ॥ ౧ ॥
సామగాన పరితోష భక్తజన-కామితదాయక తాపహరా
రామకృష్ణ కవిపూజితనామ-రమణీయమణీభ్ర మణీయస్మృణీ ౨

2. త్రిపుటలు— రాగము-శహాన తాళము-రూపకము.

సాటిలేనియావన-వాటిఁజేరనెందు-వర సుఖదము
తోటలెల్లనిండి-సుమములచే-నీటుచేయనిరతసువాసనవెలయ
మంజరీలిబికములు-శింజితము లఁజేసెముదమలరఁగ
మంజాళములనీడ-కదురుచిరము-కుంజపాళి-గనుఁగొనఁగా
మనమలరె. ॥ ౨ ॥
భృంగతతులు ఝుమ్మని-పొంగిపాటపాడ-వినమధురము
అంగజాతుదాటిఁ బురికొలిపెను-అంగనలకు నొల్లని మదిఝ
ల్లనఁగా ॥ 3 ॥
మారుపూజసేయఁగా-కోరుఫలము లిందుకొఅవడవె
కీరతతులమేళములు గలిగెను-చారుకువలసా రసములుపూర
నములు ॥

అనుబంధములు.

౩. హయ— రాగం-కమాజు. తాళం-రూపకం.

తురగాధిపాల్బులార-మీర-లందఱెందఱును
హరి-మేధవాజిపోవుదారి-మీరిపోకుఁడీ
ఏ-సీమ సెట్టి రాజు దీని-జేరిపట్టునో
కడు-భీమభంగిఁ ద్రుంపవలయు-భీతిగానక. ॥ ౧ ॥

ఇదె-యిందుహయము బెదరినిలిచె-నేమిచోద్యమో ముదమంద
న ట్టెపట్టిచుట్టి-ముట్టినిలువుఁడీ. ॥ ౨ ॥

౩. రాగం-దర్బారు. తాళం-ఆది.

స్త్రీలు—భళిరేయెక్కడిదీ హయము-తిలకింపఁగనగునబ్బురము కలి
గిన మనకౌఘనఫలము-బలువిడిదీనిని బట్టుదము(పట్టుదురు)

హయ—నేమపుయజ్ఞ తురంగమము-నేమలిపట్టితిరీహయము భామ
లారనలదీ విధము-కామింపరె చేయఁగ దురము.

స్త్రీలు—సవనతురంగమ మిద్దియైన-జవగతి బట్టెదమిది మానమన
లనుగాని మ్మొక్కమైన-నలరి బెదరుదు మెమదిలోన

హయ—తరముగాదు కావిదినయము-ధర్మజుఁడంపిన దీహయము
మరణం బగునగు సేజయము-పరికింపఁగ లేదేభయము

౫. రాగము-కమాజు. తాళము-అట.

హయ—ఈవాజిమేధ హయము ధర్మ-రాజు పంపెను-రాజవదనలార మీకు
నోజగాదు దీనిబట్ట-రాకుఁడీ-హయము ముట్ట-బోకుఁడీ-తేజి
బట్టరాకుఁడీ. ॥ ౧ ॥

స్త్రీలు—ఎట్టిహయము కాని-మేముపట్టువారము-ఎట్టి రాజు వచ్చెనేనిఁ
గొట్టువార మింక మిమ్ము-గొట్టమే-సవనహయము-బట్టమే-
వైరులఁబడ-గొట్టమే ॥ ౧ ॥

హయ—క్రీడివచ్చెహయము వెంటవిడెచూడుఁడీ-ఈడుగాదు పాడి
గాదు చూడరేల చేడెలార-రాకుడీ ॥ వాఁ ॥

స్త్రీలు—నీడఁబోకవాడియంప వేడిచూపఁగాఁ గ్రీడివచ్చెనేని రుద్రుఁడే
డవచ్చెనేని మేము-పట్టమే ॥ సవనహయము బట్టమే-వైరుల
బట్టికొట్టమె ॥

6. సుయో— రాగం-కమాజు. తాళం-ఆది.

మాకుసలవియె-వీరిగొనియాడఁగా
లోకమున నెందులేని-వీఁకజూచితిమి
యీకరణిసతులమే-మెందు వినఁగంటిమే.
ఈగొయ్యారము-నీశృంగారము
నేయెడ విననుఁ-నెఱుఁగము ధరలో ॥ ౧ ॥

7. రాగం-అసావేరి. తాళం-రూపకం.

అర్జును—మనసిజాతలోలనా రమా- రమా-
ఘనవిశాల-గుణసుశీల-ప్రణుతపాల-నా-
మసనీ-శ్రీ-మా-దే-వి
వనజాసవాసినీ ॥

8. సుయో— రాగం-రంజూటి. తాళం-ఆది.

అబ్బా అబ్బా-యదేమి రూపమబ్బబ్బా-
తబ్బిబ్బులాయెను-నెనుమబ్బుమూనెను
నేనుబ్బిపోవఁజాలను. ॥ పల్ల ॥

అయ్యోఅయ్యో-వెయ్యేలచేరఁజాలను
రావయ్యెమాటలు-లేవయ్యెఁగన్నులు
ఆ-దయ్యమెటులఁగును మాయబ్బా.

9. మేఘు— రాగం-కాంభోజి. తాళంరూపకం.

ఔరాయింతటిపాటువచ్చునె-శూరకోటికి ముదమొదవెడు
సారసాక్షులు-చేరవచ్చిన-క్రూరంబగువైరంబున-సేరితిగ -
బోరాడుద ॥ ఔర ॥

ఇలలోగలశూరాళికి - బహుసాహసమగునేయిటు - కలకల
సవ్వరెజనములం - బలుదుర్యశమలరారఁబెలలనాజన - మిక
జంపఁగ.

10. మేఘు— రాగం-కమాజు. తాళం-ఆది.

పోరాడ మాకుఁదగునే వారులతోడ
పోరగసిగ్గగు-నారులతోడను-వైరమిదేలాగలిగె
చాలఁగబాణము నేలీలబూనుదు-సోలవలసె యూరకె.

11. రాగం-జంజూటిఁ రాళం-రూపకం.

మేఘు—నారీమణితాళెదవే-దారుణమీ-నారసము.
దారుణిమ-ఎంతయును మిక్కిలియు చూడఁజూడ.
మలయ—పోరఁగలవెయసురా-పారకరా-రారయిటు,
ఊరికిని-పారక-వెనుబడి-నాకుమ్రొక్కి.
మేఘు—చేడెవిను నాకనిలో-నోడితినను-మానెరనీ వాడిగల బాణ
మెద-గాడిననే-మాడెదవో (ఈశరము-బాణమెదనీమెదను.)
మలయ—కానికానిహీననిను-న్నానెదనే నేననిలో
నానిశిత బాణములకు-బోనగునే ప్రాణముతో (నీకుమతి ఎం
దునైన వలదని.)

12. రాగం-బ్యాగు. తాళం-ఆది.

మేఘు——సరోజలోచన;విరోధమిది యేటికినాతో రణభూమి.

మలయ——సురారినీచుఁడ-కరాసి నినునేఁదునుమాడనే పొగడేల.

మేఘు——ధరాధరారాతియా-సురేంద్రుఁడేవచ్చిన-దురంబు నాతోఁడఁ
జేయఁగలఁడేమో-యరాళసి రోజయాహవమునవిన్నార్చెదఁ
గనుమా.

మలయ——అదేల సురేంద్రుఁడా-వా-మదేవుఁడే వచ్చిన-విదారణం
బేనుజేయనేరనెమో-మదాంధనీకేమి మానమువలెనా-ప్రాణ
మువలెనా.

13. రాగం-కమాజు. తాళం-ఆది.

మాలతి——ధీరా మేగా-యిదిశూరతనమా
పారిపోకనిల్వుమింక బలుమాటల నాడగనేల.

సాత్యకి——బాలా-చాలా-మేలాయె నీలాగు
పోలదీలాగాజనీకు-పొలతీ-వలఁతీచాలాయె.

మాల——ఊరకె మాటల-ధీరతనముగాదు
భూరిధనువుపట్టి నిలిచి-పొగడం జగడంబీరాదె.

సాత్యకి——ఈ పరితాళిఁగ-నోపుదెయబలా
మాపాలను నిల్చుటిది-మగువా పొగడందగదే.

14. రాగం-కమాజు. రూపకం-తాళం.

సాత్యకి——పోరాడఁజాలవెమో
పొలతీ యాలమున ॥ పోరాడఁ ॥

మాలతి——నీ కేలయీకరుణ
నిక్కముగా ॥ నీ కేల ॥

స్వాత్య—తరుణీనిన్నుఁగన-గరుణయుప్పతిలె
యీాదురమెట్లాడఁగల.
సూల—కరుణాలోకమునఁ-బొరలక నిక్కముగా
నా-శరముల్ద్రిప్రముకా ॥ పల్ల ॥

15. రాగం-జంజూటి. తాళం-ఆది.

వృష—అలముననునాకెదురెవరు-శూలియు నింద్రుఁడు నిలుతురొకో
బాలవు మిక్కిలియు బలపుగా-సోలితివని వడిఁబరుగిడుమా.
మంజు—బాలుఁడవెంతటి మూఢుఁడవు-ప్రేలకు నీవొక శూరుఁడవే
శూలములగు నాబాణములఁ-దాళగల వెమటిబ్రదికెదవే.

వృష—అట్టులైనఁగొను మీాశరముల్-నెట్టినఁదాళుము చూచెదను
గట్టిగనిల్చిన ప్రాణములఁ-బట్టుగనీసెదుఁగనుమ బలా.
మంజు—ఏమిరయంతటి శూరుఁడవే-నామహితాంబక మిదెవిడుతుఁ
సామర్థ్యంబున నీదుశరం-బేమా మ్మనుఁగంటివె బాలా.

16. రాగం-బ్యాగు. తాళం-రూపకం.

సుమో—తీరుగామమేరగాదు-పోరఁగలవెచూడుడీ
ఘోరయుద్ధమాడ నేల-నారులారపిమ్మఁడీ ॥ పల్ల ॥

మంగళాలింగనంబు నంగజాతుసంగము
రంగుమీాఱగోరవలదె పొంగెసంత రంగము.

చారు—సాటిగాదు పాటిగాదు మాజ లేలమానుమా-
సూటిమీాద బాణసమితి-నాటనెందుపోయెదో. ॥పల్ల॥
ఏలయీావిచారమిందు-పోరనిల్చి చూడుమా
లీలతోడనింతలోన-కూలచేతుచాలు నే.

17. రాగం-జంఝాటి. తాళం-ఆది.

కనక—ఒక్కరును-పోరాడువారే-లేరుగదా
ఎవ్వరును-పో॥ కౌంతయుసు పో॥ యుందుమరి ॥ పల్ల ॥

పోరఁగజాలువీరులెలేరు పారాడియారసివేసారితినిమఱి ॥పో॥
కుంతీకుమారుఁడె తటిభటుఁడో - వింతాయెసీయాజినింతైనఁ
గానమఱి.

18. రాగం-బ్యాగు. తాళం-అట.

ప్రద్యు—భాసురాంగీమణీ చూడరాదా-నను-దాసుఁగాఁగై
కొని యేలరాదా-మీసరమా యెను దాళఁజాల. ॥ ౧ ॥
కనక—పోలదీమాటలనాడనేలా-యీలీలసంగ్రామము
మానవేల-దూలిపోవ సరిసోలిపోవ-పడిపోవ-యీ విచారమేల.
ప్రద్యు—మంగళాంగీయిటుపోవకుమా-నాకు-కౌంగిలీక త్రోయకుమా
కౌంగిలీక త్రోయకుమా యిటుభంగమొందఁ జేయకుమా.
కనక—ధీరపిలాసయీతీరుమేలా-యని-పోరకీవిచారములా
పోరకీవిచారములా-కడు ఖరరీతివాదములా. ॥ పల్ల ॥

19. రాగం-జంఝాటి. తాళం-ఆది.

నీల—ఎంతనిపాగడుదునింత-యీ-కాంతలచెలువమునింత॥ మావార
లువెలిరారైరే-యీ-నారులవలఁబడిపోరే, ఏదారినిఁజూచిన
లేరే-యీనారులవలఁబడిపోరే, ఇది-దురాగతముగాదా-దు-
ర్యశంబలసిరాదా-భీతిలేదా-చూడబలువింత. ॥ ఎంత ॥
ఈచానకానకటుపోయె-ఇం-తైన కరుణలేదాయె। తుదలేనినిం
డు వెతలాయె-ఇంతైనకరుణలేదాయె-ఓ-మనోజ్ఞకలవాణీ-నను
గనంగనవెరాణీ-మంజువాణీ-రావె-నాపొంతా.

20. రాగం-పీలు. తాళం-ఆది.

మలయ—కడు-పరాకు మానియాలి పుమా-మా-ఖంగముదేవీ.
పార్థునిభటులు-పారంగదోలంగ-వ్యర్థులమగు
గలిగలిగె-యనర్థములాయె. ॥ ౧ ॥
పోకిమివారితో-బోరంగంజాలక-యోడితి మమ్మయేమనంగా
మేము-నేండబలలము ॥ ౨ ॥

21. రాగం-కాంభోజి. తాళం-ఆది.

ప్రమీల—ఏమిది చిత్రమొయేమియుం దెలియదు
నామదినేమియు-నమ్మిక పొడమదు
ఇలలోన నెందును-దులగానకున్నమి
మ్మలక్రీడి నేండుతా-గెలువంగం జాలెనే. ॥ ౨ ॥

22. రాగం-మోహన. తాళం-ఆది.

ప్రమీల—కానిరమ్మా-మంజరీ
ధనువు నిషంగము తడయక నసియు ॥ పల్ల ॥
నారథ మిప్పుడె-చేరికం బూన్పుము
సారథి వగుము నీపూరక తరుణీ

23. రాగం-నాదనామక్రియ. తాళం-ఆది.

సుయో—అగునే యిది బలద్రోహమే ॥ వా ॥
తగని విరోధము-మిగులంగనగునా
నిరతమునమ్మిన-గురుపునకీగతి
దురితము లెంచుట-పాడియే ॥ ౧ ॥

24. రాగం-కమాజు. తాళం-ఆది.

సుయో—ఈడులేని భాగ్యమలరె-నేమి తెలుపని
నీడనింకమానకనిక గూడియుండుదు
కూడియుండుదు.

వింతమీదె నింకనాదు సంతసంబునీ
చెంతఁ జేర్చుముదము వెలయ-నింతవేడద. ॥ ౧ ॥

25. రాగం-కాంభోజి. తాళం-రూపకం.

ప్రమీల—చాలదే-భూపాలుఁజూచిన-జాలదే
బాలసోముని లీల గేరెడు ఫాలమునుగనఁజాలదే॥ హాళిమీరగ-మేళియురమున- సోలినిరతము బాళిమదనుని- కేళి నెనయఁగ వెలసినఁజాలదే ॥

26. రాగం-జంఝాటి. తాళం-అట.

అందరు—పగమీఱనారీవారముంజంపక
తగనివగలఁ-బడితిమే ॥ పల్ల ॥
మేఘ—మలయ - పతినా-కెంతటి-కార్యము
సలిపెనా - వెలఁదిరా- దెదుటికి ॥ ॥ ౧ ॥
సాత్య—మాలతీ-యీవిధి-దీనత నించె తే
యేలనా-యెడకురా-వళికులా ॥ ౨ ॥
ప్రద్యు—వినుతమౌ నాయశం-బంతయుఁ-బోవఁగా
కనకల-తనుగని -బడలితి ॥ ౩ ॥

27. రాగం-హిందూస్తాని తోడి. తాళ-ఆది.

అందరు—ఘనవేణీననుఁజేర వే-కనికరించి యేలెరవే ॥
మేఘ—నీవాఁడ నేనిక్కముననుఁబ్రోవఁగవూబోణిరో రావేల వెలదీయ
రావేల కరుణ ॥

ప్రద్యు—నను వెలార్పఁగనేటికే-కనకలతాంగనారాగదే
నినునింకఁ గనకున్న మనఁజాల కనకాంగి ॥ ౨ ॥

సాత్య—తాళఁజాలమరుబారికి-జాలమేలనను గావవే మాలతి నీకేటి
కీలాగువగ.

28. రాగం-బ్యాగు. తాళం-రూపకం.

సుయో—దారి-తెలియ-దయో-దూరమెంతచూచిన
అర్జు—ఓరీ మూఢమతీ-ఏలయిట్టులాడెదవు.
సుయో—పాడుపురిని-వీధులెల్లఁ-జూడనొక్క-తీరుగా.
అర్జు—ఇట్టివాడవిందునన్ను-నేలతెచ్చినాడవు.

29. రాగం-చక్రవాకం, తాళం-అట.

మలయ—చాలఁగ శ్రీదము-లీలమై మీపాదము
చాలఁగాగ్రాలుగా. వెయ్యేల కావంజాలుగా ॥ పల్ల ॥
పావనముగా-జేసెనావగు భవనమంత గను నీకుణములోన
దేవధుణీదేవకుంజర దీనజనములఁ గాచుఁగద ॥ ౧ ॥
భూనుతంబగు భాగ్యములరెను-బుణ్యమయ్యెఁజరిత్రము
జ్ఞానమహిమాతీతమయ్యెడ-నేసుధన్యతఁజెందితిని ॥ ౨ ॥

30. రాగం కల్యాణి. తాళం-ఆది.

ప్రమీ—సుందరునిగనకయుండనే మనఁగఁజాలవపూ.
భూపమౌళివచ్చినాఁడు - ప్రాపుమాపకున్న నీ
తాపముబిండఁగ నేగతి-నైపుదునెచ్చెలి.
ప్రమీ—దాఁటఁబారిమేనమాలతి చేరి కేరిప్రాణుఁడో
మానవశరంబులబారికి నారెసుబడనెవనుంక.

31. రాగం-కేదారగౌళ. తాళం-రూపకం.

కనక—తాపమేటికిమ్మనీకు - భూపమౌళినిన్నుఁజెందు
నైపవలదేపైదలియీపాటునకోపవిక.

ఖేదముమానుమిక-గ్రాదిది వేళ చెలి
నీదాసిని-నేఁ దెచ్చెద-భూదారుని మోదమున ॥ ౧ ॥

32. రాగం-నాదనామక్రియ. తాళం-అట.

మాలతి—దేవియేటికింత నీకు-దీనవాక్యము
కర్జ మెల్లఁ దీరె నీ యర్జనంబు పాటె నే.
నిర్జ రేశుఁడైన నేమి నిన్ను మీటె నే.

33. రాగం-నాదనామక్రియ. తాళం-ఆది.

మంజు—ఈవిధినాడెద-వేటికి దేవీ
కావవెకరుణను-గైకొనుమనవిని
సారసుచరితమె-ధీరవిచారమె-కారణమేమీ కలఁక గలుగదా-
ఘోరలీల-విచారమేల-చేకూరదేల యాధారుణీవరుకూరిమి

34. రాగం-కమాజ. తాళం-ఆది.

కనక—వలవకీరీతియోచన-చెలువా తలఁపకు కలఁగకుమింక ॥ పల్ల ॥
నరుడెయదేటికా-సురనాథుఁడు నీచరణదాసుఁడయి సరగు
సనీ-సరసనుబడియడలఁడె. ॥పల్ల॥

35. రాగం-బ్యాగు. తాళం-ఆది.

అర్జు—అంగజునిబంగారు మంగళాంగియీనారి సింగారమంగనాకృతి
గనుపలె-రంగారుచున్నదిగా-యీభృంగవేణి. ॥పల్ల॥
లేదేనిరుద్రాణియో-యా-భూదారుపూబోణియో
కాదేనివిరించికాంతామణియో-యీవేదండగామిని-వాదమేల
కాదు కాదు.

36. రాగం-కమాజు. తాళం-రూపకం.

అర్జు—పరితాపమగుఁజూడుమా
గురుతాప-మీపాప-మేనోప ‖పల్ల‖
మునులఁజెందఁగఁగోరు-వనజాక్షులుందురె
కొనసాగ-దనురాగ-మిదిబాగా ‖ ౧ ‖

37. రాగం-బిలహరి, తాళం-రూపకం.

ప్రమీల—తాళఁజాలను నే-బాళిమీఱనీ-పదములయాన ‖ పల్ల ‖
యీలాగుచల-మేలావల్లభ-వేళాకోళముగద ‖ అనుపల్ల ‖
అర్జు—బాలయీవిధముపోలదెందును-గలిగెడుదురితము ‖ పల్ల ‖
శీలాయీవగ-మేలాసీమది-కేలాగు తెలియదు ‖ అను పల్ల ‖
ప్రమీల—తాపమార్పక - ప్రాపుఁజేర్పక - కోపగించిననేపుమీరునె
యేపారగను-గాపాడవాకో-నాపాపమేమియో. ‖ ౧ ‖
అర్జు—నీకుఁజెల్లునె యీశంకము నాకువింతగుజోకదోచెను
యీకోరికలకీగొన్న నను-ీకాకుపరుపదె. ‖ ౧ ‖

38. రాగం-ధన్యాసి. తాళం-రూపకం.

ప్రమీల—నన్నుగనలకే సఖి నిన్ను వేడెద
తరళాక్షీ నేబడియెడు-పరితాపమునీవెఱుఁగవు
గురుదాహము జనియించెడు ధరణీమువఁగజాలనింక.

39. రాగం-ముఖారి. తాళం-రూపక.

ప్రమీల—చాలను నే-మనియుండఁగ-నకటా-భూమికాలగరిమె-యీ
లాగగు-జాలియేల-బాలలార తెలిఁగులనేమీకెయ్యెడ-నెతిఁగిం
చితినటు చేయుఁడు వెఱువకుడీ యీగతినను - మరచిపొందు
మరచిపొందు.

40. రాగం-పూర్వికల్యాణి. తాళం-ఆది.

మలయ— ఈవిచారిమేటికిల తాంగి-మదిలోన
భామగో యూరక-ప్రాణము వాయుట
కీమాటలాడుట-కేస్సైనదమ్మా ||౧||
వింతవిధంబగు-నిం తేటికిఁకనీ
చెంతకుఁ దెత్తునీ-చేతోవిభుని ||౨||

41. రాగం-ఖమాజు. తాళం-అట.

మలయ } భామాచనదీమానసము
కనక } ప్రేమాయతి నీమాటల నేమాడెద వోమానిని
మలయ—ఇటుతారుమారుగ సారెసారెకు సడలియొడలను బడలి
కడలెదు
ధీరామతి వై రాజిల్లు-కీరీతిగనారీమణి-
కనక—బాలామణీయాలోగనె-దాలాభము-వాలాయము.
చాలన్వేతదూలంగని కేలామణియాలాగున. ||౨||

42. రాగం-ఖమాజు. తాళం-ఆది.

ప్రమీల— తాపమొందఁగఁ జాల నే-సఖమా-తాళఁగలనె ||పల్లి||
పాపమేల యింక-మాపమేమ్ప్రగాత్మ. ||అను పల్లి||
మలయ—ఏలాయీగతింబల్కఁగా దేవి-ఈలాగగు నె ||పల్లి||
యాలోచింపకింత బేలవై తివయ్యో ||అను పల్లి||
ప్రమీ— భూపమౌళి మోము-జూపువా రెలేరె-ప్రాపుజూపిననన్ను-కాపా
డువగగలుగదె.
మలయ— లోలనేత్రభూమి-పాలమౌళివచ్చి-మేలునింపఁజాలు నీలోనఁ
గడుబడలకు-
ప్రమీల— ఈరకాళఁజూపమేరగాదునీకు-నేరంబె వైరంబెనీరేజ
నయనాతగదు.

మల—పోలదింతవంత-యేలకగ్గెనీకు-లోలాక్షీ-చాలా యెమేలా నెవిప
రీతగతి. ॥ ౨ ॥

ప్రమీ—బాలా-తాళ-జాల-వేలార్పకుము ॥ ౩ ॥

మల—అమ్మా-యమ్మా-కొమ్మా-సమ్మోదమగు. ॥ ౩ ॥

ప్రమీ—మసలక-వెసనా-యసువుల్ -వసివాడు.గద ॥ ౪ ॥

మల—లలనా-వలదీ-లలిబల్పాలుకాడఁగను ॥ ౫ ॥

ప్రమీ—కిననిక్క ముగా-మనఁజాలను నె-విన వేటికిన-మనవికరుణఁద
నర-నళిన-నయన.

మల—ఇదేవీ వెతలం-దుదగాం చెదు నె-మ్మదిఁజెందుమునీ-కొదవుముద
ము-ముదన-హరుని-కరుణ.

ప్రమీల—కలవాణి-భరియింపం-బలుతాపం - బరుదయ్యెం - దళితాం
గంబై-యసమానంబై-జ్వలనాభంబై విషమంబై-తలచిన-
బలువెత-గలఁప-గ-దలఁ కెద-నులికెదని దె. ॥ ౬ ॥

మలయ—విను దేవీ-మదిఁగుందం-జను నేపీ-తడిభంగిన్-మనసారంగన్
ఘనమోదంబున్-గొనసాగింతున్-వినునిదె
ఇనవిభు-నెనయఁగ-మనవిని-నుగనఁలకు. ॥ ౭ ॥

43. రాగం-జంజూటి. తాళం-ఆది.

కనక—ఇదేలా-యింతవంత సుందరాంగీ-నీ
ముదంబొదవన్ నేఁడెవచ్చున్-నీవిభుండునీ
ప్రియానందం-బొందుదాన-వింతలోన నే
అయోనీ-తాపమింక- (అయ్యయోనీ) తాపమింక-మాను
మమ్మానీ.
కరాళంబై-తో చెమాకున్-నీవిధానము
యీాదురాపంబైనభంగిన్-హా-దురాపంబైనభంగిన్-
జెందనానెనీ-

44. రాగం-నాదనామక్రియ. తాళం-రూప.

ప్రమీ——భూమీశుండు-నన్ను-గామించు నేయాహాహా
ఈసరసోక్తులుల్లాసమునించు నే
వాసిగనవుమీ-మోసపుమాటలు

45. రాగం-మాండ్. తాళం-ఆది.

అందరు——ఏటికింత తాపమో-చూడవే
మాటికీశో-కమేల-వీడవే ॥పల్ల॥
కనక——మాడఁజాల-నీకునింత తాపము
వేడిచూపఁగాదొకో-పాపము ॥౧
మలయ——వానిఁజూడ నిప్పుడే-పో యెద
మానుమింక శోకమో-కోమలి ॥౨॥
మంజు——ఏల రాఁడో-చూడుమా-నీపతి
బాలచాలు చింతల పాపవే ॥౩॥
మాల——చింతసేయు కమ్మరో-వేడద
వంతబోల-దెంచగా-దీనికి ॥౪॥

46. రాగం-పూర్వి. తాళం-రూప

ప్రమీల——గంభీరమై-తాజిలె
వీడగ మేఘ-ముటు
వాడగ చందురుడు
ఆడగకులగిరు లాకాశమె
అల్లాడగ ధారుణి సోలగ తారలురాలగా

47. రాగం-పీలు తాళం-ఆది

ప్రమీల——భూరమణా రతిగోరుదాన
వాడిశరంబుల వంచనసేయుచు
న్నాఁడుప్రబదుకఁగా నీఁడుమారుఁడు,

48. రాగం-జంజూటి తాళం-అట.

ప్రమీ:—తెరలించెనను మారు-శరములు వేడెద
ధరణీపాలక నన్నుఁ గరుణింపవే. ||పల్లవి||
అర్జు—అతివా తగునె నేను వ్రతము సల్పెదు వాఁడ
మితముగా దిట్టులైన నతి పాపము||
ప్రమీల—హాయనక కైయింత నియమము వలయునె
ప్రియమారఁ గౌఁగిలి-దయసేయవే

49. రాగం-కమాజు, తాళం ఆది.

ప్రమీల—నిన్ను వేడుకొందు నే వన్నె కాడ ||పల్లవి||
విన్నాణమున నన్ను కరుణ మన్నించగ ||అను||
సమ్మోదమునఁ గౌఁగి-లిమ్మని వేడెద
నా-కొమ్మ యనుచు-నెమ్మదిని కానిమ్మనవె.

50 రాగం కమాజు. తాళం-అట.

ప్రమీ:—కొలదిగనక మాటలాడఁగాఁ
గలవా తులువా-పలువా
అర్జు—వెగటు పలుకు లూరకాడఁగాఁ
దగవా-మగువా నగవా.
ప్రమీల—తులువతనము దీటఁగ నీ
తలను గోయఁజాలనె నే
నిలుముక నెదు నాదు కటారి
అర్జు—పొగరు మాటలేటికి నే
మగువల యెడ బాణముల
మిగుల కొదుగఁజాల నిక్కము ||మగు||

52. రాగం-కమాజ్. తాళం-ఆది.

ప్రమీల—ధరణీ-పాలనన్ను-కరుణఁజూడవే
నెమ్మదిని న్నే-నమ్మినదాన

53. రాగం-ఇంగ్లీషునోటు. తాళం.

అందరు—ఆనందంబై చెలంగె మహాసీయానందంబయ్యోఁ ॥పల్లవి॥
ప్రమీల—ఇల నే-గనుధ-న్యనురమణా
అర్జు—బలుధన్యుఁడనే-ఁగదరమణీ
ప్రమీ—విలసిల్లఁగనా. కెన యుపరు
అర్జు—బలుసంతసమా. యెనుతరుణీ ॥ఆనం॥ (1)
మేఘు—మలయా-వతినా-రతసమరా
మల—కలయం-గనుమా. మేఘువర్మా
మేఘు—చెలువా-రదేసం.తసమతివా
మల—పొలుపారదెస.మ్మదమనఘా ॥ఆనం॥ (2)
సుయో—ఘనచారుమతి.నన్నుఁగనవే
చారు—చనుదెంచెదధీ.రసుయోగా
సుయో—మనసంత్రసమే-రికికలదు
చారు—చనదేజనమో-హనగతిగా ॥ఆనం॥ (3)
ప్రద్యు—వడిరాఁగదవే.కనకలతా
కనక—బడినే.నిదేవ-చ్చితిమదనా
ప్రద్యు—కడుసంతసమిం పగుఁదరుణీ
కనక—నుడువం-దరమే-మనముదము ॥ఆనం॥ (4)
సాత్య—సతిమాలతినన్-దయఁగనవే
మాల—వెతదీరెనెసా-త్యకిమదిలో
సాత్య—అతివాకడు సమ్మతిఁగలిగెఁ
మాల—అతిహర్షము.పొంగెరమణా॥ ॥ఆనం॥ (5)

నీల——మదిరా-జిలెనే-మంజువాణీ

మంజు——ఎదనీ-లవ్వాజ-కడుముదమే

నీల——సుదతీ-కడుస-మ్మోద మొదవెఁ

మంజు——సుదిరాగము-నాకిదెయొదవెఁ ॥అస౦॥

54. మంగళం రాగం-మోహన తాళం-ఆది.

అందరు——జగదా-ధారా-సకలకళా

నిగమా-లోకా-నిపుణావుహో

సుగుణా-కాంతా-శుభఫలదా

జగతా-శ్రీక-విపులవిభా

మునిజనతా-వనకమలా-సనహారిలో

వనవినుతా-ఘనసు

పాల-పూజ-స్తియు-శీల

ధీవిశాల-మాపిలోల

పావనాల-పాపినీల-సేవితేలా

భూవిబు ధాసన-కేసల-వాసన-శ్రీసదా

రామకృష్ణ-పూత ॥జగ॥

ప్రమీలార్జునీయనాటకము

సంపూర్ణము.

——(o)——